- వైజ్ఞానిక పాత్రల సృజన
- తొలి తెలంగాణ నవల 'ఆశాదోషం'
- ప్రకృతి మూల స్వరూపమే 'లక్ష్మీదేవి'
- భూమి గురుత్వాకర్షణ శక్తి
- పాండితీ సౌహృదం
- ఋషిత్వం, దేశభక్తి కలబోతే 'కావ్యకంఠ వాసిష్ఠ గణపతి ముని'
- నిత్య సాహితీ వసంతుడు 'నిత్యానందుడు'
- నీలగిరి, తెనుగు పత్రికల శతాబ్ద స్ఫూర్తి

75 आज़ादी का अमृत महोत्सव

# మూసీ

# MUSI


◆ Samputi : 25 ◆ Sanchika : 10 ◆ Pages : 64 ◆ Rs. 20

◆ August 2022

UGC Care List Approved Journal









మూసీ 25 వసంతాలు











# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ...

### వ్యాసాలు


వైజ్ఞానిక పాత్రల సృజన ... ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు 7
తొలి తెలంగాణ నవల 'ఆశాదోషం' ... డా. భీంపల్లి శ్రీకాంత్ 13
మాయాజాలం (బందారం కథలు - 9) ... డా. నందిని సిధారెడ్డి 15
ప్రకృతి మూల స్వరూపమే 'లక్ష్మీదేవి' ... డా. సాగి కమలాకర శర్మ 19
పద్య మనోహరం - 33 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 22
భారతీయీకరణ3 : ఆంగ్లమూలం : బలరాజ్ మధోక్, తెలుగు : కోవెల సంపత్కుమార 23
భూమి గురుత్వాకర్షణ శక్తి - గణపతి 26
పాండితీ సౌహృదం ... డా. శ్రీరంగాచార్య 27
ఋషిత్వం, దేశభక్తి కలబోతే 'కావ్యకంఠ వాసిష్ఠ గణపతి ముని' ... ఎ. శ్రీనాథ్ 29
శ్రీ ఆంధ్ర రత్న ద్యుతులు (గ్రంథాంతరంగం-15) ... ఘట్టమరాజు 33
నిత్య సాహితీ వసంతుడు 'నిత్యానందుడు' ... డా. టి. శ్రీరంగస్వామి 37
నీలగిరి, తెనుగు పత్రికల శతాబ్ది స్ఫూర్తి ... డా. నుగ్గునూతల యాకయ్య 41
శతక కవి - మాటూరి వెంకటేశం ... డా. పెబ్బేటి మల్లికార్జున్ 43
సామాజిక వాస్తవికతకు ప్రతిబింబం-కాలువ మల్లయ్య సాహిత్యం...డా. వేల్పుల కుమారస్వామి 45
అమ్మంగి సహృదయ సాహిత్య విమర్శ - విహంగ వీక్షణం ... గడ్డమీది మల్లేశం 51
కె.విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం 26 ... టి. లక్ష్మీనారాయణ 55


### కవితలు


అమృతమయం ... అవధాని భానుప్రకాశాచార్య - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; స్నేహాలు ... కోట్ల వెంకటేశ్వర రెడ్డి - 6; నిరంతరం ... డా. ఎన్. గోపి - 12; లేనిచోట ... రామ్ పెరుమాండ్ల - 12; వికాస రేఖలు ... గురిజాల రామశేషయ్య - 14; సముద్రం నా గురువు ... డా. తండు కృష్ణ కౌండిన్య - 31; కల్లోల కూడలి ... డా. వడ్డాపురం కృష్ణ - 32; మంచి మనస్కుడు ... డా. గన్నోజు శ్రీనివాసాచారి - 36; నాగళ్ళకు సంకెళ్ళు .. అన్నవరం దేవేందర్ - 40; పంచ కంద పద్యాంజలి ... కట్ట రంజిత్ కుమార్ - 50; మరణం ... కందుల శ్రీను - 50; జగద్గురోర్భారతి ... డా. వొజ్జల శరత్‌బాబు - 62.


### సమీక్షలు


తాత్త్విక జ్ఞానానికి గ్రంథాలయం 'నీహారిక గజళ్ళు' .. కళ్ళెం నవీన్ 54
సాగి కమలాకర శర్మ మూడు గ్రంథాల ఆవిష్కరణోత్సవం 59
స్వీకృతి ... 61


**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**


వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**

సంపుటి : 25 సంచిక : 10
ఆగస్టు - 2022
'శుభకృత్' శ్రావణ మాసం

**సంపాదకులు** (EDITOR)
**సాగి కమలాకర శర్మ**
**SAGI KAMALAKARA SHARMA**

**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
**డా. దత్తయ్య అట్టెం**
**Dr. DATTAIAH ATTEM**

Printed and Published by
B. Anantha Laxmi

*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796
UGC APPROVED JOURNAL

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

ISSN 2457-0796


UGC Care List Approved Journal

మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 10 (4) హైదరాబాద్ ఆగస్టు : 2022

## సంపాదకీయం







వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి


స్థాయి విస్తరించాలి


దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**





# సమయం

కాలం, శపథం, అనుజ్ఞ, ఆచారం, సిద్ధాంతం, జ్ఞానం, సంకేతం, అవసరం, నియమం అనే అర్థాల్లో వినియోగించబడేది సమయం. సమ్యక్ ఈయతే అనేనేతి సమయః – దీని చేత తెలుసుకోబడుతుంది కాబట్టి సమయం. సమ్యగయతే సమయః – అయగతౌ – లెస్సగా తెలుసుకొబడుతుంది. సమయానికి సంబంధించి ఇన్ని అర్థాలను మనం గమనిస్తే నిత్యజీవితం అనేది సమయంతో ముడిపెట్టబడింది అనే విషయం అవగతం అవుతుంది. మన జీవన విధానంలోని అన్ని అంశాలను, పూర్వీకుల అంశాలు, భవిష్యదంశాలను అన్నింటినీ సమయ వ్యవహారంలోనే చెపుతున్నాం. సమయానుకూలంగానే ప్రవర్తిస్తున్నాం. అయితే కాలార్థాలు, కాల విభాగాలు అనేక రకాలుగా ఉంటే మళ్ళీ ఈ సమయం అనే విధానం ఎలా వచ్చింది. అర్థాలు ఎందుకు మారినాయి? ఈ అంశంలో నూతనంగా మరో ప్రతిపాదన చేసుకోవచ్చు.

మయం అంటే కూడుకున్నది అనుకుంటే అనేక రకాలుగా మయ సంబంధ శబ్దాలు మనకు దర్శనమిస్తుంటాయి. మృణ్మయం, వినిమయం, జలమయం... అంటూ కూడుకున్నది అనే అంశంలో మయం అనే శబ్ద ప్రయోగం కనిపిస్తుంది. దేనితో కూడుకున్నా దాని చివర మయ శబ్దాన్ని వాడుకోవడం మనకు వ్యవహారంలో కనిపిస్తున్నదే.

కాలం కూడా ఈ భూమి మీద ఉన్నప్పుడు మాత్రమే గమనించ దగింది. భూమిని దాటిన తర్వాత పైకి వెళ్ళి చూస్తే కూడా భూమి పరంగా లెక్కలు పెట్టాలి కాని, నిజానికి విశ్వానికి, విశ్వశక్తికి సంబంధించి కాల విధానం ఏమీ కనిపించదు. ఆ శక్తి నిరంతర ప్రవాహమే. ఒక వేగంతో ఒక వస్తువును ఆధారంగా చేసుకొని సంచారం చేస్తూ ఉండడం వల్ల కాలగణన చేస్తుంటాం. నిజానికి కాలానికి జ్యోతిష శాస్త్రం 'దైవం' అని పేరు పెట్టింది. భూత వర్తమాన భవిష్య కాల పరిజ్ఞానమితి దైవం – దైవం జానాతీతి దైవజ్ఞః – అని దైవజ్ఞుని గూర్చి నిర్వచనం ఇచ్చింది. అంటే కాలం దైవ స్వరూపం. దైవానికి లింగభేదం లేదు. మన ఇష్టం. శక్తి స్వరూపం దైవమే. శక్తి స్వరూపాన్ని ధరించిన ప్రతీదీ దైవమే అని మన సనాతనుల భావన. అటువంటప్పుడు అన్నింటికీ దైవమనే అర్థం. చూడగలిగే వానికి చూడగలిగినంత. సర్వాణుమయమంతా దైవమే. అణువులలో కూడుకున్నదంతా శక్తి మాత్రమే. అందువల్ల శక్తి తో కూడుకున్నదానికి 'మయం' శబ్దం మనం వినియోగిస్తే 'సమయం' అనేది అతనితో / ఆమెతో / దానితో కూడుకున్నది అనే అర్థంలో వినియోగించుకోవచ్చు. వ్యాకరణ నియమాలు ఏవిధంగా ఉన్నా సమయ శబ్దమంతా శక్తిమయం, భగవన్మయం, అణుమయం, ఆనందమయం అనే అంశాలుగా అర్థం చేసుకోవచ్చు.

సమయం అని పేరు పెట్టడంలో ప్రతి క్షణం అతని మయం కావాలి. ఆ శక్తిని నిరంతరం అనవధానంగా గమనించగలగాలి. ప్రమాదాలలో పడకూడదు. అనవధానమే ప్రమాదం. పాంచభౌతిక శరీరంలోని ఇంద్రియాల ద్వారా గమనించే ప్రతి అంశమూ ఆ శక్తి మనతో ఉన్నప్పుడే సాధ్యం అవుతుందని, ఆ శక్తి మన నుండి దూరమైతే ఈ శరీరం అటువంటి అవకాశం కోల్పోతుందనే స్పృహ ఉండాలి. ఈ కాలం, ఈ లోక వ్యవహారం, ప్రకృతి వ్యవహారం అంతా 'సమయం'గా గుర్తించాలి. అప్పుడు మాత్రమే సమయాన్ని జాగ్రత్తగా వినియోగించుకునే అవకాశం ఉంటుంది. అలా గుర్తించని వాడు, శక్తిని సరియైన విధంగా వినియోగించుకోలేడు. కాలానుగుణమైన జీవన విధానాన్ని నెరవేర్చలేడు. సమయాచారాన్ని పాటించలేడు. కాలాతీతుడు కావాల్సిన వాడు కాలంలో కలిసిపోతాడు. మనం కాలాతీతులుగా మారడానికి ప్రయత్నించాలి. మన తర్వాతి కాలంలో మనకంటూ గుర్తింపు ఉండాలంటే సమయాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాం.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 10 5 హైదరాబాద్ ఆగస్టు : 2022

# అమృత మయం

ఎవ్వారి రుధిరమ్ములీ నేల ప్రవహించి
  తేజమ్ము మొలిపించు బీజమయ్యె!
నెవ్వారి ప్రాణమ్ములీ నింగి లీనమై
  శక్తులన్ కురిపించు సత్వమయ్యె!
నెవ్వారి ధైర్యమ్ములీ వహ్నిలో జేరి
  చరణముల్ కదిలించు కిరణమయ్యె!
నెవ్వారి చైతన్య మీ గాలిలో జేరి
  యుద్విగ్నభరితమౌ నూపిరయ్యె!
నెవ్వారి పోరాట మీ జలమున నిండి
  చేతనన్ గురిపించు చేవయయ్యె!
వారు పాంచభౌతికముల వరలినారు
వారు స్వాతంత్ర్య వీరులు ! ధీరవరులు!
వారలమృత మూర్తులు గదా!వసుధకెపుడు!
వారినావహించుకొనగ వరలు ధాత్రి!!




తెల్లవారిని బంప తెలివితో నడుగేసి
  తెగువను జూపిన దేశమేది?
సత్యమ్ము ధరియించి శాంతిని నెలకొల్పి,
  దివ్యశక్తులు నింపు దేశమేది?
ప్రాచీన శాస్త్రాల పాండిత్య గరిమతో
  దిశల మ్రోగినయట్టి దేశమేది?
స్వాతంత్ర్య ప్రేరణన్ సత్వమై తనువంత
  తేజమ్ముగా దల్చు దేశమేది?
నాదు భారత దేశమ్మె నాకమిదియె!
నాదు స్వాతంత్ర్య దీప్తియే నవ్యశక్తి!
నాదు గాథల స్మరణమ్ము మోదమొసగు!
వరలు భారతదేశమా వందనమ్ము!






అవధాని భానుప్రకాశాచార్య
సంగారెడ్డి, ఫోన్ : 9603204507

# స్నేహాలు

నాకు
చిన్నప్పటినుంచీ
క్రూర మృగాలతో స్నేహం లేదు!



అంతా
పిల్లీ కుక్కా పిచ్చుక
కొంచెం ఎక్కువ కోకిలలతో!



పీక్కు తినడం
అలవాటు కాలేదు కాని
పిచ్చి ఆనందంగా ఉండేవాడిని!

వయసు మీద పడుతున్న వేళ
నన్నో వలయంలోకి నెట్టారు
లోన ఆకలితో ఒక కాల సింహం!



పైన
స్నేహితులు ఈలలేస్తున్నారు
లోన కసిగా సింహం వెంటాడుతున్నది!

ఎంత ప్రయత్నించినా
నా శరీరానికి మనసుకి గాయాలతో
మలిసంధ్య రంగులద్దుతూనే ఉంది!



కుక్కలు విశ్వాసం కోల్పోయినవి
పిచ్చుకలు ఎగిరిపోయినవి
పిల్లి జాడ లేదు కోయిలలు స్వరం మార్చినవి
నేను కదలిక కోల్పోయే దాకా
సింహం ఆకలి తీరేటట్లు లేదు
ఒంటరి యుద్ధం ఎంత భయానకం?!

కాలం కాటేసినప్పుడు
పెంపుడు స్నేహాలూ
క్రూరమృగాలూ ఒకటే!!




**కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
**ఫోన్ : 9440 233 261**

# తుకారాం అభంగం

అతని నామ సంకీర్తనలు
మాయాజాలాన్ని తుడిచేయును
కమల నాథు కరస్పర్శను
నీపై నిండుగ పంచుచుండును

పదరసము పెదాల నుండ
పాదరసము పాదాల నిండా
తాల ధ్వనులు గుండె చప్పుడై
కదిలిపోవే హరిద్వారము

విడువబోకు పురాణ శ్రవణం
విడువబోకు సంకీర్తనం
మనసు నందు హరిధ్యానము
నిను చేర్చు పరమధామము

తుకా పలుకు నిదే ఉపాధి
నీ ముక్తికిదే మందుబిళ్ళ
హరిభక్తి పంచు వికాసము
యడద బాపు అది సాంతము





**అనువాదం : డా॥ మంత్రి శ్రీనివాస్**
**ఆదిలాబాద్.**
**ఫోన్ : 83283 33720**

# వైజ్ఞానిక పాత్రల సృజన

**ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు,** అధ్యక్షులు, తెలుగుశాఖ, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం. ఫోన్ : 9441330511

కాలంతోపాటే సామాజిక విలువలు మారుతుంటాయి. విలువలు మారినప్పుడు కొత్త సమస్యలు తలెత్తుతుంటాయి. పారిశ్రామిక విప్లవం మానవప్రగతికి ఎంత దోహదం చేసిందో, దానివెంట అన్ని సమస్యల్ని మోసుకొచ్చింది. మానవ ప్రస్థానంలో జరిగిన ప్రతి పరిశోధనను నీడలా వేరొక సమస్య వెన్నంటి వస్తూనే ఉంది. ఒకప్పుడు అంటురోగాలు, ప్రకృతి బీభత్సాలు మానవజాతిని శాపగ్రస్థులలా వెంటాడి బాధిస్తే, ఇప్పుడు మానవుని స్వార్థచింతన కొత్త సమస్యల్ని తెచ్చిపెట్టింది. శాస్త్ర పరిశోధనలు, ప్రభుత్వ ఆరోగ్య పథకాల వల్ల మశూచి, కలరా వంటి వ్యాధులు తగ్గి మరణాల సంఖ్య బాగా తగ్గిందనుకుంటే, జననాల సంఖ్య పెరిగి జనాభా పెరిగింది. దీనికోసం పరిమిత కుటుంబ భావనను ప్రచారం చేసి, ఒకరిద్దరు పిల్లలున్న కుటుంబాల్ని ప్రభుత్వాలు ప్రోత్సహించటం ప్రారంభించాక వయోవృద్ధుల సమస్య ప్రారంభమైంది. ఇప్పుడు ఇరవై ఒకటో శతాబ్దంలో ఇండియానే చూద్దాం. మధ్యతరగతి కుటుంబాలలో బాగా చదువుకొని పిల్లలు ఉపాధికోసం విదేశాలకు పోయి స్థిరపడుతున్నారు. తల్లిదండ్రులు చదువులున్నవారైతే కొందరు పిల్లలతోపాటే విదేశాలకు వెళ్ళి కొద్ది రోజులుండి వెనుదిరిగి రావటమో లేక అక్కడే ఉండి పోవటమో చేస్తున్నారు. వీళ్ల శాతం అత్యల్పం. మిగిలినవాళ్ళంతా పిల్లలు పంపే డబ్బుల్ని ఆస్తులరూపంలో భద్రపరచి వాటి సంరక్షకులుగానో, పిల్లల రాకకోసం ఎదురుచూస్తూనో ఉన్నారు. వీళ్ళ వార్ధక్య సమస్యల్ని డబ్బు పరిష్కరిస్తుందా? ఈ స్థితే కొనసాగితే ఇండియా Old age home గా మారిపోతుందనటానికి బాధపడ వలసిన పనిలేదు.

ఈ వార్ధక్య సమస్యను గురించి పాత్రలను చిత్రించటంలో రచయిత వాళ్ల ఆర్థికస్థితిని నేపథ్యం చేసుకుంటాడు. డబ్బులేని స్థితిలో వార్ధక్య సమస్యలు, డబ్బున్న స్థితిలో ముసలితనపు సమస్యలు, పిల్లలు లేదా అయినవాళ్లున్నప్పుడు, లేనప్పుడు ఇలా భిన్న భిన్న నేపథ్యాలలో నుండి చూచినప్పుడు ఏ శతాబ్దంలోనైనా వృద్ధుల జీవితాల పట్ల సమాజం, మనుషులు ప్రవర్తించే తీరొక్కటే. ఆధునిక కాలంలో వృద్ధుల శరణాలయాలు, Old age homes కొంత బాసట కల్పించినా అవి సంపూర్ణ పరిష్కారాలు కావు. ఆ నేపథ్యంలో వచ్చిన సమస్యలు కొన్ని ఉన్నాయి. వీటన్నిటినీ రచయితలు పాత్రలుగా చేసి చర్చించారు. వృద్ధుల నిరాదరణ సామాజిక రుగ్మతగా ఆధునిక ప్రపంచంలో పరిణమించింది. జరామరణాలు ప్రతి ప్రాణికీ తప్పనివే అయితే అవి కొందరి విషయంలో ఎంత అమానుషంగా ఉంటాయో రచయితలు చిత్రించినప్పుడు పాఠకుల గుండెలు చెమరుస్తాయి.




ఉదా॥ సిలియాడేలీ (Celia Dale) రాసిన 'ఎ హెల్పింగ్ హ్యాండ్' నవలలో 'ఫింగాల్' – పాత్ర. ముసలిఫింగాల్‌కు డబ్బున్నప్పటికీ ఆమె అనుభవించిన సమస్యలు చూస్తే, దేశం ఏదైనా మానవ మనస్తత్వాలు, సమస్యలు ఒక్కటేనని అనిపిస్తుంది.

వార్ధక్యం ఎందుకు వస్తుంది? దీనిని అరికట్టగల మార్గాలు లేవా? సగటు మనిషి డెబ్బై ఏళ్లకే వృద్ధుడై అనారోగ్యంతో అశక్తుడై బాధ పడుతూంటాడు. ఈ వార్ధక్య లక్షణాల్ని రూపుమాపి 150 ఏళ్లు బ్రతికే అవకాశమున్న మందుని కనిపెట్టిన ఒక శాస్త్రవేత్త వద్ద ఫార్ములాను కొట్టేయటానికి దేశాలు, వ్యాపారసంస్థలు చేసిన కుట్రల్ని 'ది పిజియన్ ప్రాజెక్ట్' – అనే నవల వివరిస్తుంది. దీని రచయిత 'ఇర్వింగ్ వాలెస్'. లోకంలో జరిగే యదార్థ సంఘటనలకి డా॥ మాక్‌డొనాల్డ్ అనే శాస్త్రవేత్త పాత్రను కల్పించి, అతను కనుగొన్న ఫార్ములా అతనికే ఎలా ప్రాణాంతకమయిందో చిత్రిస్తాడు రచయిత. ప్రకృతికి భిన్నంగా ఆలోచించటంలోని అసహజత్వాన్ని ఇందులో చిత్రించటమొక పార్శ్వమైతే, మార్కెట్ మాఫియా ఎలా ఉంటుందో పరిచయం చేయటం మరొక పార్శ్వంగా నవల సాగుతుంది.

ప్యారా సైకాలజీకి సంబంధించి, వివిధ రోగాలకు సంబంధించి ముఖ్యంగా క్యాన్సర్, ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధుల గురించి, రోబోటిక్స్ వంటి వాటిని గురించి ఫిక్షన్‌తో కలిపి రాసిన సైన్స్ నవలలు చాలా వచ్చాయి. వీటిలో పాత్రల్ని రచయిత ఎలా సృష్టిస్తాడో గమనిద్దాం.

రచయితలు వివిధ విజ్ఞానాత్మక విషయాల్ని జోడించి రాసే రచనలలో పాత్రల్ని సృష్టించటమొక సవాల్‌గా ఉంటుంది. పాఠకులకు కొత్త విషయాన్ని చెప్పాలన్న జిజ్ఞాసతో పాటు, ఆ విషయాన్ని ఆహ్లాదంగా అందించే నేర్పు కూడా రచయితకు కావాలి. అందుకు అవసరమైన విజ్ఞానాన్ని రచయిత సముపార్జించుకోవాలి.

ఉదా॥ కొమ్మనాపల్లి గణపతిరావు రాసిన 'అరణ్యకాండ' – నవలనే తీసుకుందాం. వివిధ జంతువుల ప్రవర్తన ఎలా ఉంటుంది? అనే విషయాన్ని చెప్పటం కోసం కథను తయారు చేసుకున్న ట్లనిపిస్తుంది. దానికో సెంటిమెంటల్ త్రెడ్‌ని మెలి వేశాడు. ఒక సాధారణమైన పులికి, నరమాంసాన్ని మరిగిన రాయల్ బెంగాల్ టైగర్‌కి మధ్యగల వైవిధ్యాన్ని గుర్తించి, మనుషుల్ని తినే ఆ జంతువును తుద ముట్టించటానికి చైతన్య అనే ఫారెస్ట్ ఆఫీసర్ పాత్రను ప్రవేశపెట్టి అతను పడ్డ శ్రమ, విలక్షణమైన ఒడుపులతో ఢీకొన్న తీరు, వివిధ జంతుజాలాల ప్రవర్తన పద్ధతులు రచయిత ఎంతో శోధించి చిత్రించాడు. జిమ్ కార్బెట్, కెన్నత్, ఆండర్సన్‌ల నేర్పుతో వేట తీరుతెన్నుల్ని, చైతన్యపాత్ర ద్వారా చెపుతాడు. ఇక్కడ కేవలం చైతన్య పాత్ర ఆధారం మాత్రమే. విషయమంతా జంతు ప్రవర్తనను చెప్పటమే. ఇందులో ఉన్న పాత్ర ద్వారా ఆ నవల పాఠకుడిని ఆసాంతం చదివించేలా చేస్తోంది. చైతన్య ఉదాత్త ప్రకృతి, జంతువుల స్వభావాలు పాఠకుడి మనసుని ఊపిరి సలపనీయవు.

అలాగే కుక్కల్ని గురించి, వాటి వలన కలిగే రేబిస్ గురించి తెలియజెప్పే 'భైరవ' నవల, పాముల్ని గురించి తెలియజెప్పే బ్లాక్ మారబ్' – వంటి వాటిలో పాత్రలు చెప్పదలచిన విషయానికి ఆధారంగా నిలబడేవి మాత్రంగానే ఉంటాయి పాత్రలు.

అయితే ఈ వ్యవహార వేతృత్వాన్ని కలిగించటంతోపాటుగా మానవునికున్న మనసును, దానితో పెనవేసుకున్న మమకారాన్ని బంధాల్ని చెప్పగలిగినప్పుడు పాఠకుడు ఆ రచనను కేవలం సమాచార వినిమయంగానే భావించడు. ఉదా॥ 'A Walk in the Dark'– నవల చూడండి. ఇది గైడ్ డాగ్స్ గురించి రాసింది. కానీ మన మనసుల్ని పట్టేస్తుంది ఇందులోని స్పీవ్ పాత్ర.

ఇంగ్లండ్, స్కాట్లాండ్, వేల్స్ వంటి దేశాలలో, చూపులేని అంధులకోసం కుక్కలకు ప్రత్యేక శిక్షణనిచ్చి, అవి అంధులకు అలవాటయ్యేందుకు అంధులకు మళ్లీ శిక్షణనిస్తారు. అలా మాలిమి అయిన కుక్క – మనిషి, ఒకరితో ఒకరు సమన్వయమై, అంధునికి రెండు కళ్లయి, అంధుడిని బజార్లకు, బీచ్‌కి, బస్సు, రైలు ప్రయాణాలకు, విపరీతమైన రద్దీగల ప్రదేశాలకు అతి సునాయాసంగా తీసికెళ్లి క్షేమంగా తీసుకవస్తుంది. అలాంటి 'గైడ్ డాగ్స్'తో సెంటర్స్‌ను నడిపేవారు, కుక్కలకు గైడ్ ట్రయినింగ్ ఇచ్చే వ్యక్తులు ఉన్నారు. అటువంటి నవలే జాయిసి స్ట్రేంజర్ రాసిన 'A Walk in the Dark' నవల. 'స్పీవ్‌డ్రాక్' – అనే కర్షకుడు ప్రమాదవశాత్తు చూపును కోల్పోతే, 'గమ్మా' – అనే కుక్క (గైడ్ డాగ్) ఎలా ప్రాణస్నేహితునిగా మారింది వర్ణించి చెపుతుందీ నవల.

ఈ నవలలో అంధుల అవసరాలకు అనుగుణంగా ఎలా శిక్షణ నిచ్చేదీ రచయిత్రి విపులంగా చెపుతుంది. నగరాల్లో, పొలాల్లో, షాపుల్లో, ఇంట్లో – ఇలా కుక్కలు ఏ ప్రదేశాల్లో గుడ్డివారితో ఉండాలో, గుడ్డివాళ్ల కళ్లకు ప్రతీకగా ఉండాలో కనుక్కొని అటువంటి పరిసరాలకు అనువుగా శిక్షణనీయటం, ఏ వయసునుండి కుక్కపిల్లలకు ఈ శిక్షణ ప్రారంభిస్తారో, ఎలా ఇస్తారో, వాటితో మసలే వ్యక్తులు ఎలా గైడ్ డాగ్స్‌తో వ్యవహరించాలో పూర్తి వివరాలను రచయిత్రి వివరిస్తుంది. యజమానికి – కుక్కకీ మధ్య ప్రేమ నమ్మకం కుదిరేలాగా రెండు వైపులా నమ్మకముండాలని అలాంటి నమ్మకం కుక్కకు కుదిరించినట్లయితే, అది జీవితాంతం యజమానికి విధేయత చూపించి, ప్రాణాల్ని కూడా అర్పిస్తుందని రచయిత్రి చెపుతుంది.

ఈ రచనలో చెప్పదలచుకున్న విషయమిది. కేవలం ఆ సమాచారం మాత్రమే చెప్పినట్లయితే అది సృజనాత్మక రచన అయ్యేది కాదు. ఎవరికోసం 'గమ్మా' – గైడ్‌డాగ్ అయిందో ఆ వ్యక్తికి నాలుగేళ్ల తరువాత ఆపరేషన్ ద్వారా కళ్లు వచ్చినప్పుడు మరొకరికి ఉపయోగపడుతుంది కదా! అని సెంటర్ వాళ్లు వెనక్కి తీసుకపోతారు. అతి తెలివైన తన పెంపుడు కుక్క 'లిగ్' ఉన్నప్పటికీ స్పీవ్ 'గమ్మా' కోసం బెంగపడటం, గమ్మా సెంటర్‌కు గాని, మరో ఇతర యజమానితో గాని ఎడ్జస్ట్ కాకుండ పడ్డ సంవేదనల్ని చెపుతూ కథను నడపటం వలన అపురూపమైన నవలగా ఇది భాసించింది.

మూగ జీవాల పట్ల ఆబాల్యంగా ప్రేమగల ఈ రచయిత్రి తను పెంచిన కుక్కలు, పిల్లలు, పక్షులూ వంటి పెంపుడు జంతువుల్ని ఆసుపత్రుల్లో నున్న పేషెంట్లకి, వృద్ధులకీ ఇచ్చేదట. పెంపుడు జంతువులపై 50 పుస్తకాలు రాసిన ఈమె, పెంపుడు జంతువుల ప్రభావం రోగులపై ఎలా ఉంటుందో నిరూపించిందని చెబుతాడు.

మానవజాతికే కాదు వాతావరణానికి, సృష్టిలోని జీవరాశిలోగల సంతులనానికి సవాలుగా మారిన మానవ వర్తన, సాంకేతిక వైపరీత్యం గురించి డాఫ్నడిమారియర్ 'బర్డ్స్' – అనే నవల చర్చిస్తుంది. నాగరికత పేరుతో శతాబ్దాలుగా నాశనం చేయబడుతున్న పక్షిజాతి తిరగబడితే ఎలా ఉంటుంది? మనిషికి ఆహారంగా ఉన్న పక్షే మనిషిని ఆహారంగా పీక్కుతింటే? తిండిలేనప్పుడు, ఆకలిగొన్న పక్షులేం చేస్తాయి? దీనికి సమాధానమే 'బర్డ్స్' – అనే నవల.

సెల్‌ఫోన్ టవర్స్ విడుదల చేసే సంకేతాలవల్ల ప్రకృతిలోని తూనీగలు, తేనెటీగలు వంటి పక్షిజాతులు వివిధ రకాల పర్యావరణ జీవరాశి ఎలా ధ్వంసం కాబడుతుందో చెపుతూ 2006 స్టీఫెన్ కింగ్ 'సెల్' – అనే నవల రాశాడు. దానినే తరువాత సినిమాగా కూడా తీశారు.

డిక్ ఫ్రాన్సిస్ రాసిన 'నెర్వ్' – అనే నవలలోని 'రాబ్' – పాత్ర ద్వారా గుర్రపుందేలలోని 'జాకీ' – వృత్తిలోని పోటీ, అసూయ, వ్యక్తిగత ద్వేషాలూ, వీటినధిగమించి సంపాదించుకునే పేరు ప్రతిష్ఠలు, కష్టనష్టాలనూ అన్నిటినీ రచయిత చర్చిస్తాడు. ఈ నవలను చదివినప్పుడు గుర్రపుందేలలోని ఎన్నో విషయాలు, సమాచారము తెలుస్తుంది.


వైద్యుడిని నారాయణునిగా ఆరాధించే లోకంలో వైద్యులు చేసే దుర్మార్గాలు అన్నీ ఇన్నీ కావు. కార్పొరేట్ ఆసుపత్రులు చేసే దోపిడీ అనుభవమవ్వటం మొదలయ్యాక ఆ రంగంలోని లోపాల్ని ఎత్తిచూపే రచనలు వచ్చాయి. వైద్యవృత్తిలో మామిడిచెట్లు, కలుపుమొక్కలూ రెండూ ఉన్నాయి. ఆ వృత్తి వెనుకనున్న విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వపు తీరుతెన్నులూ, వైద్య సంఘాల గుడ్డి అభిప్రాయాలు కంచుకోటలలాగా వైద్యుల్ని కాపాడుతున్నాయి. ఈ వృత్తిలోని అవకతవకల్ని, అవినీతిని వీటిపై అవగాహన కలిగిస్తూ 'సిటేడల్' – నవలను ఎ.జె.క్రానిన్ రాశాడు. ఇందులోని యాండ్రూ పాత్ర ద్వారా వైద్యవృత్తిలోని లొసుగుల్ని చెపుతాడు.

తెలుగులో 'హౌస్‌సర్జన్' – నవల అప్పట్లో సంచలనం సృష్టించిన నవల. డా॥ ఎస్. మధుకరరావు అప్పుడే చదువు పూర్తిచేసుకుని, హౌస్‌సర్జన్సీలో చేరిన కుర్రాడు. సామాన్య కుటుంబం. తండ్రి లేకపోతే తల్లే ఉన్న ఆస్తిని అమ్మి డాక్టరు చదివించింది. ఓ చిరునవ్వుతో చుట్టుపక్కల అందర్నీ ఆకట్టుకోగలిగిన ఈ కుర్రాడి హౌస్‌సర్జన్సీ అనుభవాలే డా.కొమ్మూరి వేణుగోపాలరావు రాసిన 'హౌస్‌సర్జన్'. ఇదొక మెడికల్ డైరీ.

'ఆర్థర్ హైలీ' అనే బ్రిటిష్ కెనడియన్ రచయిత 1965 ప్రాంతాల్లో "హోటల్" లాంటి ఇన్వెస్టిగేషన్ రచనలు చేస్తున్న సమయంలో వచ్చిన పుస్తకం ఇది. ఈ తరహా రచన తెలుగులో ఇదే మొదటిది, ఈ నవల అన్ని భారతీయభాషలలోకి అనువదించబడింది. అప్పట్లో చాలామందిలో ఈ పుస్తకం డాక్టర్ కావటానికి ప్రేరణ అయిందని చెప్తారు. ఇంకో విషయం యేమిటంటే, హైలీ రాసినా, ఆ తర్వాత తెలుగులో మరి కొంతమంది రచయితలు రాసినా, ఇన్వెస్టిగేషన్ రచనల పేరుతో ఒక వస్తువుకి సంబంధించిన కథని ఎంచుకొని, మలుపులు తిప్పుతూ తాము చెప్పదలుచుకున్న సమాచారాన్ని అందులో యిమిడ్చారు.

ఇందులో పెద్దగా కథలేమి లేవు. మెడికల్ హౌస్ సర్జన్సీ చేసేప్పుడు మెడికల్ వార్డులు, పీడియాట్రిక్స్, ఇ.ఎన్.టి, చెస్టు డిపార్టుమెంట్లలో పోస్టింగ్సు వుంటాయి. సర్జికల్ హౌస్‌సర్జన్సీ టైములో అన్ని సర్జికల్ వార్డులు, ఆర్థోపెడిక్, ఆప్తమాలజీలలో పోస్టింగ్సు వుంటాయి. ఇవి కాక గైనిక్, కాజువాల్టీలలో పోస్టింగ్సు వేరే వుంటాయి. డా॥ మధు హౌస్‌సర్జన్సీ ప్రయాణం మెడికల్ వార్డు, ఔట్ పేషెంట్లతో ప్రారంభమై, తర్వాత సర్జికల్ పోస్టింగ్, ఆ తర్వాత గైనిక్, ఆ తర్వాత పబ్లిక్ హెల్త్ పోస్టింగ్ నుంచి స్పెషల్ పోస్టింగ్‌లోకి వచ్చి, కాజువాల్టీ, దాన్నుంచి రేడియాలజీతో హౌస్‌సర్జన్సీని పూర్తిచేసి, టైఫాయిడ్‌తో సిక్ అయి, స్టూడెంట్ సిక్ రూములో రోగిగా చేరి, ఆ అనుభవం కూడా కూడగట్టుకొని, పై చదువులకోసం ఇంగ్లాండ్ వెళ్ళిపోతాడు. ఒక్కొక్క విభాగంలో చూసిన రోగాలు, వాటి ట్రీట్‌మెంట్, రోగులు, వాళ్ళ మనస్తత్వాలు, ఎమర్జెన్సీలు, అసిస్టెంట్లు, డాక్టర్లు, నర్సులు, చీఫ్‌లు అలా ప్రతి అంశాన్ని తడుముకుంటూ నడుస్తుంది ఈ యాత్ర.

ఓ మంచి డాక్టరుకి సహనం, సమయస్ఫూర్తి, ధైర్యం, అంతకుమించి మానవత్వం చాలా అవసరం. మెడిసిన్ మీద శ్రద్ధాసక్తులున్న ఎవరికైనా హౌస్‌సర్జన్సీ పీరియడ్ మహత్తరదశ అని నమ్మిన డా॥ మధు తనకెదురైన ఎన్నో అనుభవాల్ని మనతో పంచుకుంటాడు. సెలైన్ ఎక్కించడానికి వెయిన్ దొరక్కపోతే మొదటిసారి 'ఓపెన్ మెథడ్'లో చర్మంకోసి రక్తనాళం బయటికి తీసి ఎక్కించటంతో డాక్టరుగా సాహసం మొదలవుతుంది. మరో రోజు డిఫ్తీరియా వచ్చి ఊపిరాడక విలవిలలాడుతున్న ఓ మూడేళ్ళ కుర్రాడికి వైద్యం చేయవలసి వస్తుంది. యాన్టీడిఫ్తీరిక్ సీరం ఇచ్చి ఇ.ఎన్.టి. సర్జనుకి కబురు పెడ్తాడు. గంటలోపల ట్రెకియాటమీ చేయకపోతే పిల్లాడు బతకడు. ఇ.ఎన్.టి. డాక్టరు డ్యూటీ అయిపోయి ఏదో సినిమాకి వెళ్తాడు. ఏం చేయాలి? విద్యార్థిగా వుండగా ఒకటి, రెండుసార్లు చూసిన జ్ఞాపకంతో తప్పని పరిస్థితులలో




ఆపరేషన్‌కి సిద్ధపడ్డాడు డా॥ మధు. చెయ్యకపోతే పిల్లాడు బతకడు. సరిగా చెయ్యక పోయినా బతకడు. ప్రాణం కాపాడటం కోసం సాహసం చేసి నెగ్గుతాడు. డా॥ మధు ఎదుర్కొన్న యిలాంటి ఎన్నో అనుభవాలని రచయిత మనల్ని దగ్గరకు తీసుకెళ్ళి, చూపించి విడమరచి మరీ చెప్తాడు. అదీ ఇన్వెస్టిగేషన్ రైటింగ్ అంటే, మనల్ని కూడా యిందులో లోతుగా మునిగిపోయేలా చేయటం రచయిత సాధించిన విజయం.

ఓ రోజు అంబిలికల్ హెర్నియాతో ఓ రోగి వస్తాడు. ఆలస్యంచేసి పీకలమీదకు తెచ్చుకుంటాడు. రోగికి చావు బతుకుల సమస్య. ఆపరేషన్ చేయడానికి మంచి కేస్ దొరికిందని డా॥ మధు సంతోషిస్తూ, "ఒక రకంగా వైద్యవృత్తి అతి క్రూరమైనది. హార్టు కేసు చూసిన ఫిజీషియన్, "ఆహా! వినండి, వినండి మర్మర్. ఎంత బ్యూటీఫుల్‌గా వినిపిస్తోందో" అంటాడు. ఈ వృత్తిలో ఎంతో దారుణం దాగి వుంది" అని స్వగతంలో అనుకుంటాడు. ఇది వైద్యవృత్తిలోని మరో కోణం.

డా॥ మధుతో పాటు వచ్చేపోయే పాత్రలు, చీఫ్, డా॥ రంగనాథం, డా॥ కామేశ్వరి, హాస్పిటల్ సూపరింటెండెంట్, డా॥ దయానంద రాజు, మెడికల్ అసిస్టెంట్స్, డా॥ నాయుడు, డా॥ రామదాసు మొదలైన వాళ్ళంతా ఒకటి, రెండు పేరాల పరిచయమే అయినా పుస్తకం మూశాక మనల్ని వదలరు. తోటి డా॥ మృదుల ప్రేమ, నర్సు నళినీ ఆరాధన ఈ మెడికల్ డైరీకి కాస్త తడిని కలిగించి ఈ రచనని నవలగా మారుస్తాయి. డాక్టరుకి నర్సుకి వుండే చిత్రమైన రిలేషన్, పరిధులు దాటే కొంతమంది నర్సులు, వాళ్ళతో తిరిగే డాక్టర్లు, రకరకాల మనస్తత్వాల రోగులు, హాస్పటల్ని నడిపే నియమ నిబంధనలు, ఇవన్నీ మరో ప్రపంచం. ఆ విషయాల్ని తెలుసుకునేందుకే పాఠకులు ఎగబడ్డారు. రచయిత కోరుకుంది కూడా అదే.

చిత్తరువు మధు రాసిన I.C.C.U. కూడా డాక్టర్ వృత్తి నేపథ్యంలోనుండి వచ్చిందే. రాబిన్‌కుక్ రాసిన 'కోమా' – నవల వైద్యవృత్తిలోని ఘాతుక చర్యల్ని ఉద్దేశించింది. 'సుశాన్' అనే వైద్యవిద్యార్థిని పాత్ర ద్వారా ఆ ఘాతుకాల్ని వెలికితీయటం అంటే ప్రపంచానికి తెలియచెప్పటం ఇందులోని ప్రధానాంశం. ఆపరేషన్ థియెటర్, మందులూ, కేస్‌షీట్లు మొ॥న వాటి గురించి సులభంగా బోధిస్తుందీ నవల. కోమాలోకి పేషెంట్‌ను పంపి కిడ్నీలవంటి అవయవాలను కాజేసే మాఫియా గురించి డా॥ హెరాల్ట్ వంటి పాత్రల ద్వారా హెచ్చరించటం ఇందులో ప్రధానాంశం.

రాబిన్ కుక్ మెడికల్ థ్రిల్లర్స్ రాశాడు. ప్రతి మెడికల్ థ్రిల్లర్ వెనుక మానవజాతి భవిష్యత్‌లో ఎదుర్కొనబోయే అనూహ్య సమస్యల హెచ్చరిక చేసే పాత్రలుంటాయి. 'మోర్టల్ ఫియర్' – అనే నవల 'కార్పొరేట్ హాస్పిటల్'– గురించి రాసింది. డా॥ హెూవార్డ్, డా॥ హైమ్స్ ప్రధాన పాత్రలు. రహస్య భేదన చేసిన డాక్టర్‌గా హెూవార్డ్ పాత్ర కనిపిస్తుంది.

మనిషి అవయవాల్ని, నెత్తరును, దేహంలోని ప్రతి భాగానికి ధరకట్టి అమ్మి, ఆ మనిషి ప్రాణాన్ని విలువలేని నిరుపయోగ వస్తువుగా పెంటకుప్ప మీదికి విసిరే తత్వాన్ని నిరసించే ప్రబోధం చేస్తుందీ నవల.

కవలలుగా జన్మించిన పిల్లల్ని మనం చూస్తున్నాం కాని అసహజంగా దేహాలు రెండూ కలిసి జన్మించిన పిల్లల విషయంలో ఆపరేషన్ చేసి వేరుచేయటం పత్రికలలో చూస్తున్నాం. తలవరకు కలసి ఉంటే ఆపరేషన్ తలకు చేస్తారు. అలా కాక ఒకరి దేహం ఒకరికి అంటుకపోయి జన్మతః ఒక విచిత్ర పరిస్థితికి లోనయి పుట్టిన వారి స్థితి ఎలా ఉంటుంది? అటువంటి వ్యక్తులు అరవై ఏళ్లదాకా బ్రతికినప్పుడు వాళ్ల జీవిత సరళి ఎలా ఉంటుంది? ఒకేసారి నిలబడి, ఒకేసారి కూర్చొని, ఒకేసారి పడుకొని జీవించటం ఎలా సాధ్యం? ఒకే ఇంట్లో ఒకే మాటమీద ఇద్దరు వ్యక్తులు బ్రతుకలేరు. అటువంటిది 24 గంటలూ ఒక దేహాన్ని మరోదేహం అతుక్కుని అరవై ఏళ్లు బ్రతకటం విడ్డూరమే. పైగా వాళ్లు పెళ్లి చేసుకున్నారు. విడి విడిగా భార్యలు, కుటుంబాలూ ఉన్నాయి. ఇది 19వ శతాబ్దంలో జరిగిన ఒక జీవిత చరిత్ర. నేటి థాయ్‌లాండ్ సయాంలోని మెకలాంగ్ అనే పల్లెటూరిలో 1811వ సం॥లోని మే నెలలో జన్మించిన చాంగ్ ఎంగ్‌ల చరిత్ర. దీనిని కేట్ హంటర్ ఒక పుస్తకంగా రాసింది. తుంటి దగ్గర కలసియున్న కవలలు – గంగా, గౌరి అనే వారిని మనదేశంలో నలభై, యాభై ఏళ్ల క్రితం అనేక ప్రదర్శనలలో చూపించారు. ఇప్పుడు వాళ్లు ఉన్నారో లేరో తెలియదు. అటువంటి అవిభక్త కవలలను బాల్యంలోనే విడదీయటం సాధ్యమని నేటి వైద్యవిజ్ఞానం నిరూపిస్తుంది. ఇలా వైద్యరంగంలోని పురోగతిని తెలియజేస్తూ వచ్చిన రచనలూ ఉన్నాయి.

యండమూరి సైన్స్, ఫిక్షన్ కలగలిపి రాసిన 'అష్టావక్ర' – జెనెటిక్స్‌కు సంబంధించింది. మనిషి పుట్టుకతో వస్తున్న భూత వర్తమాన భవిష్యత్తుల పరిణామాన్ని సైన్సు నేపథ్యంలో చర్చిస్తుంది.

లాయర్ వృత్తికి సంబంధించిన 'ఎ టైమ్ టు కిల్', 'ది ఫరమ్', 'దిపెలికన్ బ్రీఫ్', 'ది క్లయింట్', 'ది చాంబర్' – ఇవన్నీ కోర్టులు, హైకోర్టులు, జైళ్లు, మరణశిక్షలు, పిటీషన్లు, వాయిదాలు – వీటన్నిటితో పాఠకుణ్ణి ఒక లీగల్ ప్రపంచంలోకి తీసుకపోయి, న్యాయవాదులు వేసే ఎత్తులు పై ఎత్తులను తెలియజేస్తాయి.

భవిష్యత్తుకు సంబంధించిన ఊహాత్మక భావనలతో ముందడుగేసిన శాస్త్ర సాంకేతిక రంగాల అన్వేషణ, అంతరిక్షశోధన కాలయానం, సమాంతరమైన కొత్త ప్రపంచం, గ్రహాంతర వాసం, కృత్రిమమేధ, సమాచార నియంత్రణ, కొన్ని పద్ధతులతో అమరత్వం, ఏకాంతం మొదలైన ఊహలతో శాస్త్ర సాంకేతిక రంగాలలో, కొత్తగా కనుగొన్న వాటిని, సాంఘికంగా వాటి పరిణామాల్ని గురించి వైజ్ఞానిక నవలలు బోలెడన్ని వచ్చాయి. సమకాలీన సమాజంలోని పూర్వాపరాలను పరిశీలించి వర్తమాన స్థితికొనసాగితే భవిష్యత్తు ఎలా ఉంటుందో ఊహించి కొంతమంది రచన చేశారు. ఇంగ్లీషులో హెచ్.జె.వెల్స్ రాసిన టైమ్ మిషిన్ సైంటిఫిక్ ఫాంటసీ అనిపించినా భవిష్యత్తును గురించి ఆలోచించి చేసిన రచన. కొన్ని వేల సంవత్సరాల తరువాత ప్రపంచ మానవాళి గురించి వెల్స్ చేసిన ఊహ ఆశ్చర్యంగా కనిపిస్తుంది. మెదడు మాత్రమే పెరిగి మిగిలిన అవయవాల అవసరం తరిగి శరీరం క్షీణించి పోవడం వెలుగులో జీవించే సుఖవ్యాధి చీకట్లలో మగ్గిపోయే కష్టజాతి ఉద్భవించటం వెల్స్ చేసిన ఊహ. 1949లో వచ్చిన ఈ నవల మానవుడు తన యాంత్రికతకు తానే బలైపోవటం చెబుతుంది. ఫ్యూచరాలజీ మీద వచ్చిన రచనలన్నీ దాదాపు ఇలాగే భవిష్యత్తును దయావహంగా చిత్రించాయి. తెలుగులో ఫ్యూచరాలజీ పై వచ్చిన రచనలు తక్కువే కాని యండమూరి వీరేంద్రనాథ్ 'ఆనందోబ్రహ్మ', మైనంపాటి భాస్కర్ 'బుద్ధిజీవి', ప్రభువుల చంద్ర 'రేపటి మనుషులు', యన్.ఆర్.నంది

'31 డిసెంబర్ 1,99,999' అనే నవలలు ఫ్యూచరాలజీ గురించి వచ్చినవి. ఇవన్నీ ఊహల మీద ఆధారపడ్డ కాల్పనిక రచనలే. భవిష్యత్తు గురించి ఆశను కల్పించకపోగా భయాన్ని కలిగిస్తాయి. ఇటువంటి రచనలలోని పాత్రలు కూడా ఈ ప్రణాళికలో భాగంగానే చర్చించబడతాయి.

సైన్స్ ఫిక్షన్‌లో వాస్తవానికందని మానవాతీత కల్పనలు, వింతలూ, విచిత్రాలతో కూడిన ఆశ్చర్యకరమైన కల్పనలూ ఉంటాయి. అంతరిక్ష యుద్ధాలు, గ్రహాంతర వాసాలు, అంతరిక్ష సాహసాలు, సైబర్ నేరాలు, ఘోరాలు వంటివి కనిపిస్తాయి. ఎంత కల్పన ఉన్నప్పటికీ సైన్స్ కనుగొన్న ఏదో ఒక సత్యాన్నో సూత్రాన్నో పునాది చేసుకునే రచయిత కథను అల్లుతాడు. భావిసంభావ్యతను ఊహిస్తాడు.

రచయితలు మరో కల్పిత ప్రపంచాన్ని సృష్టించి, ఊహాత్మకమైన సాంకేతిక విజ్ఞానాన్ని కల్పించి పాత్రల్ని నడిపిస్తారు. సమాంతర ప్రపంచాల్ని సృష్టించి అంతరిక్షయానాన్ని, గ్రహాన్వేషణను, గ్రహాంతరరహస్యాన్ని, యుద్ధాల్ని, అనుకున్నదే తడవుగా శక్తిని ఒకచోటి నుండి మరోచోటుకు బదలాయించటం, చేత్తో పట్టుకోకుండా ఏ పరికరంలేకుండా వస్తువుల్ని ఒక చోటునుండి మరోచోటుకు కదల్చటం, భావనావహనం (Telepaty), బుద్ధిని నియంత్రించటం, భూత భవిష్యత్కాలాలలోకి పయనించటం వంటి ఆశ్చర్యకరమైన అద్భుతావహమైన వ్యవహారాలతో పాత్రలు ఉంటాయి. ఈర్ష్యాసూయలు గల వ్యక్తులు రోబోలకు సెట్ చేసే ప్రోగ్రామింగ్‌ను తమకు వ్యతిరేకులైన వ్యక్తులపై పగ తీర్చుకునేందుకు ఉపయోగించుకోవటం, ఏ అపరిచిత గ్రహాంతరవాసో ప్రత్యేక ప్రయోజనం కోసం వచ్చి ఆ ప్రయోజనానికి మానవుల్ని వినియోగించుకోవటం, కొన్ని సందర్భాలలో ఆ గ్రహాంతరవాసులు పూర్వపు మానవులే కావటం, వాళ్లు శుద్ధ సాత్వికమూర్తులై ఉండటం, శాస్త్రవేత్తలు రహస్య ప్రయోగశాలలలో పరిశోధనలు చేస్తూ కొత్త ఫార్ములాల్ని కనుగొంటే ఆ ఫార్ములాలను కొట్టేయటానికి గూఢచర్యం చేసే మాఫియాలు, కుటుంబాల్ని వదలి పరిశోధన పిచ్చితో అంకితమైన పరిశోధకులు, కృత్రిమమేధవలన కలుగుతున్న లేదా కలుగబోయే దుష్ఫలితాలు చెప్పటం, కావాలని గాడ్జిల్లాలాంటి విపరీత ప్రవృత్తిగల జంతువుల్ని సృష్టించటం, వివిధ శాస్త్ర సాంకేతికాంశాల్ని అవగాహన కల్పించటం కోసం పాత్రల్ని సృష్టించి రచనలు చేస్తుంటారు. సీనియర్ సైన్స్ ఫిక్షన్ రచయితలు సందర్భాన్ని బట్టి సుదీర్ఘమైన తాత్త్విక చర్చల్ని చేయటం కూడా లేకపోలేదు. మానవులు X గ్రహాంతరవాసులు, సాంకేతికత X అసాంకేతికత, సంప్రదాయము X అభ్యుదయం, వంటి సంఘర్షణలు కల్పించి నీతినియమాల గురించి, నైతికతను గురించి చర్చించటం కనిపిస్తుంది.

సైన్స్ ఫిక్షన్‌లోని పాత్రలు దాదాపుగా అతిశయమైన శక్తియుక్తులు కలవిగానే రచయితలు సృష్టిస్తుంటారు. ప్రధాన పాత్రలు సహజంగానే Super Natural గా వ్యవహరిస్తుంటాయి. ఈ రచనల్లోని పాత్రలు కూడా సమాచార వినిమయం కోసమే ఉంటాయి.

## ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.
తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.
330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.
అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.
**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

## 'కదంబం'


**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం **'కదంబం'**.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**





# నిరంతర

కవిత్వం ఎలా సంభవిస్తుందో
ఎవరు చెప్పాలి!
కవిత రాస్తూ కవి
కాస్త కాస్త ఖాళీ అవుతుంటాడా!
అది నిరంతర ఊట అని
ఎడతెగని పాట అని
వ్యాఖ్యానించేదెవరు!

అతడు కవితను రచిస్తున్నాడా
కవిత అతణ్ని రచిస్తున్నదా!
ఇద్దరిదీ ఒకే రసస్యంది ప్రక్రియ.
బహుశా ఇప్పుడు
అతడే ఓ కవిత.

పదాలు పాతవే కావచ్చు
కాని వినూతన స్ఫూర్తి వాటి దీప్తి
రాళ్ల మీద నీరెండ పడి
వింతగా మెరుస్తున్నట్టు.

గిరి శిఖరం
భూమికీ అందక
ఆకాశానికీ చెందక
ఒంటరితనంలో కూడ
అందంగానే వున్నట్టు
కవిత్వం బాధామనోహరం.

కాలంలో ముంచి రాసిన
నవీన పదబంధాలు
జీవితాన్ని
అపూర్వంగా నిర్వచిస్తాయి.
విభిన్నార్థాలెన్నున్నా సారాంశమొక్కటే.

మళ్లీ మొదటికొస్తే
కవిత్వం ఎలా సంభవిస్తుందో
ఎవరికీ అంతు పట్టదు.
అన్వేషణలో ఉన్న కవికే
పుట్టే దాకా తెలియదు.
అదొక బోధ పడని వైచిత్రి
తుఫానులో చుక్కల రాత్రి.

డా. ఎన్. గోపి
ఫోన్ : 939 102 8496

# లేనిచోట

నిన్నటి వార్తలన్నీ వెతికితే
నిజం కానరాలేదని
నిప్పు భగ భగ మండుతున్నది
ఎండుకొమ్మ మీద వాలిన
పక్షులన్నీ చిగురు కోసం
ఎదురుచూస్తుంటే ఆకాశంలో
మేఘము నవ్వుతున్నది
గాయాలను దాచిన మాటలన్నీ
గేయాలుగా కదలాడుతుంటే
వినలేని హృదయాలు
గాఢ నిద్రలోకి జారుకున్నాయి.

మనుషులే లేని ఇంటిలో
గదులన్నీ ఖాళీలవుతుంటే
ఫుట్‌పాత్‌పై మెదిలే అనాథలు
జీవితతత్త్వాన్ని మోస్తున్నారు
లేనిచోట
కనలేవు వినలేవు
ఎన్నటికీ కనుగొనలేవు ...
నువ్వు కూడా
అచ్చం అలాగే నువ్వులేని చోట
నిత్యం నీకోసం వెతుకుతూ
నిన్ను ఎన్నటికి పొందలేవు....





– రామ్ పెరుమాండ్ల
ఫోన్ : 9542 265 831


# తొలి తెలంగాణ నవల 'ఆశాదోషం'

**డా. భీంపల్లి శ్రీకాంత్,** ఫోన్ : 90328 44017

తెలుగు సాహిత్యంలో వెలుగుచూసిన అనేక ప్రక్రియలపై వాదోపవాదాలు జరుగుతూనే ఉన్నవి. అది నవల కావచ్చు. కథ కావచ్చు. తెలుగులో మొట్టమొదటి నవల ఏది? అనే అంశంపై చర్చ కొనసాగుతూ ఉండగానే తెలంగాణలో మొట్టమొదటి నవల ఏది అనే చర్చ మరోసారి తెరపైకి వచ్చింది. తెలుగు సాహిత్యాన్ని క్షుణ్ణంగా పరిశోధిస్తున్న పరిశోధకులు కూడా ఏది ముందు, ఏది తర్వాత వెలువడిందో అన్న విషయంపై ఇంకా పరిశోధనలు చేస్తునే ఉన్నారు. అయితే తెలంగాణ ఉద్యమం తర్వాత మన అస్తిత్వాన్ని మరోసారి లిఖించుకుంటున్న తరుణంలో మన సాహిత్యం ఎక్కడ అనే చర్చ కొనసాగుతున్నది. తెలంగాణలో వచ్చిన ఎన్నో సాహిత్య ప్రక్రియలు ఆంధ్ర సాహిత్యంలోనూ వెలువడలేదు. అది నవల కావచ్చు. కథ కావచ్చు. అయితే తెలంగాణ సాహిత్యంలో తొలి తెలంగాణ నవల ఏది అన్న అంశంపై ఇంకా చర్చ కొనసాగడం దురదృష్టకరం. తెలంగాణలో వచ్చిన మొట్టమొదటి నవల ''ఆశాదోషం''. దీనిని తెలంగాణలో మొట్టమొదటిసారిగా "హితబోధిని" పత్రికను నడిపిన బరారు శ్రీనివాసశర్మ రచించిండు.

తెలుగు సాహిత్యంలో తెలంగాణ సాహిత్యం అగ్రగామనేది ఒక చారిత్రక సత్యం. తెలుగు సాహిత్యంలో వచ్చిన అనేక సాహిత్య ప్రక్రియలు వెలుగుచూసింది తెలంగాణలోనే కావడం విశేషం. ఒక ప్రాంత అస్తిత్వాన్ని చాటుకునే సందర్భంలో మొట్టమొదటిసారిగా శాసనాలు దివిటీలై ప్రకాశించినవి. మన ఘనమైన చరిత్రను చాటిచెప్పేవే శాసనాలు. ఆ శాసనాల ఆధారంగానే మన చరిత్ర లోకానికి తెలుస్తుంది. ఇక్కడ తెలుగు భాష పుట్టకముందు పైశాచిక, ప్రాకృత భాషల్లోనే రచనలు వెలువడ్డాయి. అనంతరం తెలుగు భాష వెలుగుచూడడంతో తెలుగు సాహిత్యం ఇక్కడ పురుడు పోసుకుంది. పాల్కురికి సోమనాథునితో తెలంగాణ సాహిత్యానికి పునాదులు పడ్డాయి. తొలిసారిగా స్వతంత్ర రచనలు చేసినవాడు పాల్కురికి సోమనాథుడు. అనంతరం శ్రీకంఠం కృష్ణమాచార్యులు, గోన బుద్ధారెడ్డి, వేములవాడ భీమకవి వంటి కవులతో తెలంగాణ సాహిత్యం గట్టిగా పునాదులు వేసుకుంది.

తెలంగాణ సాహిత్యం నుంచే అనేక తొలి ప్రక్రియలు ఆవిర్భవించాయనడం అత్యుక్తి కాదు. ఆ కోవలోనే తొలి తెలంగాణ నవల కూడా మహబూబ్‌నగర్ నుంచి వెలుగుచూసింది. ఆ నవల పేరు 'ఆశాదోషం'. రచయిత బరారు శ్రీనివాసశర్మ. ఇది 1910లో రచించిన నవల. దీనిని మొట్టమొదటిసారిగా వెలుగులోకి తీసుకువచ్చింది ప్రసిద్ధ తాళపత్ర, రాతప్రతుల పరిశోధకుడు




నాగలింగ శివయోగి. ఇతడు మహబూబ్ నగర్ జిల్లా మొత్తం తిరిగి 600కు పైగా తాళపత్రాలను, రాతప్రతులను సేకరించిన పరిశోధకుడు. సేకరించిన అన్ని ప్రతులను తార్నాకలోని ప్రాచ్య లిఖిత భాండాగారానికి ఉచితంగా అందజేయడం విశేషం. ఈ సేకరణ వల్ల మనదైన అస్తిత్వసంపద ఎంతో వెలుగుచూసింది. ఎంతోమంది చేయాల్సిన పనిని నాగలింగ శివయోగి ఒక్కడే చేయడం గమనార్హం.

పాలమూరు జిల్లా కవులకు, కళాకారులకు, పండితులకు, పరిశోధకులకు పుట్టినిల్లు. అలాంటి పరిశోధకులలో నాగలింగ శివయోగి ఒకరు. తన జీవితకాలంలో వందలకొద్దీ తాళపత్ర గ్రంథాలను, రాతప్రతులను సేకరించిన ఏకైక వ్యక్తి. ఈ సేకరణలో అనేక ఆణిముత్యాలనదగ్గ రాతప్రతులు వెలుగుచూసాయి. అలాంటి రాతప్రతులలో "ఆశాదోషం" నవల ఒకటి. ఎన్నో ఏళ్లుగా భద్రపరచిన ''ఆశాదోషం'' చాలా ఏళ్ళకు వెలుగు చూసింది. ఇది తెలంగాణ తొలి నవల కావడం విశేషం. దీని రచయిత బరారు శ్రీనివాస శర్మ కోయిలకొండ ప్రాంతంవాడు కావడంతో కోయిలకొండ చరిత్రను "ఆశాదోషం" నవలగా అక్షరబద్ధం చేశాడు. ఇంకా తెలుగులో ఇలాంటి మరుగున పడిన కావ్యాలెన్నో ఉన్నాయి. వాటిని తెలంగాణ పరిశోధకులు వెలికితీసి భావితరాలకు అందించాల్సిన అవసరం ఉంది. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ఈ నవల వెలుగు చూడడం విశేషం.

నాగలింగ శివయోగి పరిశోధనలోనే తొలి తెలంగాణ నవల అయిన "ఆశాదోషం" వెలుగుచూసింది. ఇది పూర్తిగా కోయలకొండ దుర్గం చరిత్ర. సరళగ్రాంథికంలో రచించబడ్డ తొలి తెలంగాణ నవల. అయితే తెలంగాణ పరిశోధకులు మాత్రం నల్లగొండ జిల్లాకు చెందిన తడకమళ్ల కృష్ణారావు రచించిన ''కంబుకంధర చరిత్ర" అనే రచనను తొలి నవలగా పేర్కొంటున్నారు. ఇది 1866లోనే రచించినట్లుగా

భావిస్తున్నారు. అయితే రచయిత స్వయంగా దీనిని వచన ప్రబంధమన్నాడు. కానీ నవల అని ఎక్కడా పేర్కొనలేదు. కందుకూరి వీరేశలింగం కూడా తాను రాసిన “రాజశేఖర చరిత్ర” ను కూడా వచనప్రబంధమనే పేర్కొన్నాడు. నవల అని పేర్కొనలేదు.

1910లో బరారు శ్రీనివాసశర్మ “ఆశాదోషం” అనే నవలను రచించాడని, అది అలభ్యమని, అలబ్ధమని తెలంగాణ సాహిత్యం గురించి రాస్తున్న పరిశోధకులు పేర్కొన్నారు. అయితే నవల లభ్యం కానీ, అముద్రితంగా ఉండిపోయింది. తెలంగాణ తన అస్తిత్వాన్ని చాటుకుంటున్న సందర్భంలో ఈ నవల వెలుగు చూసింది. ఇదొక చారిత్రక నవల. కోయలకొండ దుర్గాన్ని కుతుబ్‌షాహీ ఎలా హస్తగతం చేసుకోవాలనే తాపత్రయపడ్డాడో, ఎలా యుద్ధాలు చేశాడో ఈ నవల మనకళ్ళకు కడుతుంది. ఆనాటి కోయిలకొండ చరిత్రను కళ్ళకు కట్టినట్లు రచయిత దీనిని రచించాడు. ''ఆశాదోషం'' సరళగ్రాంథికంలో రచించబడిన నవల అయినప్పటికీ అది అందరిని అలవోకగా చదివిస్తుంది. ఈ నవల చదువుతుంటే పాత్రలు, సంఘటనలు, సన్నివేశాలు మన కళ్లముందు మెదులుతాయి. అంత అద్భుతంగా ఈ నవల మనచేత చదివిస్తుంది.

(గత మాస ‘కంబుకంధర’ వ్యాసానికి ప్రతిస్పందనగా ...)

## వికాస రేఖలు

### కవినై

ఎప్పుడూ పరిమళమే నా చుట్టూరా

ఎప్పుడూ వికాసరేఖలు
తోస్తూనే ఉంటాయి మరి

కనుక ఎవరినీ తోసేసే
కినుకే రావటం లేదు
జగమంతా వికాసమే
మనసంతా ప్రకాశమే
సంఘజీవనమంతా
మనోవృత్తి కృత్
జీవనోపాధి భృత్
సంకాశ జీవనమే
తోచటం నాకొక వరమై
తీరికే దొరకటం లేదు
బతుకు సుశబ్ద సురభిళ గీతమైతే
జయమ్ము నిశ్చయమ్ముగా
“అక్షర పతాక” నెగురవేస్తూ రెపరెపలాడుతూ
చైతన్య తన్మయ “ఆనందాశ్రువులు” రాలుస్తూ..
“నేను ఒక ఇంద్ర ధనుస్సు” నై
కాలాకాశంలో శాశ్వత “శబ్ద” శ్వాసనై
కవినై : నిత్యజీవినై
**(మహాకవి దాశరథి జయంతి సందర్భంగా...)**

### పెద్దరికం

వయసు ‘పెద్దరికం’ అంటే : ఎదిగిన వాళ్ళను, ఎదుగుతున్న వాళ్ళను అభినందించి ఆశీర్వదించడంలో సంతృప్తిని పొందటమే.

తీరానికి దగ్గరయ్యే అల వెనుదిరిగి సముద్రంలోకి మళ్ళటం మళ్ళీ సముద్రంలో కలియటానికే

సముద్రం పై పొర నుంచి ఆవిరై విశాల గగనంలో హర్షవర్షా ‘మేఘమాలిక’గా దర్శనం ఇచ్చేంతవరకూ ప్రతి అల ఉనికి సముద్రంలోని జీవ జల పట బంధమే.

చివరాఖరికి సముద్రోపరితలం చేరి ఆవిరైన సముద్రం మనసులో చోటు సంపాదించుకోవటం మానవ సమాజానికి పునర్జన్మ సంబంధమైన బంధమే.



**– గురిజాల రామశేషయ్య**
**ఫోన్ : 703 267 9471**

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 10 15 హైదరాబాద్ ఆగస్టు : 2022

బండారం కథలు – 9

# మాయాజాలం

**డా. నందిని సిధారెడ్డి,** ఫోన్ : 9440 381148

అంత ఊర్లో రామానుజం ఒంటరి. ఇంత ఇంట్లో అతను ఒక్కడే. ఇంట్లో ఎవరూ తోడు లేరు. ఇద్దరు తమ్ములున్నారు. ఎవరి ఇల్లు వాళ్లదే. ఎవరి పొయ్యి వాల్లదే. రామానుజంకూ పొయ్యి ఉంది. పొయ్యి వెలిగించేవాళ్లు లేరు. తమ్ములే చెరొకనెల రామానుజం రోజువారీ అవసరాలు చూస్తారు. రామానుజం పాలుకు వచ్చిన జాగా తమ్ములే సాగుచేసుకుంటారు. పండిందా లేదా రామానుజం పట్టించుకోడు. ధ్యానం, దైవ చింతనలో కాలం గడుపుతుంటాడు. రామానుజం తిండీ తిప్పలు ఆ తమ్ములు సమకూర్చాలి. ఏళ్లకు ఏళ్లుగా కాలం అట్లా జరిగిపోతుంది.

రామానుజంకు ఒక కాలు బలహీనంగా ఉంటుంది. కట్టె ఆసరాతో నడుస్తాడు. వ్యవసాయం పనులు చిన్నప్పట్నుంచీ అలవాటుల ఏదు. నాయన ఎప్పుడూ చెప్పలేదు. శారీరకంగా అజం లేకపోవటం వల్ల తల్లీతండ్రీ ఏ పనికీ ఒత్తిడి చేయలేదు. దూరం పంపించి చదువు చెప్పించటానికి తగినంత ఆర్థిక స్థోమత లేనందువల్ల చదువూ వీలు కాలేదు. ఊర్లో బడిగానీ, మదర్సా గానీ లేవు. రాయిచెట్టు కింద అయ్యగారి దగ్గర పొడిపొడి అక్షరాలు నేర్చుకున్నాడు గానీ జీవించటానికి సరిపోయే చదువు కాదు. రామానుజంకు యుక్త వయసు వచ్చిన తర్వాత పెళ్లి చేయాలని నాయన కిందామీదా పడ్డాడు. ఇంత భూమీ, వ్యవసాయం చూపించి పెళ్ళి జరిపించారు. ఎంతోకొంత ఓపికతో ఏడాదిన్నర కాపురం చేసి ఇంక వల్ల కాదని చెప్పా పెట్టకుండా వెళ్ళిపోయింది భార్య. ఆ తర్వాత ఎవరూ వెతుకలేదు. పంచాయతి పెట్టలేదు. తోలుకొచ్చే ప్రయత్నమూ చెయ్యలేదు. మళ్ళీ పెళ్లి ప్రయత్నాలూ చెయ్యలేదు. పెద్దవాళ్లకేమో గాని – ఊరందరికీ ఈ విషయాలు అట – అటలుగానే తెలుసు.

ఒంటరి రామానుజంకూ దైవమే తోడు. తమ్ములు మంచితనంతో ఏది పెడితే అది తింటాడు. ఎప్పుడూ ఏదో ఒక ఆలోచనలో మునిగి ఉటాడు. మనుషులందర్నీ, వాళ్ల స్వభావాల్నీ జాగ్రత్తగా గమనిస్తూ ఉంటాడు. చెట్టూ పుట్టా పిట్టా ఎందుకు పుట్టినాయో తాను అందుకే పుట్టానని అనుకుంటాడు. సృష్టిలో ఏ జీవి ఎట్లా జీవించాలో అంతా దైవనిర్ణయమేనని నమ్ముతాడు.

చినతమ్ముని కూతురు కుండతో నీళ్లు తెచ్చి గోలెం నింపి వెళ్ళింది. కుంటుకుంటూ బయటకు వచ్చాడు రామానుజం. వేపపుల్లతో పళ్లు తోముకుంటూ ఆకాశంవైపు చూశాడు. ప్రశాంతంగా ఉన్నాడు సూర్యుడు. 'ఉదయించె భానుడు ఉద్రాక్షపువు చాయ' అనుకుని పరవశించాడు. వేపచెట్టు కొమ్మ మీంచి ఎగిరివచ్చి గోలెం దగ్గర వాలింది కాకి. కావు కావుమని రామానుజాన్ని చూసి అరిచింది. తనకే దిక్కులేదు. దానికేం వేసేది? పెట్టినప్పుడే తినాలి. కాకికి



దొరికేది అప్పుడే. కాండ్రించి ఊంచాడు. పక్కన పురుగులు ఏరుకొని తింటున్న కోడిపిల్లలు బెదిరాయి. కడుముంతతో నీళ్లు ముంచుకొని ముఖం కడుకున్నాడు రామానుజం. ఆ వెంటనే నాలుగు మారితలు పోసుకొని స్నానం అయిందనిపించాడు. తడిబట్టలతోనే రెండు చేతులు జోడించి సూర్యునికి దండం పెట్టాడు. లోపల్లోపల ఏదో చదివాడు. దండం మీది దోతి తీసుకొని తుడుచుకొని, అడ్డబట్టవలె చుట్టుకున్నాడు. పెయిమీద సెల్లా వేసుకొని బయలుదేరాడు.

మూడు బాటల దగ్గర మూడు గుండ్లుంటాయి. నడిగుండు నడుమ రాయి చెట్టు ఉంటుంది. రాయిచెట్టు కింద గుండు మీద కూచున్నాడు రామానుజం. 'రామానుజం తానం అయినట్టుంది' అన్నాడు క్యాదారి. దుకాణం నుంచి ఏదో కొనుక్కొని పోతున్నాడు.

**"తానం అయింది. ఎవలకయినా పనుంటది. పని లేనోనికి ఏం పని మరి. ఒంటిగాని తిప్పలు. ఇంటికిరావు. పెంటకు కావు".**

రామానుజం మాట్లాడుతుంటే క్యాదారి నడుస్తూనే ఉన్నాడు. ఊరపిచ్చుక వచ్చి రామానుజం పక్కన వాలింది. కట్టెను చూసి దానంతటదే జడుసుకున్నది. పిల్లలు మట్టిలో ఆడుకుంటున్నారు. కొంచెం పెద్ద పిల్లలు గోటీలు ఆడుతున్నారు. ఇద్దరు ముగ్గురు పిల్లలు ఆటను చూస్తున్నారు. విసిరిన గోటీ ఉన్న గోటీకి తాకకపోయినా తాకిందన్నాడో పిల్లవాడు. 'తొండి' అన్నాడో పిల్లవాడు. అన్నీ నావే అని జేబులో వేసుకోబోయినవాన్ని మరో అతను అడ్డుకున్నాడు.

లొల్లి పుట్టింది. తొసుకున్నారు. ఆట ఆగిపోయింది. వాళ్లు రామానుజం వైపు చూశారు. దెబ్బతిని ఏడుస్తున్న పిల్లవాడిని పిలిచాడు రామానుజం. మరో ఇద్దరు కూడా ఏం చెబుతాడోనని దగ్గరికి వచ్చారు. "కూసోండ్రి" అన్నాడు.

"నీ లెక్కనే చిన్నపిల్లగాడుగా ఉన్నడు కర్ణుడు. కర్ణుడు తోటి పిల్లలతోని బొంగురాయి ఆడుతుండ్రు. కర్ణుడు మేటి. బొంగురం జాల చుట్టి జంబి మీదికి యిసిరిండు. ఒక బొంగురం ఎగిరి తొవ్వవెంట ఒకామె తలమీద పెట్టుకొని పోతున్న నీల్లకుండకు తగిలింది. కుండ పగిలింది. నీళ్లు కారిపోయినయి. ఆమెకు కోపమొచ్చింది. కర్ణున్ని తిట్టింది. పుట్టరాని పుటక పుట్టినవు. ఆడరాని ఆట ఆడినవు. చెయ్యరాని తప్పు చేసినవు. తల్లి లేనోనికి తప్పులెట్ల దెలుస్తయి? అన్నది. కర్ణునికది బాధయింది. ఏడుపొచ్చింది. తల్లిదగ్గరికి వొయ్యి మీదవడి ఏడిసిండు. కన్నతల్లి జేసిన తప్పుకు కొడుకు పడ్డ తిట్లకు నొచ్చుకున్నది తల్లి. ఎవలు చేసిన తప్పుకు ఎవల్నో తిట్టే లోకాన్ని తిట్టి కండ్లనీళ్లు తుడిచింది. అట్లా పెరిగి వీరుడైండు. దానకర్ణుడై మెప్పు పొందిండు'' అని పిల్లవాడి నోదార్చిండు రామానుజం. ఆ జట్టు పిల్లలు సంతోషించారు. చిన్నపిల్లలు ముద్దు ముద్దుగా మాట్లాడుకుంటూ మట్టి చల్లుకుంటూ ఆడుకుంటూ పరవశించిపోతున్నారు..

**"కుచ్చు కుచ్చుల దండలెయ్యవే ఓ యమ్మ కూర్మావతారుదానవే"** చిన్నికృష్ణుని రూపు తలపులోకి వచ్చింది.

రామానుజానికి మూడుగుండ్లొకపాటి ప్రపంచం. రోజూ మూడుసార్లు అక్కడికి రావాల్సిందే. వొచ్చే పోయ్యే మనుషుల్ని పలకరించాల్సిందే. ఆడే పాడే పిల్లల్ని చూసి పులకరించాల్సిందే. వేమన పద్యమో, బ్రహ్మంగారి కీర్తనో చదవాల్సిందే. గొల్లవాళ్లు గొర్లు తోలుకొని పోతున్నారు. కడుపులో కొంచెం చల్లబడి, మరికొంచెం చల్లంబలి సద్ది కట్టుకొని మూట వేలాడుతుంటే కట్టెతో గొర్లు అదుమాయించుకుంటూ వెళుతుంటే రామానుజానికి జీవితం ఎంత చిత్రమైందో ననిపించింది. ఎవరిని ఎవరు కాపలా కాస్తారు? ఎవరు ఎవరిని రక్షిస్తారు? ఎవరిని ఎవరు పోషిస్తున్నారు. కాపరి గొర్లనా... గొర్లు కాపరినా... గొర్లనూ కాపర్లనూ మరెవరైనానా? అర్థం అయినట్టు అనిపించింది. లోపల ఆకలి మొదలైనట్టూ అనిపించింది.

రామానుజం ఇంటికి వెళ్లేసరికి తలెలో బువ్వ, కూరలు పెట్టి బట్ట కప్పి ఉంది. కాళ్ళు చేతులు కడుక్కొని తలె పట్టుకొని కుదురు మీద కూచుని తిన్నాడు. నులకమంచం మీద ఒరిగాడు. అటు ఇటు పొర్లినా నిదుర రాలేదు. బయటకొచ్చి వాకిట్లో కూచున్నాడు. పొద్దు నడినెత్తి మీదనుంచి కొంచెం వంగింది. బజారు వెంబట బాలమల్లు పోతున్నాడు. రామానుజాన్ని చూసి ఆగాడు.

"తిన్నవా నాయిన"

"తినాలె గద బిడ్డ. తిన్న ఏది దప్పినా అది దప్పదు".

"బువ్వా? గటుకా?"

"ఏదయినా ఒకట గద కొడుక. అన్నమైతేనేమి కడుపుకు సున్నమైతేనేమి? అన్నమరిగిన పాడు పొట్టకు అన్నమే వేతాము మరి అన్నడు గురుడు".

"తత్వాలు పాడుతుంటె సంసారమెల్తదా? నీకేం ఒక్కనివి ఎట్లైన ఎల్లుతది. పెండ్లాం పిల్లలున్నోనికి కష్టం గద. సావుకారి దగ్గరికి పోతె వాడు సతాయిస్తుండు. లెక్క ఒడువది. అప్పు తీరది. చేసిన కష్టమంత సేటుకే అయితంది. చెయ్యకపోతే పోరగాండ్లకు పొక్కలకెట్ల ఎల్లాలె"

"అందుకే – కవి చెప్పిండు. ఎల్లి ఎల్లక తీరి తీరక ఏకమై పోతుందయా – ఆలుపిల్లలు ధనము నాదని ఏల భ్రమ జెందేరయా – కీలు వదిలిన బొమ్మవలె ఈ నేల బడిపోతున్నది" అంటడు. భ్రమల ఉంటె గంతే మరి. సంసారమయినా – సావుకారయినా గదే సావు గద. సావుకారి మాత్రం ఎప్పటికి ఉంటడా? పొయ్యేటప్పుడు ఏదన్న ఎంట తీస్కపోతడా?"

"యియ్యన్ని ఇనెతందుకు బాగనే ఉంటయి. బరువు దించుతయా మోస్తెనే గద తెలిసేది"

"వాడనుకుంటడు. ఉంటనని కనీసం తింటడా – కడుపుకు బంగారం తినడు గద'. 'లక్షాధికారయినా లవణమన్నమె గాని – మెరుగు బంగారంబు మింగబోడు' అనేది తెలువాలె గద – రుక లేని బతుకు ఉత్త బతుకు' బాలమల్లు గునుసుకుంటూ వెళ్ళిపోయాడు.

అందరూ సుఖంగా ఉన్నట్టే కనిపిస్తారు. ఎవరూ సుఖంగా ఉన్నట్టు అనిపించరు. రామానుజం గురుతత్వం ఎరుక పరుచకున్నట్టే లోకం గుర్తిస్తుంది. తృప్తిగా ఉన్నట్టే ఊరంతా భావిస్తుంది. కొందరు అదృష్టవంతుడనుకుంటారు. మరికొందరు దురదృష్టవంతుడను కుంటారు. ఆడదిక్కు లేకపోతే ఎంతైనా మగబతుకు బతుకు కాదని కూడా అనుకుంటుంటారు.

రామానుజం వేపచెట్టు నీడ చూశాడు. పొలిచ్చేవేళ దాటినట్లుంది. పనికి వెళ్లిన చంటిబిడ్డ తల్లులు హడావుడిగా ఇళ్లవైపు నడుస్తున్నారు. ప్రేమపాశాలు మామూలువి కావనిపించింది రామానుజానికి. లేచి మెల్లగా నడిచాడు.

పాపయ్య సేటు వాకిట్లో ఆగాడు. దుకాణం నుంచి తందనాన రామాయణం వినబడుతుంది. ఒక్కడే పాడుకుంటున్నాడు. రామానుజం అరుగు మీద మొగురానికి ఆనుకొని కూచున్నాడు. పాపయ్యపేట కాలక్షేపం కోసం తరచుగా సుందరకాండ పాడుతుంటే అరుగుమీద కూచుని వినడం రామానుజానికి అలవాటు. దేక్కుంటూ దేక్కుంటూ ముసలి మల్లవ్వ వచ్చి వాకిట్లో కూచున్నది.

బడి పిల్లవాడు బలపం కోసం దుకాణంలోకిరాగానే రామాయణం ఆగిపోయింది. బలపం చూసుకుటూ మురురుసుకుంటూ ఎగురుతూ వెళ్లిపోయాడు పిల్లాడు.

రామానుజం నవ్వుకున్నాడు. ఏ వయసుకు తగిన భ్రమలు ఆ వయసులో చొప్పించి పెట్టిన దైవలీలలు అబ్బురమనిపించింది. సేటు బయటకొచ్చి చెక్కపీట మీద కూచున్నాడు. పోశయ్య ఊగులాడుతూ అరుగు మెట్ల మీద కూలబడ్డాడు. నలుగురూ కూచునే ఉన్నారు. స్థలాలు వేరు. స్థాయిలు వేరు. అందరి పుట్టుకా తల్లి గర్భం నుంచే. అందరి ఆఖరి మజిలీ స్మశానంలోకే. నడుమ ఎన్ని చిత్రాలు – ఎన్ని ఛిద్రాలు – ఎన్ని మురిపాలు – ఎన్ని కలహాలు – మాయ – మాయపొరలు గుర్తుకొచ్చి రామానుజం చెప్పసాగాడు.

శంకరాచార్యుడు మాయ గురించే చెప్పిండు. ఇది ఒక లెక్కన మనిషిని ఇడిసిపెట్టది. బుద్ధి ఎరిగిన వాన్ని సుతా లొంగతీసు కుంటది.. మాయ దాటుడు కష్టం. అన్నీ చదువుకున్న బ్రాహ్మణు డుండేవాడు. బాగా జ్ఞాని. ఒకరోజు పోతూ వుంటే పెద్ద అడివి. అడవిల పెద్ద పులి. అది ముసలిదై ఉండుట్ల దానికి తిండి దొరుకుతలేదు. వేటాడేతందుకు శక్తి లేదు. బ్రాహ్మణున్ని ఆహారంగా భావించింది. బంగారు కడియం చూపించింది. ఎన్నో జంతువుల్ని చంపి తిన్న పాపాన్ని కడుక్కునేతందుకు దానం చెయ్యాలనుకున్నానని చెప్పింది. అది సుత సువర్ణదానం. అదీ బ్రాహ్మణునికి. మంచి బ్రాహ్మణునికి. కాటికి పొయ్యే గడియల పుణ్యం చెయ్యదల్చుకున్నట్లు చెప్పింది. తియ్యగ మాట్లాడింది. బ్రాహ్మణుడు ఆశపడ్డడు. నమ్మిండు. మాయల – బంగారం మాయల పడ్డడు. దగ్గరికి పోంగనే పులి బ్రాహ్మణుని మీద వడ్డది. చంపి తిన్నది. తత్వం ఎరిగిన బ్రాహ్మణుడు గూడ పులితత్వం తెలువక బలయిపోయిండు. మాయంటే గట్లుంటది. నమ్మిస్తది. తెలిసీ మాయల పడ్డడు. మనసొంటి వాళ్లమెంత?

'సుతులు సతులు మాయ సుఖదు:ఖములు మాయ సంస్మృతియును మాయ, మాయ బతుకు కింత మాయ గల్పిస్తివి" అన్నడు వేమన్న. అగో ఆ మాయ దాటితేనే మోక్షం". రామానుజం పాపయ్యసేటు కంటే తక్కువ చదివాడు. అయినాసరే ఇవన్నీ ఎట్లా తెలిసినయి? జీవితం నేర్పింది. లోకం నేర్పింది. వారం వారం భజన దగ్గర చేరుతాడు. అచల గురువుల బోధలు వింటాడు. హరికథలు విన్నాడు. నలుగురిని మాట్లాడిస్తాడు. ఎందరెందరి అనుభవాలో గ్రహించాడు. లోపలి తత్వాన్ని ఎరుకపర్చుకున్నాడు. తాను ఎరుకపర్చుకున్నది లోకానికి చెపుతుంటాడు. ఊర్లో అందరికీ పెద్దసావుకారి పెద్దపటేలుతో సహా అందరికీ రామానుజం అంటే గౌరవం. ఆడవాళ్లకు ఆయన పట్ల జాలి, సానుభూతి. కుటుంబం లేకపోవచ్చు. ఊరంతా ఆయన కుటుంబమే. చీకటి పడుతుంటే మూడుగుండ్ల దగ్గరికి చేరాడు. మూడుబాటలే రామానుజానికి మూడు లోకాలు.

రామానుజం ఒకరోజు పొద్దుటిపూట స్నానం చేసి విడిచిన ధోతి పిండేసుకుంటున్నాడు. ఆ సమయానికి ముసలి ప్రాయంలోకి ప్రవేశించిన పెద్దావిడ పెద్ద నుదుట బొట్టుతో ఇంటి వాకిలిలో నిలబడి వుంది. ఆ పెద్దావిడతో ముదురు యువకుడు నిలుచొని ఉన్నాడు. వచ్చినవాళ్ళెవరో తెలియక చుట్టుపక్కల ఇళ్ల ఆడవాళ్లు గుమిగూడారు. రామానుజం తమ్ముల భార్యలు, పిల్లలు చేరుకున్నారు. ధోతి దండెం మీద ఎండేయ్యబోతూ రామానుజం అటు చూశాడు. తోచలేదు.

పెద్దతమ్ముని భార్య వచ్చినామెను చూస్తూ అడిగింది. "అయ్యో గుర్తు పట్టలేదా... దుర్గా" గొంతు అదుగున బడి తెలియలేదు. చెవులకు బంగారు గంటీలు, మెడలో బంగారు గుండ్లహారం, పట్టుచీర, ముడుతల ముఖం, పెద్దబొట్టు. వచ్చినతని వేళ్లకు నాలుగు ఉంగరాలు, మెడలో బంగారు గొలుసు, తెల్లబట్టలు, సంపన్నులను తలపిస్తున్నారు. దుర్గవ్వకు ఏవేవో కదిలాయి. "అక్కా.... పెద్దక్క". తలూపిందామె. అందరు ఊహించారు.

రామానుజం భార్య ఆమె. ఆ వెంట వచ్చినతను రామానుజం కొడుకు. అందరూ సంతోషించినా రామానుజానికి ఏమీ అర్థం కాలేదు. అప్పుడు ఎందుకు వెళ్లినట్టో, ఇప్పుడు ఎందుకు వచ్చినట్టో తోచలేదు. చుట్టాలు పక్కాలు ముచ్చట్లు పెట్టుకున్నారు. కూడిపోయారు. ఏడ్చారు. తుడుచుకున్నారు.

రామానుజం కొడుకు చంద్రయ్య పెద్ద మేస్త్రీ అయ్యాడు. బాగా సంపాదించాడు. ఇల్లూ అవీ కట్టుకున్నాడు. బంగారం, డబ్బు కూడబెట్టుకున్నాడు. పుట్టిన ఊరు చూడాలని, కన్న తండ్రిని చూడాలని అవ్వతో పోరు పెట్టాడు. సాధించాడు.

రామానుజానికి భార్యమీద కాకపోయినా కొడుకుమీద ఆసక్తి ఏర్పడింది. క్రమంగా అనురాగం పాదుకున్నది. కొడుకు తనకాళ్ళు మొక్కుతుంటే మనసు ఉప్పొంగింది. నలబయ్యేళ్ల నుండి బండబడిన హృదయంలో చెమ్మ పుట్టింది. ఆరోజు రామానుజం బంధువులందరికీ పెద్దవేడుక. చంద్రయ్య దావతు ఇచ్చిండు. తాగినంత, తిన్నంత. రామానుజాన్ని చంద్రయ్య సిద్ధిపేట పట్టణానికి తీసుకెళ్ళి బట్టలు పెట్టాడు. తను కట్టిన రెండతస్థుల బంగ్లా చూపెట్టాడు. కొడుకు... కొడుకు.... రామానుజంలో మొలుస్తున్నది ప్రేమా... మాయా... మాయవంటి భ్రమా...

కొత్తబట్టలతో ఊర్లోకి వచ్చిన రామానుజాన్ని చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఆ తెల్లకమీజు – ఆ అంచుధోతి – వేలికి ఉంగరం. రామానుజం కొత్త కళతో మెరుస్తున్నాడు. చంద్రయ్య పట్టుబట్టి పది ఎకరాల భూమి కొని కొత్తగా మొదలుపెట్టిన వ్యవసాయం దర్పంగా మెరుస్తుంది. చూసుకునే బాధ్యతంతా రామానుజానిదే. మునుపటిలా రామానుజం మూడుగుండ్ల దగ్గరికి, మూడు బాటల దగ్గరికి రావటం లేదు. పిల్లలకు కథల్లేవు. పెద్దలకు తత్వాల్లేవు. బాటసార్లకు పద్యాల్లేవు. పలుకుల్లేవు.

రామానుజం రోజూ కొత్తబావి దగ్గర పొడుస్తున్నాడు. పొలం నీళ్ల నడుమ పొద్దు మాపూ మెరుస్తున్నాడు. పటాపంచలయిందేదో తెలియదు గానీ రామానుజం జీవితం బంగారు వర్ణంతో మెరుస్తుంది.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 10 (18) హైదరాబాద్ ఆగస్టు : 2022

## సాధన పంచకమ్

**వాక్యార్థశ్చ విచార్యతాం శృతిశిర: పక్ష: సమాశ్రీయతాం**
**దుస్తర్కా త్సువిరమ్యతాం శృతిమతస్తర్కోకను సంధీయతామ్।**
**బ్రహ్మైవాస్మి విభావ్యతాం అహరహర్గర్వ: పరిత్యజ్యతాం**
**దేహేకహమ్మతి రుజ్ఝ్యతాం బుధజనైర్వాద: పరిత్యజ్యతామ్॥**


**తాత్పర్యం :** 1. వేదాంత వాక్యములను చక్కగా విచారణ చేయవలెను. 2. వేదాంతము లేక ఉపనిషత్తులు నిర్ణయించిన సిద్ధాంతమునే ఆశ్రయింపవలెను. 3. చెడు తర్కమును విడనాడ వలెను. 4. వేద సమ్మతమైన తర్కమునే (యుక్తినే) అనుసరిపవలెను. 5. నేను బ్రహ్మమునే ఐ ఉన్నాను అని చక్కగా భావన చేయవలెను. 6. ఎప్పటికప్పుడు గర్వమును త్యజింపవలెను. 7. దేహమే నేను అనెడు భావమును విడిచిపెట్టవలెను. 8. బుధజనులతో వాదించుటను మానివేయవలెను.


### వివరణ

**4. బ్రహ్మైవాస్మి విభావ్యతామ్ –**

'నేను బ్రహ్మమును' అని ఎల్లప్పుడు చక్కగా భావన చేయవలెను. 'నేను జీవుడు' అని అజ్ఞానంతో భావించువాడే జ్ఞానం కలిగిన మీదట 'నేనే బ్రహ్మము' అని తెలుసుకొంటాడు. ఎందుకు? అంటే ఉన్న చైతన్యం ఒక్కటే. జీవుడు మరియు బ్రహ్మము రెండూ చైతన్యమే. ఐతే దేహమే నేను అనెడు భావనలో జీవుడు అల్పజ్ఞుడు అగుతున్నాడు. ఈ విశ్వమంతా వ్యాపించి ఉన్న ఈశ్వరుడు విశ్వజ్ఞుడుగా బోధమగుతున్నాడు. ఇది ఉపాధులలో గల భేదం మాత్రమే అని తెలియాలి. ఉపాధులను తొలగిస్తే ఆత్మదర్శనం అవుతుంది. ఈ ఆత్మదర్శనమే ఈశ్వరదర్శనము అని తెలిసికోవాలి. కావున జీవచైతన్యము వేరు, బ్రహ్మచైతన్యము వేరు కాదు. జీవుడే బ్రహ్మము, బ్రహ్మమే జీవుడు అను నిశ్చయంతో 'నేనే బ్రహ్మము'ను అని సదా సర్వదా భావిస్తూ ఉండవలెను.

## సత్సంగం





### శరణాగతి

'అనన్య శరణాగతి' అంటే ఏ ఆలోచనపైనా అనురక్తి లేకుండా ఉండటం, నిజమే. అయితే, శరీరం నిలవటానికి అవసరమైన అన్నపానాదుల గురించిన ఆలోచనలని కూడా త్యజించాలనా దీని అర్థం? "భగవంతుని ఆదేశానుసారం ఏదైనా దొరికితేనే తినాలి, దానికోసం ఎవ్వరినీ అడుగకూడదా? లేక నేను కొంత ప్రయత్నం చేయవచ్చా' అని వీరి ప్రశ్న. సరే! మనం తినవలసినదేదో దానంతట అదే వస్తుందని ఒప్పుకుందాం. అప్పుడైనా, తినేది ఎవరు? ఎవరైనా ఆహారాన్ని నోట్లో పెట్టినా, దానిని మింగాలి కదా? "జబ్బు చేస్తే నేను మందు తీసుకోవాలా లేక ఊరికే ఉండి, నా ఆరోగ్యం భగవంతుని చేతుల్లో విడిచి పెట్టాలా" అని కూడా అడుగుతున్నారు. "సాధక పంచక" మనే గ్రంథంలో, ఆకలి అనే జాడ్యానికి భిక్షగా దొరికిన ఆహారాన్ని తీసుకోవాలని శ్రీ శంకరులు వ్రాసారు. అప్పుడైనా బయటికి వెళ్ళి బిచ్చమెత్తుకోవాలి కదా? అందరూ కళ్ళు మూసుకు కూర్చుని ఆహారం వస్తే తింటామని ఊరుకుంటే ప్రపంచం నడిచేదెట్లా? అందుచేత, సంప్రదాయానుసారం వచ్చే వాటిని స్వీకరించాలి – కాని, తానే చేస్తున్నానన్న భావం లేకుండా ఉండాలి. "నేను చేస్తున్నా" నన్న భావనే బంధం. కాబట్టి అటువంటి భావాన్ని ఎట్లా అధిగమించాలని ఆలోచించాలి. అంతేనే గాని జబ్బు చేస్తే మందు వేసుకోవాలా; ఆకలి వేస్తే ఆహారం తీసుకోవాలా అన్న విషయాల గురించి కాదు! అటువంటి సందేహాలు వస్తూనే ఉంటాయి. అంతులేకుండా "నొప్పి పెట్టితే నేను మూలగవచ్చా" "గాలిని విడిచిన తర్వాత మళ్ళీ పీల్చవచ్చా" అంటూ కూడా సందేహాలు వస్తాయి. ప్రతి వ్యక్తి యొక్క మానసిక వికాసాన్ని బట్టి ఈశ్వరుడో, కర్మో, కర్తో – ఏ పేరు పెట్టుకున్నా సరే – ఈ లోకంలో అన్నిటినీ నిర్వహిస్తుంది. బాధ్యతని ఆ కర్తమీద పడవేస్తే సరి. అన్నీ వాటంతటవే చక్కబడతాయి. మనం నేల మీద నడుస్తాం. నడిచేటప్పుడు ప్రతి అడుగు వేసే ముందూ ఒక కాలి తరువాత రెండో కాలిని ఎత్తాలా అని తర్కించుకుంటుంటామా, ఆగిపోతామా? నడక దానంతట అది సాగిపోదా? శ్వాస పీల్చటం, విడవడం విషయమూ అంతే! దానికోసం ప్రత్యేకమైన ప్రయత్నమేమీ చెయ్యం. జీవితం విషయంలోనూ అంతే. మనం కోరుకున్నంత మాత్రాన దేనినైనా విడిచిపెట్టగలమా, మనం యిష్టం వచ్చినట్టు ప్రవర్తించగలమా? మనకి ఎరుక ఉన్నా లేకపోయినా వాటంతట అవే ఎన్నో జరిగిపోతాయి. **భగవంతుని పట్ల ప్రపత్తి అంటే, అన్ని ఆలోచనలను విడిచి మనస్సుని ఆయనపై లగ్నం చేయటమే. మనమాయన పట్ల ఏకాగ్రత కలిగి ఉంటే, మిగిలిన ఆలోచనలన్నీ వాటంతట అవే మాయమైపోతాయి. మనం మనస్సుతో, వాక్కుతో, దేహంతో చేసేవాటి నన్నిటినీ భగవంతునిలోనే విలీనం చేస్తే, మన బ్రతుకు భారమంతా ఆయన మీదే ఉంటుంది.**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 10 (19) హైదరాబాద్ ఆగస్టు : 2022

సాహిత్యం ~ వైజ్ఞానిక మూల్యాంకనం

# ప్రకృతి మూల స్వరూపమే 'లక్ష్మీదేవి'

**డా. సాగి కమలాకర శర్మ,** ఫోన్ : 9704 227744

**"లక్ష్మీం క్షీర సముద్రరాజ తనయాం శ్రీరంగధామేశ్వరీం**
**దాసీభూత సమస్త దేవ వనితాం లోకైక దీపాంకురాం**
**శ్రీమన్మంద కటాక్షలబ్ధ విభవత్ బ్రహ్మేంద్ర గంగాధరాం**
**త్వాం త్రైలోక్య కుటుంబినీం సరసిజాం వందే ముకుంద ప్రియాం"**

ఈ శ్లోకం అందరికీ తెలిసిందే. లక్ష్మీదేవి స్తుతి సందర్భంలో అందరూ పారాయణం చేస్తున్నదే. ఈ శ్లోకంలోని కొన్ని పదాలను గమనిస్తే లక్ష్మీదేవి గూర్చిన కొన్ని అంశాలను మనం వైజ్ఞానికంగా చర్చించుకునే అవకాశం ఉంటుంది.

లక్ష్మీదేవి క్షీరసముద్ర రాజ పుత్రిక. పాలసముద్రం నుండి పుట్టింది. ఈ పాల సముద్రం ఎక్కడ? దేనిని పాల సముద్రం అనాలి. ఎందుకు చిలకాల్సి వచ్చింది. అక్కడ ఎవరెవరు పుట్టారు. లక్ష్మీదేవి దానిలో ఎందుకు పడిపోయింది. కొత్తగా పుట్టిందా, పడిపోయిన దాన్ని చిలికితే పైకి వచ్చిందా... అన్నీ ప్రశ్నలే... సమాధానాలు మాత్రం దొరకవు.

పౌరాణిక కథలకు మూలం ఆకాశంలోని జ్యోతిస్సులు అయినా కావచ్చు. కనిపించే పంచభూతాత్మక ప్రకృతి కావచ్చు లేదా సృష్టి వికాస క్రమం కావచ్చు. భూమిపై పంచభూతాల ప్రతిష్ఠాపన జరిగిన సందర్భమూ కావచ్చు. ఈ వైజ్ఞానిక అంశాలకు పాత్రల పేర్లు పెట్టబడి సామాన్యులకు ఆ యా విశేషాలను అందించే ప్రయత్నంలో ఆ యా దేవతలు, వారి కథలూ ప్రత్యేకంగా ప్రస్తావించబడినాయి.

పాలసముద్రం, పాలపుంత (మిల్కీ వే)గా గుర్తించిన విధానం ఒకరకం. అక్కడ జ్యోతిస్సులతో సంబంధంగా ఆలోచించడానికి అవకాశం ఉంటుంది. పాలపుంత గురించి వేరు వేరు దేశ, భాషలలో చాలా కథలు మనకు కనిపిస్తున్నాయి. ఆ పాలపుంతను మథించిన విధానం, ఈ క్షీరసాగర మథన విధానం ఒకటి కాకపోవచ్చు. ఇక్కడి కథనం అంతా భూమి, ఈ భూమిపైన జీవజాతులు ఏర్పడడానికి కావలసిన వాతావరణం ఏర్పడటం మొదలైన అంశాలపై సరియైన దృష్టిని కేంద్రీకరించడం.

మనం నిత్యం పీల్చుకునే ఆక్సీజన్ ఈ భూమిపై సరియైన విధంగా నెలకొన్న తర్వాతనే ఇక్కడ అన్ని రకాల జీవుల జీవనానికి అవకాశం కలిగింది. జీవావరణం వికసించింది. వాయుమండలం భూమికి ఏర్పడటం అంత సులువుగా జరుగలేదు. అనేక రకాల వాయువులు ఉన్నా ఆక్సీజన్ మనకు కావలసినంత అందిన తర్వాత మాత్రమే మనకు ఆనందం కలిగింది. అదే క్షీరసాగర మథనానంతరం పొందిన అమృతం.




మనకు తెలుస్తున్న వైజ్ఞానిక సమాచారం అనుసరించి భూమి ఒకసారి పెద్ద ఆస్టరాయిడ్ దెబ్బకు గురి అయినప్పుడు రెండు ముక్కలుగా విడిపోయింది. ఒక ముక్క కొంత చిన్నగా ఉంది. అదే కుజుడు లేదా భౌముడు. ఈ రెండు పేర్లకు ఒకే అర్థం. భూమి నుండి పుట్టిన వాడు అని. దీనివల్ల అంతకు ముందు భూమి ఉన్న ప్రదేశం నుండి కొంచెం పక్కకు కదలడం జరిగింది. ఆ తర్వాత భూమి మీదకు లక్షలాది ఉల్కలు పడటం జరిగింది. అంతకు ముందు భూమి లోని అగ్ని పర్వతాలు పగలడం వల్ల లావా ఏర్పడటం జరుగుతూ ఉంది. అయితే ఉల్కాపాతం వల్ల ఉల్కలలో కొన్ని వాయువులు, ఐస్ వంటి ముక్కలు కలిగి ఈ భూ వాతావరణాన్ని ఢీకొనేవి. ఈ వాతావరణంలో ఐస్ ముక్కలు కరిగినట్లు అయి నీరు పుట్టడం మొదలైంది. లక్షలాది ఉల్కలు పడే సమయం అది. వాతావరణం, వాయుమండలం పూర్తిగా ఏర్పడిన తర్వాత తీవ్రమైన ఉల్కాపాతం తగ్గింది. అయితే ఉల్కలలోని ఐస్‌ముక్కల వంటి పదార్థాలు కరిగి భూ వాతావరణం అంతా జలమయం చేసినాయి.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 10

హైదరాబాద్ ఆగస్టు : 2022



ఇదే సమయంలో భూమిని కుజుని పరిమాణంలో ఉండే మరో ఆస్టరాయిడ్ ఢీకొన్నది. ఆ సమయంలో భూమిమీద కొంత భాగం దెబ్బ తిన్నది. చెదిరిపోయిన ఆ భాగం అంతా కాల క్రమంలో ఒక క్రమపద్ధతిలో ఆకర్షించబడి చంద్రునిగా మారిపోయినాయి. భూమి 23 న్నర డిగ్రీలు వంగింది. భూమి సరియైన విధంగా లేకపోవడం వల్లనే భూమికి 'కుబేర', 'కువలయము' అనే పేర్లు ఏర్పడి ఉంటాయి.

అప్పటికే జలమయంగా ఉన్న భూమిని ఈ ఆస్టరాయిడ్ ఢీకొనడమే ఒక రకమైన క్షీరసాగర మథనం అయింది. మొదలు హాలాహలమే ఏర్పడుతుంది. ఆ తర్వాత వాతావరణంలో చాలా మంచి మార్పులు వచ్చినాయి. ఈ క్షీరసాగర మథనం నుండే చంద్రుడు పుట్టడం జరిగింది. ఆ తర్వాత భూమిపై వాతావరణం ఏర్పడి జీవజాతి వికసించడానికి కారణం అయింది.

దెబ్బ తాకినప్పుడు ఏర్పడిన గుంట భాగాల్లోకి అప్పటికే భూమి మీద ఉన్న జలం అంతా చేరింది. అదే నేడు మనం చూస్తున్న సముద్రం. భూ భాగం పూర్తిగా బయటకు రావడం మొదలైంది. భూమిపై భాగంలో జీవోత్పాదనకు కావలసిన వాతావరణం ఏర్పడింది. భూమి చుట్టూ ఉన్న వాతావరణంలో హైడ్రోజన్, ఆక్సీజన్, కార్బన్ డై ఆక్సైడ్, నైట్రోజన్ వంటివి ఉండేవి. కాలక్రమంలో వాటిలోనూ ఒక క్రమపద్ధతి ఏర్పడటం మొదలైంది. నీటిలోని బ్లూగ్రీన్ ఆల్గే క్రమంలో ఆక్సీజన్ అధికంగా విడిచిపెట్టడం జరిగింది. జలం ద్వారా వచ్చే ఆక్సీజన్, వాతావరణం లోని ఆక్సీజన్ వల్ల ఈ భూమి చుట్టూ ఒక ఓజోన్ పొర ఏర్పడింది. అదే మనను రక్షిస్తుంది. అది ఉండడం వల్ల భూమికి ఒక రక్షణ కవచం ఏర్పడినట్లయింది. అప్పుడే ఇక్కడ జీవజాతి పూర్తి వికాసానికి అవకాశం కలిగింది. కల్పవృక్షం, కామధేనువు, ఐరావతం, ఉచ్ఛైశ్రవం వంటి అంశాలతో కూడుకున్న లక్ష్మీదేవి కూడా ఈ సందర్భంలో జన్మించడమంటే ఈ భూమి మీద ఆక్సీజన్ ఏర్పడటమే. అంతే కాకుండా ఆక్సీజన్ శాతం సరియైన విధంగా ఉండటం వల్ల అనేక రకాల సంపదలు, ఆహారం ఈ భూమిపై వికసించాయి.

లక్ష్మీం క్షీర సముద్ర రాజ తనయాం ... అనే శ్లోకార్థాన్ని గమనిస్తే ఈ ఆక్సీజన్ సరియైన విధంగా ఈ భూమిపైన విస్తరించడమే అని మనం అర్థం చేసుకోవచ్చు. పాంచభౌతిక వ్యవహారమంతా మనకు అనుకూలంగా మార్చుకునే విధానాన్ని మనవారు ప్రకృతి అని పిలిచారు. సక్రమంగా పంచభూతాలతో రచించబడింది అనే అర్థంలో ప్రకృతి, ప్రపంచము అనే పేర్లను పిలవడం అందుకొరకే. లక్ష్మీ అష్టోత్తర శతనామాల్లో కూడా మొదటి నామం 'ప్రకృత్యై నమః' 'వికృత్యై నమః' 'విద్యాయై నమః' ... మొదలైన నామాలు చూస్తే మనకు ఆ శక్తి సరియైన విధంగా తయారైనది, తెలుసుకోదగినది అని అర్థం అవుతుంది.

భూమి మీద ప్రకృతి లక్ష్మీదేవిగా భావన చేస్తే, భూమ్యాకర్షణ శక్తిని ఏనుగు రూపంలో చూడాల్సి ఉంటుంది. ఏనుగుల ముఖం నుండి పడే జలం అంతా, గురుత్వాకర్షణ వల్ల మేఘ మండలం ఏర్పడటం, వర్షం పడి భూమి సస్యశ్యామలం కావడం, అనేక రకాల సంపదలు ఏర్పడటానికి మూల కారణం కావడమే 'గజలక్ష్మీ' రూపం.

సూర్యుని కిరణాలు తగలగానే కమలం / పద్మం వికసిస్తుంటాయి. ఈ ప్రకృతి వికసించాలంటే ఆక్సీజన్ వంటి వాయువులతో పాటు ఒక క్రమపద్ధతిలో ఏర్పడిన వాయు సమూహం కావాలి. లక్ష్మీదేవి కూర్చున్నది, చేతిలో పట్టుకున్నది, కన్నులు కలది అంటూ... అనేక రకాలుగా పద్మాన్ని వర్ణించే సంప్రదాయం ఉంది.

**పద్మ ప్రియే పద్మిని పద్మహస్తే పద్మాలయే పద్మదళాయతాక్షి**
**విశ్వ ప్రియే విష్ణు మనోనుకూలే త్వత్పాద పద్మం మయి సన్నిధత్స్వ**

అనే శ్లోకాన్ని మనం పారాయణం చేస్తుంటాం. ఈ భావన అంతా ఈ భూమి మీద జీవ వికాసాన్ని సూచించే అంశంగా భావించాల్సి వస్తుంది. పద్మ శబ్దమే వికాసానికి సంకేతం. ఈ ప్రకృతి వికాసానికి సంకేతంగా సూచించబడటం వల్లనే పద్మంలో లక్ష్మీదేవి, సరస్వతీ దేవి, బ్రహ్మ కూర్చున్నట్లు సూచించడం సంప్రదాయంగా మారింది.

ప్రకృతి వికాసానికి ఆక్సీజన్ బాగా తోడ్పడింది. అందుకే సమస్త దేవతలను దాసీభూతులుగా చేసుకున్నారన్న భావన మనకు సూచన చేయడం జరిగింది. ఈ ఆక్సీజన్‌తో కూడుకున్న సరియైన ప్రకృతికే అందరూ లక్ష్మీదేవిగా, శ్రీదేవిగా నామకరణం చేసినారు. తరువాతి కాలంలో ఆ యా రూపాలతో కూడుకున్న అమ్మవార్లకు అర్చనలు అధికంగా చేయడం మొదలు పెట్టారు. అష్ట లక్ష్మీ రూపాలన్నీ మనలోని, మన చుట్టూ ఉన్న సంపదల స్వరూపాలే. అర్థం చేసుకుంటే అన్నింటిలోనూ ఆ యా సంపదలను చూడవచ్చు.

శబ్ద శాస్త్రం ప్రకారం శ్రీం అనే అక్షరం కూడా లక్ష్మీదేవికి ప్రతీకగా సూచించడం సంప్రదాయంగా వస్తుంది. శ, రేఫ, ఈం కారాలతో కూడుకున్నదీ అక్షరం. శంలో శాంతి, సర్వతత్వం కూడుకుని ఉన్నాయి. రేఫలో అగ్ని తత్త్వం ఉంటుంది. ఈం ఒక దార్శనిక వ్యవహారాలకు సంబంధించినది.

శ్రీసూక్తం అనే వైదిక సూక్త మంతా ఈ భూమికి సంబంధించిన లక్ష్మీ, సంపదలను తెలియజేసే విధంగా ఉంటుంది. శ్రీ, లక్ష్మీ అనే పేర్లు పర్యాయ పదాలుగా శ్రీసూక్తంలోనే ఉపయోగించడం జరిగింది. కనిపించే ధన సంపదలను మాత్రమే మనం గమనించే బలహీన స్థితిలో మనం కనిపిస్తున్నాం. కాని, కనిపించని ఆరోగ్యం, సంతోషం, సంతృప్తి, ప్రశాంతత, చైతన్యం వంటి ఎన్నో అంశాలు మనకు ఆనందాన్ని పెంచుతూ ఉంటాయి.

భూమి చుట్టూ ఉండే ఓజోన్ పొర లోపలి ప్రకృతికి ఈ 'శ్రీ' అనే పేరు కనిపిస్తుంది. ఈ పొర గూర్చిన వివరాలను మనం బాగా అధ్యయనం చేస్తే వామనావతారం వరకు ఉన్న కథలన్నీ దాదాపుగా ఈ ఓజోన్ పొర చుట్టూ ఉంటాయి. ఓజోన్ పొరను (హిరణ్య ప్రాకార) పాడు చేయకుండా కాపాడే విధానమే 'నరసింహావతార' తత్త్వం. చిన్నగా ఉన్న ఓజోన్ పొరను మూడింతలుగా మారడమే వామనావతార తత్త్వం.

మన పురాణాల ప్రకారం విష్ణువు ప్రక్కనే లక్ష్మీదేవిని కూర్చోబెట్టడం వెనుక రహస్యం ఇదే. సూర్యుడు విష్ణువుగా భావిస్తే తనకున్న ఇద్దరు భార్యలు 1. శ్రీదేవి 2. భూదేవి. అవుతాయి. శ్రీదేవి అంటే ఓజోన్ పొర లోపలి ప్రకృతి (లక్ష్మీదేవి), భూదేవి మనం నివసించేది.

లక్ష్మలు అంటే శుభ లక్షణాలు అని అర్థం. అటువంటి శుభ లక్షణాలతో కూడుకున్నదీ లక్ష్మి. క్ష్మా అంటే భూమి. ఆ భూమి జలమయం అయినప్పుడు పుట్టిందీ లక్ష్మీదేవి. ఈ శ్రీ శబ్దాన్ని మనం కూడా బాగా వినియోగించడం వల్ల మన శరీరంలోనూ ఈ ఆక్సీజన్ సరియైన విధంగా ఉత్తత్తి అవుతూనే ఉంటుంది. శరీరం చైతన్యం అవుతుంది. ఎన్నో కార్యక్రమాలలోనో హాయిగా పాల్గొనే అవకాశం ఉంటుంది. అందుకే మన పూర్వీకులు నిత్యజీవితంలో శ్రీయుత, శ్రీవారు, శ్రీమతి, శ్రీశ్రీశ్రీ, బ్రహ్మశ్రీ, రాజశ్రీ, పేర్ల మొదట్లో చివరలో శ్రీ శబ్దాన్ని వాడటం వల్ల మన శరీరాల్లో కూడా ఆక్సీజన్ వినియోగం అధికంగా జరుగుతుందని భావనతో ఈ పని చేసి ఉంటారు.

మంత్రశాస్త్ర రీత్యా, స్తోత్రాదుల రీత్యా, రూప భావన చూసినా, ధ్యాన శ్లోకాలను గమనించినా ఏ రూపంలో చూసినా ఈ భూమిలో కానీ, మన శరీరంలో గానీ ఒక సరియైన పద్ధతిలో ఆక్సీజన్ వంటి వాయువులు పుట్టడం, మనకు, మన చుట్టూ ఉండే వాతావరణానికి వినియోగపడటం వల్ల ఆ ప్రాకృతిక శక్తికి లక్ష్మీదేవి రూపాన్నిచ్చారు.



అష్టలక్ష్ములలో మనకు కేవలం ధన లక్ష్మీ దేవి మాత్రమే కనిపిస్తుంది. కానీ, శ్రీసూక్తమే ఈ అంశానికి సమాధానాన్ని ఇచ్చింది.

**"ధనమగ్నిర్ధనంవాయుః ధనం సూర్యో ధనం వసుః**
**ధనమింద్రో బృహస్పతిః వరుణం ధనమశ్నుతే"**

అనే శ్రీసూక్త ఫలశ్రుతి భాగాన్ని చూస్తే ధనమంటే ఏమిటో మనకు అర్థం అవుతుంది. అగ్ని, వాయు, సూర్యుడు, వసువులు, ఇంద్రుడు, బృహస్పతి మొదలైన వారి ప్రభావాలు ధనం అవుతుంటాయి కానీ సాధారణ రూపపరమైన ధనం, ధనమే కాదు.

భూమిపైన, లోన కూడా కొన్ని ప్రత్యేక కిరణ ప్రసారాల వల్ల ఎన్నో సంపదలు మనకు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం అవన్నీ సంపదలే. భూమిలోపలి అన్ని రకాల ముడి మైన్స్, నీళ్ళు, గ్యాస్, పెట్రోల్, గ్రానైట్స్‌తో సహా ఎన్నో అంశాలు నేడు మనకు ధనాన్ని అత్యధికంగా ఇస్తున్నాయి. ఆహారం కూడా ఈ భూమిలోనే మనకు లభిస్తుంది. అందుకే మనం శ్రీసూక్తాది పారాయణాలు, హెూమాలు చేస్తున్నా కేవలం రూప సంపదకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఇవన్నీ అనుభవించాలంటే సరియైన బుద్ధి ఉండాలి. శక్తి పెంచుకోవాలి. శక్తే సంపద అవుతుంది, లక్ష్మీదేవి అవుతుంది. గుణ సంపదలు మనలో విస్తరించడం వల్ల అన్నీ అనుభవ యోగ్యాలు అవుతాయి.

ఈ విధంగా లక్ష్మీదేవిని అధ్యయనం చేయడానికి కావలసిన మూలాంశాలను ఇంకా లోతుల్లోకి వెళ్ళి చెప్పాల్సి ఉంది. లక్ష్మీదేవి స్తోత్రాలలోనే చాలా అంశాలకు వివరణను అర్థం చేసుకుంటే ఈ విషయం మనకు అవగాహనకు వస్తుంది. ప్రకృతి సంపద, ప్రకృతిలోని ఆక్సీజన్ లక్ష్మీదేవి అనుకుంటే మన పూర్త సాహిత్యం, మంత్రశాస్త్రాదులు ఇచ్చిన పరిజ్ఞానానికి సరియైన మార్గం లభిస్తుంది.

**"శుద్ధలక్ష్మీ ర్మోక్షలక్ష్మీ జయలక్ష్మీ సరస్వతీ**
**శ్రీర్లక్ష్మీ ర్వరలక్ష్మీశ్చ ప్రసన్నా మమ సర్వదా"**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 10  హైదరాబాద్ ఆగస్టు : 2022

# పద్యమనోహరం - 33

గన్నమరాజు గిరిజామనోహర్ బాబు
వరంగల్, ఫోన్ : 994 901 3448



**"నా దేశమ్ము మతమ్ము జీవనము నజ్ఞానాంధ్యమై దాస్య పీ**
**డా దైన్యమ్మున గ్రుగ్గి తగ్గి వికటార్త ప్రీతమై తూల, నీ**
**వే దీవ్యన్మతి శ్రీయుషః కిరణ సంపృక్తాంబు జీవాతు వ**
**ర్షా దానమ్మొనరించినావు పునరైశ్వర్యాను సంధాయివై"**

ఇవి ఆగస్టు నెల. ఈ నెలలోనే మనకు స్వాతంత్ర్యోదయం అయింది. పైగా ఇది స్వాతంత్ర్య వజ్రోత్సవ శుభ సందర్భం. ఈ ఆగస్ట్ లోనే ప్రసిద్ధి కవి కీ.శే. దేవరకొండ బాలగంగాధర తిలక్ జన్మించారు. ఆయన ఆధునిక తెలుగగు సాహితీ ప్రపంచాన తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సాధించుకున్న సాహితీమూర్తి. "తిలక్" అనగానే స్ఫురించేది వారి "అమృతం కురిసిన రాత్రి" వచన కవితా సంకలనం. కాని తిలక్ వచన కవితా రంగంలోకి రాకపూర్వం పలు పద్యకవితలు అందించిన పద్యకవి. 1963లో కూడా నాటి 'భారతి' మాసపత్రికలో "వివేకానంద స్వామి" శీర్షికతో రచించిన అద్భుతమైన కవితాఖండిక లోనిదే ఈ పద్యం.

భారతజాతిలో కొత్త ఊపిరులు నింపి యావత్ప్రపంచానికి మన దేశపు ఔన్నత్యాన్ని చాటి చెప్పిన మహనీయుల్లో వివేకానందుడు, అరవిందుడు ముఖ్యులు. అటువంటి వివేకానందుణ్ణి కీర్తిస్తూ –

"నా దేశం, నాజాతి దాస్యంలో పడిపోయి, అజ్ఞానాంధకారంలో దీనంగా కాలం వెళ్ళదీస్తూ, తన సహజ ప్రతిభను మరచిపోయి భయానకమై ఒకానొక స్థితిలో పడిపోయిన దశలో గొప్పనైన తేజస్సుతో బుద్ధితో వెలుగు కిరణాల వర్షాన్ని కురిపించి ఈ జాతికి ప్రాణం పోసిన మహనీయుడవై'' నావని ఈ ఖండికలో స్మరించుకోవడం తిలక్‌లోని జాతీయ భావనా దృష్టికి, తిలక్ లోని సమాజ చింతనకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. పరాయి పాలనలో మగ్గిపోయి, తన ప్రకాశాన్ని తగ్గించుకుంటున్న జాతిని రక్షించిన వివేకానందుణ్ణి నిత్యం స్మరించుకోవలసిన అవసరాన్ని తెలిపే ఖండిక ఈ "వివేకాంద స్వామి" అనే ఖండిక.

1963 నాటికే దేవరకొండ బాలగంగాధర తిలక్ గారు దాదాపుగా పద్య కవిత్వాన్ని వదలి తమ వచన కవిత్వం ద్వారా నాటి యువతరాన్ని విపరీతంగా ప్రభావితం చేశారు. తమ కవిత్వం తిలక్ మానవుల కష్టాలకు చలించి, తమ కలాన్ని మనిషి కన్నీరు తుడవడానికే ఉపయోగించుకున్నారు. పలు పద్య కవితల్లో కూడా వారిలోని ఈ పార్శ్వం మనం గమనించవచ్చు.

భావకవిత్వం తెలుగు నేలపై విస్తృతంగా తన ప్రభావం చూపుతున్న రోజుల్లో తిలక్ కలంపట్టి కవిత్వ వేదిక ఎక్కారు. నాటి కవిత్వ ప్రపంచంలో వెలిగిపోతున్న దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి ప్రభావం తిలక్ గారిపై అధికంగా ఉంది. దానితోబాటు పాశ్చాత్య సాహిత్యాన్ని కూడా అధ్యయనం చేసిన వ్యక్తి గనుక కవిత్వపు లోతులను తెలిసి తమ కవిత్వాన్ని తెలుగు వారికి అందించారు. వారు రాసిన పద్య ఖండికలు గోరువంకలు, సీత, విషణ్ణ వైదేహి, తొలకరి, అద్వైత మాన్మథం వంటి పలు పద్య ఖండికలు వారి సుకుమార కవిత్వ ధారకు నిదర్శనాలు క్రమంగా వచన కవిత్వాన్ని వాహికగా ఎన్నుకున్న కవి తిలక్ గారు అపురూపమైన, అభ్యుదయదాయకాలైన వచన కవితా ఖండికలను వెలయించారు. కథా రచయితగా, నాటక రచయితగా తమదైన ముద్ర వేసిన దేవరకొండ తిలక్‌గారి అకాల మరణం యావత్సాహిత్య ప్రపంచాన్ని వేదనామయం చేసింది.

1966 జులై 1 వ తేదీన వారి ఆకస్మిక మరణం సంభవించే నాటికి వారి వయస్సు కేవలం 45 సంవత్సరాలే కావడం విషాదకరం. స్వాతంత్ర్య భారతంలో కూడా కొనసాగుతున్న సామాన్యుని వేదనకు చలించి అనేక కవితా ఖండికల నందించిన తిలక్ గారు అకస్మాత్తుగా స్వామి వివేకానందుని హృదయాన్ని ఆవిష్కరించిన క్రమంలో తాము దాదాపుగా వదిలిపెట్టిన పద్యాల్లో రాయడం విశేషం. ఈ వజ్రోత్సవ సందర్భంలో ఈ దేశం వజ్రభారతం కావాలంటే, వజ్ర సదృశమైన ఒక మహనీయుడు రావాలి. దానికి ఇటువంటి ఖండికలే ప్రేరణ. ఈ శుభ తరుణాన వివేకానంద స్వామిని,వ ఆయన్ను మరోసారి స్మరించుకునే గొప్ప కవిత నందించిన తిలక్ గారిని ప్రతి తెలుగువాడూ సంస్మరించుకోవాలి.



# భారతీయాకరణ – 3

## ఆంగ్ల మూలం : బలరాజ్ మధోక్, అనువాదం : కోవెల సంపత్కుమార

బలరాజ్ మధోక్ దేశశాంతి సమైక్యతలను పరిరక్షించడానికి భారతీయ ప్రజల ఆలోచనలను భారతీయాకరించవలసిన అవసరాన్ని చెబుతూ ఇంగ్లీష్ లో వ్రాసిన Indianness కు అనువాదం ఈ భారతీయాకరణ. భారతీయాకరణ అంటే అన్ని రకాల దీపాసనా మార్గాలను స్థలాలను సమానంగా గౌరవించడం. ఒక వ్యక్తి తాను ఏ కుల, మత, భాషావర్గాలకు చెందినవాడైన వాటి ప్రయోజనాలన్నిటి కన్నా దేశ ప్రయోజనానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం ప్రధానమన్న అభిప్రాయాలు బలరాజ్ మధోక్ ఆలోచనల్లో కనిపిస్తాయి.


రాజకీయ వ్యవస్థలో జాతీయ భావన స్వరూపాన్ని, భారతీయాకరణ విషయంలో జరుగుతున్న చర్చలు, వ్రాసిన వ్యాసాలు, లేఖలు వాదోపవాదాలు ఈ గ్రంథ రచనకు బలరాజ్ మధోక్‌ను ప్రేరేపించాయి. భారతీయాకరణను గురించి ఒక జాతీయ భావన గల మేధావి ఆలోచనల ప్రతిబింబం భారతీయాకరణ. 1970లో వచ్చిన ఈ రచనను సంపత్కుమార తర్వాత కాలంలో సుమారు 80లకు ముందే అనువదించిందంటారు.


భారతదేశం భౌగోళిక స్వరూపం, జాతీయత – భారతీయత మధ్య గల తేడా, భారతీయాకరణ అంటే ఏమిటి? ఎందుకు? దానివల్ల ప్రయోజనమేమిటి? అది జరగవలసిన తీరు ఏమిటి? అన్న విషయాలను యథామూలంగా సంపత్కుమార అందించారు. అనువాదకుడిగానూ జాతీయభావనా చైతన్యం, దేశీయ ఆలోచనా విధానం వ్యక్తమయ్యే రచనను ఎన్నుకోవడం ఆయన దేశీయ నిబద్ధతను చెబుతుంది.

భారతీయ సంస్కృతి సంప్రదాయాలలో విదేశీయుల వల్ల కలిగిన విశిష్టత గణనీయమేమీకాదు. భారతీయ ఖగోళ విజ్ఞానంపై, శిల్పకళపై గ్రీకుల ప్రభావం కృతజ్ఞతాపూర్వకంగా స్వీకృతమయింది. సిథియన్లు, హూణుల ప్రభావం భారతీయ సంస్కృతిపై చెప్పుకోదగినంతగా ఏమీ లేదు. తురుష్కులూ, అరబ్బుల విషయం గూడా ఇంతే.

సంస్కృతి కన్నా నాగరికత భిన్నమయింది. నాగరికత ప్రధానంగా మనుష్యుని బహిరమయిన వనరులకూ, అలంకరణలకూ సంబంధించింది. అందువల్ల దానిలో విరివిగానే మార్పులు వచ్చినయి. భారతీయుల వస్త్రధారణలోనూ, ఉపయోగించే సామాగ్రిలోనూ తురుష్కులు,మొగలులు చాలా మార్పులు కలిగించి సమృద్ధం చేసినారు. ఉర్దూ భాష కూడా భారతదేశానికి వారు ప్రసాదించిందే. సైనిక శిబిరాలలోనూ, తురుష్కుల, మొగలుల దర్బారులలోనూ ఉపయోగించబడిన హిందీకే ఆంగ్లానికి టామీ ఇంగ్లీష్ వలె–''ఉర్దూ'' అన్నది వ్యవహారంలో మరొక పేరు. తురుష్కమయిన ఈ "ఉర్దూ" పదానికి "సేన" అని అర్థం. భాషకు ప్రధానమయిన క్రియా పదాలను హిందీ నుంచే ఉర్దూ స్వీకరించిందికానీ, నామవాచక, విశేషణాది పదాలను మాత్రం తురుష్క, అరబ్, పర్షియన్ భాషలనుంచి గ్రహించింది. లిపి కూడా పర్షియన్‌దే, హిందీకి ఉర్దూకూ ఉన్న ప్రధాన భేదమల్లా ఈ లిపికి సంబంధించిందే.

నాగరికత ఎప్పుడు గూడా స్థిరంగా ఉండదు. తప్పనిసరిగా అందులో మార్పులు రావడం సహజంగానే జరుగుతూ ఉంటుంది. అతి ప్రాచీనమయిన భారతీయ నాగరికతతో బాటు అన్ని





నాగరికతలనూ ఈనాడు అమెరికన్ నాగరికత అతిగా ప్రభావితం చేస్తున్నది. కానీ సంస్కృతి విషయంలో ఇట్లా చెప్పడానికి వీలు లేదు. వ్యక్తి యొక్క బహిస్స్వరూపం మీదకన్నా, అంతస్స్వరూపంపై ప్రభావాన్ని పరివ్యాప్తం చేసే మౌలిక మూల్యాలకు సంబంధించింది సంస్కృతి.

ఇంత మాత్రాన ఏ సంస్కృతి గూడా ఇతర సంస్కృతుల సంపర్కంగానీ, ప్రభావంగానీ ఏ మాత్రమూ లేకుండా స్వచ్ఛతరంగా ఉంటుందనడానికి వీలులేదు. స్వచ్ఛజాతి అన్నట్లుగానే, స్వచ్ఛ సంస్కృతి అనేది గూడా ఈనాడు ఒక భ్రాంతి మాత్రమే. చరిత్ర గతిననుసరించి వివిధ ప్రభావాలను తనలో విలీనం చేసుకుంటూ సంస్కృతి విస్తృతమవుతూ ఉంటుంది. ఈ దృష్ట్యా ప్రపంచంలోని ప్రతి సంస్కృతి కూడా ఒక సంయుక్త సంస్కృతి రూపమే. అమెరికన్ సంస్కృతి కన్నా మించిన సంయుక్త సంస్కృతీ స్వరూపం ప్రపంచంలో మరొకటి ఏదీలేదు. ప్రపంచంలోని వివిధ సంస్కృతులకు చెందిన

అనేకులు వలస వచ్చి ఆ దేశంలో స్థిరపడి పోయినారు. అయినాసరే, ఏ దేశం గూడా స్వదేశీయ సంస్కృతిని సంయుక్త సంస్కృతిగా పరిగణించదు. ఎందుకంటే, ఆ విధంగా పాటించడం జాతీయ సమైక్యతకు విచ్ఛేదకరం. తాను ప్రతిపాదించిన ద్విజాతి సిద్ధాంతాన్ని బలపరచుకొనడం కోసం శ్రీ జిన్నా మొదటిసారిగా భారతదేశంలో ఈ "సంయుక్త సంస్కృతి" అన్న పదబంధాన్ని ఉపయోగించినాడు. భారతదేశంలోని మిగిలిన వారి సంస్కృతి కన్నా, భారత ముస్లింల సంస్కృతి భిన్నమయినదని గట్టిగా వాదించినాడు. కానీ ఈ వాదనను పండిత నెహ్రూ తీవ్రంగా వ్యతిరేకించినారు. భారతదేశంలోని ముస్లింలందరూ విదేశీయులుకారు. ప్రధానంగా మతాంతరీకరణం వల్ల ముస్లింలయిన వారే. శ్రీ మౌలానా ఆజాద్ చెప్పిన దాని ప్రకారం 95శాతం మతాంతరీకరణం వల్ల ముస్లింలయిన వారే. విదేశీ వంశీయ ముస్లింల కన్నా, మతాంతరీ కృతులయిన ముస్లింల నిష్పత్తి మరింత అధికం. ఇతరుల బలవంతంవల్లనో, ఇంకా ఇతర కారణాలవల్లనో, ఈ మతాంతరీ కృతులయిన వారి ఉపాసనా విధానంలోనైతే మార్పు వచ్చిందని గాని, వారి పూర్వీకులలోనూ, వారసత్వంగా వచ్చిన సంస్కృతిలో మాత్రం ఏ విధమయిన మార్పు రాలేదు. సంస్కృతి అనేది ఒక దేశం మొత్తానికి సంబంధించిందే తప్ప, ఏదో ఒక మతానికి మాత్రమే సంబంధించింది కాదు. యూరోపులో అంతటా క్రైస్తవ మతమే, అయినా జర్మన్ సంస్కృతి, ఫ్రెంచ్ సంస్కృతి, ఇటలీ సంస్కృతి దేనికది ప్రత్యేకమయినవే. పశ్చిమాసియా అంతటా దాదాపు ముస్లింలే మరి. అయినా, తురుష్క సంస్కృతి, అరబ్ సంస్కృతి, పర్షియన్ సంస్కృతి తమ తమ ప్రత్యేకతల కారణంగా విభిన్నమయినవి. భారతదేశంలో ముస్లిం సంస్కృతి అనీ, క్రైస్తవ సంస్కృతి అనీ భిన్నభిన్న సంస్కృతి లేవి నిజానికి లేవు. ఉన్నదొకే ఒక్క సంస్కృతి, అది భారతీయ సంస్కృతి. భారతీయులందరికీ అది ఉమ్మడి, అది గంగానది వంటిది. హిమాద్రిపై గంగోత్రిలో జన్మించిన గంగ, సముద్రందాకా తాను చేసే ప్రయాణంలో మధ్య మధ్య యమున, గండకి మొదలయిన నదులను అనేకంగా తనలో విలీనం చేసుకుంటూ సాగుతున్నది. అయినా దాని జలం ఆద్యంతమూ గంగాజలమే. భారతీయ సంస్కృతిని సంయుక్త సంస్కృతి అని గానీ హిందూ – ముస్లిం సంస్కృతుల మిశ్రమం అని గానీ అనడం, గంగా జలాన్ని ప్రయాగలో గంగ యమునా జలమనీ, పాట్నాలో గంగా గండకీ జలమనీ అనడం మాదిరిగానే అర్థరహితమైనది. చరిత్రగతిలో భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు సమృద్ధంగా అభివృద్ధి పొందినయి. భౌగోళికంగా, భాష విషయికంగా పలురంగు రూపులున్నా గూడా, అవన్నీ భారతీయ రీతిలోనూ భారతీయాత్మలోనూ ప్రధాన భాగాలే. హిమాద్రి నుంచి సముద్రం దాకా వ్యాపించిన ఈ దేశ భౌతిక స్వరూపం, మరియు సంస్కృతీ సంప్రదాయాలలో ప్రతిఫలించే ఆత్మ స్వరూపం వీటి అన్నిటి సమ్యక్ సమ్మేళనం ఈ దేశాన్ని ఒక విశిష్టమైన జాతిగా రూపొందించింది.

భారతీయులందరికీ వారు ఏ కులానికీ, తెగకూ, భాషకు ఉపాసనా విధానానికీ చెందిన వారయినా సరే– దేశానికి సంబంధించిన బరువులూ బాధ్యతలూ, వాటి నిర్వహణ వల్ల కలిగే హక్కులూ సమానమే. ఈ దేశాన్ని ఏ హోటల్ గానో, ధర్మశాల గానో భావించకుండా స్వగృహంగా భావించి దేశీయ సంస్కృతీ సంప్రదాయాలను సమృద్ధంచే వారందరూ ఒకే ప్రజ– ఒకే జాతి.

కేవలం భారతదేశంలో జన్మించినంత మాత్రాన ఒక వ్యక్తి ఈ దేశానికి సంబంధించిన అతని ప్రవర్తన, భావనా విధేయతలతో నిమిత్తం లేకుండానే సహజ రీతిలో, సరయిన అర్థంలో భారతీయుడవుతాడనేది నిజం కాదు. భారతదేశంలో వేలకొలది విదేశీయులు నివసిస్తున్నారు. వారికి కొడుకులూ, బిడ్డలూ ఈ దేశంలోనే జన్మిస్తున్నారు. న్యాయ శాస్త్రానుసారంగా, కొన్ని సాంకేతిక కారణాలవల్లా వారు "భారత పౌరులు" కావచ్చు. అంతమాత్రాన వారికి ఈ దేశంతో, ఇక్కడి సంస్కృతీ సంప్రదాయాలతో సంబంధాలూ, తద్వారా ప్రభావితమయిన ప్రవర్తన, ఆత్మీయత మొదలయినవి ఇక్కడి భారతీయులకున్నట్లుగానే తప్పక ఉంటాయనుకోవడంలో ఏ మాత్రం సామంజస్యం లేదు. అందువల్ల, కేవలం న్యాయ శాస్త్ర పదజాలాన్ని మాటు పెట్టుకొని "ఎవడు నిజమయిన భారతీయుడు" అన్న అంశాన్ని సంక్లిష్టం చేయడంవల్ల లాభం లేదు. భారతదేశంలో జన్మించినంతమాత్రాన ఎవడూ భారతీయుడు కాడు, భారతీయత గలవాడే భారతీయుడు.

భారతీయత అన్నది ఒక వ్యక్తి యొక్క భాషా, కుల, మతాలను బట్టిగానీ, రాజకీయ పక్షాన్ని బట్టిగానీ నిర్ణయింపబడదు. భారతదేశాన్ని, దాని విశిష్టత గూర్చి వైయక్తిక సామూహిక వ్యవహారరీతిలో ప్రతిబింబించే మానసిక వైఖరిని బట్టి నిర్ణయింపబడుతుంది. ప్రవర్తనతో నిశ్చయింపబడుతుంది. అతని ఆలోచనలూ, ఉద్దేశ్యాలూ, సంబంధాలనుబట్టి ఈ ప్రవర్తన ఏర్పడుతుంది. శ్రీమతి అనిబిసెంట్, సోదరి నివేదిత, శ్రీ స్పోన్స్ మొదలయినవారు ఇతర దేశాలలోనే జన్మించి, పెరిగి పెద్దవారయినా గూడా, ఈ దేశంలో జన్మించిన అనేకులకన్నా నిజమయిన భారతీయులుగా మన కాలంలోనే ఈ దేశానికి ఎంతో సేవ చేసినారు. మరొక వైపు చూస్తే, భారతదేశంలోనే జన్మించి గూడా, ఇక్కడే పెరిగి పెద్దవారయి గూడా జిన్నా, లియాఖత్ అలీఖాన్, ఖాసిం రజ్వీ వంటి వారు ఈ దేశానికి అత్యంత ప్రబల విరోధులయినారు.

శ్రీమతి అనిబిసెంట్, శ్రీ జిన్నా ఆయా విధాలుగా తయారుకావడానికి ఏ పరిస్థితులూ, ప్రభావాలూ దోహదం చేసినగూడా, ఒక స్త్రీ లేదా ఒక పురుషుని భారతీయత అన్నది

వారు సంపాదించుకున్నది కొంత, వారసత్వంగా పొందింది కొంత అనేది స్పష్టం. ఈ దేశంలో జన్మించకున్నా గూడా శ్రీమతి అనిబిసెంట్ భారతీయతను సంపాదించుకున్నది. శ్రీ జిన్నా, తాతల కాలంలో హిందువులే అయి ఇస్లాం మతం పుచ్చుకున్న కుటుంబానికి చెంది, ఈ దేశంలోనే జన్మించి, పెరిగి పెద్దవాడయినా గూడా, అనేక వైయక్తిక, రాజకీయ కారణాల వల్ల ఎంతగానో అభారతీయుడూ, విజాతీయుడూ అయిపోయినాడు. ఈ దేశాన్ని పాలించిన ఆంగ్లేయుల సాయంతో మాతృభూమిని ముక్కలు చేసి, ఒక మొక్కను కానుకగా పొందేంత హీనంగా దిగజారిపోయినాడు.

భారతీయీకరణ అంటే ఇప్పుడు స్పష్టంగా చెప్పుకొనవచ్చు. సంస్కారాల ద్వారా, విద్య ద్వారా, సాంఘిక – రాజకీయ ప్రయత్నాల విధానాల ద్వారా వ్యక్తిలో భారతదేశంతో ఏకాత్మతను పాదుకొల్పడం, కుల, మత, వర్గ, భాష రాజకీయ విధేయతల కతీతంగా దేశ విదేశీయత కలిగి ప్రవర్తించే విధంగా చేయడం, ద్వారా భారతీయతను సృష్టించడం, భారతీయీకరణ. అయితే, ఇట్లా చెప్పడం వల్ల ఒక వ్యక్తి తాను చెందిన వర్గంతో, భాషతో, కులంతో సంబంధాలు వదులుకోవలెనని అర్థంకాదు, కానీ ప్రాధాన్య వివక్షలో మిగిలిన అన్ని విధేయతలకన్నా దేశ విదేశీయతకే ప్రథమ ప్రాధాన్యమన్న భావన కలిగి ఉండవలెననేదే ముఖ్యం. భారతీయీకరణ అంటే ఒక ముస్లిం, ముస్లిం కాకుండా పోవలెనని గానీ, ఒక బెంగాలీ, బెంగాలీ కాకుండా పోవలెనని గానీ అర్థం కాదు. ఎప్పుడయితే, రాష్ట్ర ప్రయోజనాలకూ, దేశ ప్రయోజనాలకూ, లేదా ఒక మత వర్గ ప్రయోజనాలకూ, దేశ ప్రయోజనాలకూ ఇట్లాగే ఇంకా ఇతర ప్రయోజనాలకూ, దేశ ప్రయోజనాలకూ ఘర్షణ ఏర్పడుతుందో, అప్పుడు దేశ ప్రయోజనాల కోసం ఆ రాష్ట్ర మతవర్గాదుల ప్రయోజనాలను త్యజించడానికి సిద్ధంగా ఉండడమే భారతీయీకరణ ఉద్దేశిస్తున్నది. ఈ విధంగా భారతీయ ప్రజలలో గాఢమయిన జాతీయ– దేశీయ భావనను సృష్టించడానికే మరొక పేరు "భారతీయీకరణ" ఏ దేశంలో నైనా ఈ విధమయిన సంయోజక శక్తుల ఐక్యమే జాతీయత.

జాతీయత అన్నది కేవలం రాజకీయ విధేయతకు మాత్రమే పరిమితం కాదు. దేశీయ సాంస్కృతిక వారసత్వంలో ఆత్మీయత, దాని గూర్చిన గర్వానుభూతి జాతీయతకు అవసరం. జాతీయ జీవనరంగాలన్నింటికీ సంబంధించిన ఆలోచనా విధానంలో, ఆచరణలో ఈ భావం పరివ్యాప్తం కావలసి ఉంటుంది.

జాతీయ పతాకం మీద, జాతీయ గీతం మీద, జాతీయ భాషల మీద, జాతీయ నైతికత మీద, మూలాల మీద, నిజమైన గౌరవం ఉండటం జాతీయతలో ఒక భాగం. మాతృభూమితో, దాని సంస్కృతీ వారసత్వాలతో ఏకీభావాన్ని, ఆత్మీయతను కలిగించడం ద్వారా విదేశీయులను గూడా జాతీయతా ప్రవాహంలో సంలీనం చేసుకొనవచ్చు.

అందుకని, భారతీయులందరిలో గాఢమయిన జాతీయతా భావం కలిగించడం కన్న భారతీయీకరణ అంటే వేరే ఏమీ లేదు. ఇది క్రొత్తదికాదు. పాపకార్యము కాదు. దేశభక్తుడనిపించుకో దగిన ఏ భారతీయుడు గూడా అభ్యంతరం చెప్పవలసిన అంశం అసలే కాదు. దీన్ని వ్యతిరేకించేవారు, అయితే భారత దేశాన్నీ, దాని వారసత్వాన్నీ అర్థం చేసుకోని వారయినా అయి ఉంటారు, లేదా వర్గ ప్రయోజనాల కోసం, రాజకీయ ప్రయోజనాల కోసం కొన్ని కొన్ని వర్గాలలో చికాకులూ, భయాందోళనలూ రెచ్చగొట్టే వారయినా అయి ఉంటారు.

భారతదేశం ఏనాడు గూడా గ్రుడ్డిగా ఏదో ఒక విధానాన్ని మాత్రమే పట్టుకొని వ్రేలాడలేదు. మత, విశ్వాస, భావ స్వేచ్ఛలను సర్వదా ఈ దేశం ఎంతగానో మన్నిస్తూనే ఉండటం చరిత్ర ప్రసిద్ధమైన అంశం. ఒక ప్రత్యేకమైన ఉపాసనా మార్గాన్ని, దాన్ని అంగీకరించనివారిపై బలవంతంగా రుద్దడానికి సౌలభ్యం, అవకాశం ఎంత ఉన్నా గూడా, అట్లా చేయలేదు. రాజకీయంగానూ, ఆర్థికంగానూ ఏ విధమయిన వెనుకబలం లేకుండానే, చిన్న చిన్న గుంపులుగా ఈ దేశానికి వచ్చిన సిథియన్ క్రైస్తవులు, ఫారసీలు ఇక్కడ సుఖంగా జీవనం గడుపగలగడం భారతీయ సంస్కృతి యొక్క విశ్వజనీనమయిన విశాల దృక్పథానికీ, ఉదార ఆదరభావానికీ సజీవ తార్కాణం.

**"సర్వే సన్తు సుఖినః సర్వే సంతు నీరామయా:"** – ఏ బాధలు లేకుండా అందరూ సుఖంగా ఉందురు గాక, అందరూ రోగరహితులయి నిర్విచారంగా సంతోష సౌభాగ్యాలతో ఆనందింతురు గాక– అన్నది భారతీయ జీవన విధానానికి మార్గదర్శక సూత్రం. అందువల్ల, భారతీయీకరణ అన్నది ఒక ఆచరణాత్మక భావన. ఇందులో ఏ విధమయిన విధ్వంసకత్వం లేదు. (సశేషం)



# భూమి గురుత్వాకర్షణ శక్తి – గణపతి

**"లంబోదరం పరమసుందర మేకదంతం రక్తాంబరం త్రిణయనం పరమం పవిత్రమ్**

**ఉద్యద్ దివాకర నిభోజ్జ్వల కాంతికాంతం విఘ్నేశ్వరం సకల విఘ్న హరం నమామి"**

భారతీయులు ఆరాధించే దేవతా స్వరూపాలన్నీ శక్తి స్వరూపాలే. ఒక్కో శక్తిని ఒక్కో తాపసి దర్శించి, తమ దర్శనానికి తగిన విధమైన ధ్యాన శ్లోకాన్ని అందించారు. శ్లోకభావానికి రూపాన్ని ఇచ్చి దాని ద్వారా మూలస్వరూపాన్ని ఆరాధించడం ప్రారంభించారు. ఆ శిల్పాలను పూజించడమే కాలక్రమంలో సంప్రదాయంగా మారింది. పండితులు మూలశక్తిని మంత్రరూపంలోనూ, సాధారణ వ్యక్తులు తాము తయారు చేసుకున్న రూపంలోనూ ఆరాధిస్తూ వస్తున్నారు. అటువంటి విశిష్టమైన దైవతాలలో శ్రేష్ఠమైన వైజ్ఞానిక శక్తి, తొలిపూజలు అందుకునే దైవమే 'గణపతి'..

విఘ్నాలకు అధిపతి, గణాలకు అధిపతి, లంబోదరం, గజముఖం, నాగబంధనం, మూషికవాహనం వంటి విశేష లక్షణాలతో కూడుకున్న దైవం వినాయకుడు. పురాణాల ప్రకారం శివపార్వతులకు ప్రథమ సుతునిగా భావించబడుతున్నవాడీ గణపతి. విచిత్రమైన రూపంతో కూడుకున్న ఈ దైవాన్ని కేవలం భారతీయులే కాక ఇతర దేశాల వారు కూడా పూజించినట్లు మనకు వేరు వేరు ప్రదేశాలలో ఆధారాలు లభిస్తున్నాయి. 'గాణాపత్యం' అనేక ప్రదేశాల్లో చిన్న చిన్న మార్పులతో వ్యాపించింది. ఇటువంటి ప్రత్యేక రూపం వెనుక ఉన్న తత్త్వం ఏమిటి? ఈ భాద్రపద మాసంలో ఈ ఆరాధన వెనుక ఉన్న రహస్యం ఏమిటి? అనే అంశాలను మనం ప్రత్యేకంగా పరిశీలిస్తే ఈ గణపతి వైజ్ఞానిక స్వరూపం మనకు అర్థం అవుతుంది.

మనం నివసించే భూమి ఆకృతి శివలింగాకృతి. భూమి అంటే శివుడే. భూమి చుట్టూ ఉండే పాంచభౌతికమైన ప్రకృతి పార్వతి. ఈ భూమికి ప్రత్యేకమైన శక్తి ఉంది. అదే గురుత్వాకర్షణ శక్తి. అంటే మనం గమనించగలిగే అన్ని శక్తులలోనూ అతి పెద్దది అని అర్థం. ఆ శక్తి వల్లనే మన చుట్టూ ఒక వాతావరణం ఏర్పడి, మన జీవనవిధానంలో ఒక స్పష్టత ఏర్పడింది. భూమికి ఉన్న ఈ శక్తి వల్లనే మనం భూమిని అంటిపెట్టుకుని ఉంటున్నాం. ఆ శక్తిలఏ కొంచెం మార్పు వచ్చినా మనలోని పాంచభౌతిక శక్తులలో మార్పులు కలుగుతుంటాయి. అందుకే మనని ఆకర్షించే శక్తిరూప దైవానికి తొలిపూజలు చేయడం సంప్రదాయం అయింది.

భూమి మధ్యభాగంలో ఉబ్బెత్తుగానూ, ధ్రువాల వద్ద ఒత్తబడి ఉ ంటుంది. భూమిలో ఉత్తరంవైపు తల, దక్షిణం వైపు కాళ్ళు పెట్టుకున్నట్లుగా ఉన్న గణపతి స్వరూపాన్ని ఊహిస్తే ఈ రూపానికి ఒక స్పష్టత ఏర్పడుతుంది. భూమి చుట్టూ ఉన్న విద్యుదయస్కాంత తరంగ శక్తి (కుమారస్వామి) రూపమైన సర్పమే గణాధిపతి యొక్క నడుముకు చుట్టుకున్న సర్పం. ఇదంతా భూమి గురుత్వాకర్షణకు మన ఋషులు ఇచ్చిన రూపాన్ని సూచన చేస్తున్న అంశాలే.


వినాయక వ్రత కథలోని సారాన్ని వైజ్ఞానికంగా స్థూలంగా పరిశీలిస్తే – ప్రకృతి (పార్వతి) ద్వారా చేర్చబడిన ఆకర్షణ శక్తి ఈ భూమికి మొదట్లో సరిపోలేదు. దానిని కాలానుగతికంగా, తన గతిని మార్చుకుంటూ మరింత బలంగా భూమి మార్చుకోవాల్సి వచ్చింది. గజాసురుని తలను తీసుకుని వచ్చిన కథ వెనుక తత్త్వం అదే. భూమిపై మనకు కనిపించే అతి బలమైన జంతువు కూడా గజమే. ఈ భూమిని మోసేవి కూడా అష్టదిగ్గజాలే అనేది పౌరాణికమైన భావన. భూమికి గురుత్వాకర్షణ ఏర్పడిన తర్వాత, తన చుట్టూ తాను ఒక స్పష్టమైన విధానంలో తిరగడం మొదలైన తర్వాత విద్యుదయస్కాంత శక్తి ఏర్పడింది. అందుకే గణపతి తరువాత కుమారస్వామి జన్మించినాడన్న భావన. వీరిద్దరిలోనూ విస్తరించిన శక్తి విద్యుదయస్కాంత శక్తి (కుమారస్వామి) అయినా, మూలమైన వాడు, అత్యంత శక్తివంతమై అందరినీ నియంత్రించగలిగిన శక్తి భూమ్యాకర్షణ (గణపతి) మాత్రమే. వినాయకుడు ఒకేచోట ఉండి శక్తిని చూపేవాడు. కుమారస్వామి విస్తరిస్తూ శక్తిని చూపేవాడు అనే భావన కూడా ఈ వ్రత కథ ద్వారా తెలుస్తుంది. వినాయక మంత్రంలో 'సర్వజనంమే వశమానాయ స్వాహా' అనే మాటలో లోకాన్ని వశం చేసుకునే గురుత్వాకర్షణ శక్తికి చేసే నమస్కారమే కనిపిస్తుంది. గం – ఆకర్షణ బీజం, లం – పృథివీ బీజం. ఈ బీజాక్షరాలను పేర్లలో నింపుకుని గణపతి, లంబోదరుడు వంటి పదాలతో కొలువబడుతున్నాడు.

భాద్రపద శుద్ధ చవితి నాడు భూమ్యాకర్షణ శక్తి, చంద్రుని ఆకర్షణశక్తి మధ్యలో కలిగే ఘర్షణ వల్ల భూమిలోనూ, భూమిపైన జీవించే జీవుల్లోనూ కొన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ లోపాన్ని అధిగమించడానికి ధర్మశాస్త్రం, విజ్ఞాన శాస్త్రాలు సూచించిన విధానమే మట్టితో చేసిన గణపతి స్వరూపాన్ని తయారు చేయడం. మట్టికి దగ్గరగా ఉండడం వల్ల ఆకర్షణ శక్తికి దగ్గరగా ఉండే అవకాశం. అదేవిధంగా ఈ కాలంలో లభించే పత్రాలతో అర్చనలు చేయడం. ఇతర ఆహార పదార్థాలను తినకుండా జాగ్రత్తగా ఉండ్రాళ ్ళ మాత్రమే తీసుకోవడం. ఈ విధంగా నియయబద్ధంగా అర్చన చేయడం వల్ల మనని మనం ఈ కాలంలో నియంత్రించుకునే అవకాశం, శక్తిని కోల్పోకుండా చేసుకునే అవకాశం ఉంటాయి. అందుకే వినాయక చవితి ఒక వ్రతం. చాలా జాగ్రత్తగా ఆచరించాలి. శ్రద్ధతో పూజ చేస్తే విఘ్న నాశకుడు, శ్రద్ధలోపించిన చోట విఘ్న కారకుడు అయిన దైవం కూడా వినాయకుడే.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 10  UGC Care List Approved Journal
హైదరాబాద్ ఆగస్టు : 2022

# పాండితీ సౌహృదం

**డా. శ్రీరంగాచార్య,** పూర్వ ప్రధానాచార్యులు, పాలెం ఓరియంటల్ కళాశాల. ఫోన్ : 92994 51266



కాలం చాలా విలువైనదే గాక జగద్భక్షకమూ. అతి భయంకరం గూడా. అందుకే ప్రతిజీవీ కాలపురుష ప్రస్తావన చేస్తారు, జగద్భక్షక కాలపురుషుని ప్రభావంలో పడి మా ఆత్మీయ మిత్రుడు, సహాధ్యాపకుడైన శ్రీయుత డా. గంగాపురం హరిహరనాథ్‌గారు మాయమైతారని భావించలేదు. వారికేదో స్వల్ప అనారోగ్యం సంభవించి ఓషధీసేవ చేస్తున్నట్టు మాకు తెలిసినట్లే – వారి శివైక్యవార్త తెలిసి ఎంత కుమిలిపోయినామో తెల్పలేను. ఆయనది ఒక విచిత్ర వ్యక్తిత్వమే గాదు, అతి విచిత్ర భక్షణాది వ్యవహార పూరిత సౌమనస్యం. హరిహరనాథ్‌గారు ఉస్మానియాలో ఎం.ఏ చేస్తున్నప్పుడు మేము పరిచయమైనాము. తర్వాత వారు జడ్చర్లలోని ఓరియంటల్ కాలేజి, ఆంధ్రసారస్వత పరిషత్ ఓరియంటల్ కాలేజీల్లో స్వల్పకాలం పనిచేసి – అనంతరం జోగిపేట డిగ్రీకళాశాలలో తెనుగు అధ్యాపకులైనారు. ఆనాడు వీరి సహచరులుగా గోపాలకృష్ణారావుగారు (లెక్కలు), జనార్దనభట్ (తెలుగు), నరసింహారావు (ఇంగ్లీషు), బాలరాజు (ఫిజిక్స్) ఇట్లా ఒక పెద్ద గుంపుండేది. మొదటినుంచీ హరిహరనాథ్‌గారి మాటనే విశ్వసించిన వీరంతా ఆ కాలేజీలో (మొదట ప్రయివేటు – తర్వాత ప్రభుత్వ కళాశాల) సుఖానికన్నా శ్రమనే ఎక్కువ అనుభవించినారు. దీనికొక ఉదాహరణం చెపుతాను, కళాశాల ప్రభుత్వ వశమైన తర్వాత జరిగిన వార్షిక పరీక్షల్లో విద్యార్థులు 'కాపీ) కొట్టకుండా నిరోధించినందుకు ఆ శిష్యులంతా వీరిపైన శిలావర్షం (గుట్ట పలుగురాళ్లు) కురిపిస్తే అందరూ కాందిశీకులుగా పరుగెత్తినారు. హరిహరనాథ్‌గారు అప్పుడు ప్రిన్సిపాల్, గోపాలకృష్ణారావుగారు పరీక్షలను నిర్వహించే అధికారి, కఠిన నీతి నియమాలకాదర్శమూర్తి కాబట్టి విద్యార్థులు వీరినే పరమఘోరంగా మర్దిస్తే – చావు బ్రతుకుల మధ్య ఉస్మానియా వైద్యశాలలో చేర్చినారు. వీరి ఆరోగ్యం గూర్చి ప్రతిరోజూ వింత వింత సమాచారాల వస్తుండేవి. ఆనాడు ఉస్మానియా వి.సి.గా వున్న 'హసీంవలి (?) వీరిని ప్రతిరోజూ వెళ్లి చూచి వచ్చే సహృదయుడు, జోగిపేట కాలేజి వ్యవహారం వీరికే గాదు – ప్రభుత్వ ఉన్నతాధికారులు మొదలైనవారికి కనువిప్పు కలిగించి వారియందు 'కిం కర్తవ్యం' అనే భావనను దృఢం చేసిన పుణ్యవేళా విశేషం వలన ఉస్మానియా విశ్వవిద్యాలయ పరిధిలో నున్న అన్ని జిల్లాలలో, ప్రతి కాలేజీలోను ఎంతో శ్రమించి చూచి వ్రాసే తీరు (కాపీ) లేకుండా చేసి ఈ దేశానికుత్తమ విద్యావంతులైన యువకుల నందించగలిగారు. ఇదొక విశేషమేయైనా ఆనాడు జోగిపేట విద్యార్థుల దాడికి గురియైన గోపాలకృష్ణారావుగారు హరిహరనాథుల ధీ ధైర్యాలు ఎంతో గొప్పవి. ఈ జంట క్షీరనీర న్యాయ జీవితం గడిపినారు. ఇప్పటికీ గోపాలకృష్ణారావుగారు హరిహరనాథ్‌గారి కుటుంబంలో వున్న ఒక పెద్ద మనిషి. జోగిపేట కాలేజీ ప్రభుత్వ సంస్థయైన తర్వాత అక్కడి అధ్యాపకులను బదిలీ చేస్తే – హరిహరనాథ్‌గారు పాలెంలోని ఓరియంటల్ కాలేజికి, గోపాలకృష్ణారావుగారు స్థానిక డిగ్రీ కళాశాలకు బదిలీయై యథాపూర్వం బంధువర్గ నిర్విశేషులుగానే వున్నారు.

మా హరిహరనాథ్‌గారు 1984 నుండి మా కాలేజీలో దాదాపు 10 సం.పైగా పనిచేసినారు. అధ్యాపకునికుండే ఏ మెరమెచ్చాలు కూడా వీరియందుండేవి గావు. సామాన్య గ్రామీణ విద్యార్థులకనువైన రీతిలో ఛందోలంకారాలు, సాహిత్య విమర్శ బోధిస్తుంటే మా విద్యార్థులంతా అవనత శిరస్కులై శ్రద్ధాళువులుగా పాఠాలు విని దాని ఫలం అనంతరకాలంలో వారికెట్లా ఉపయోగపడిందో నేటికీ మననం చేసుకోవడం ఒక విశేషం.

నేను ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్న ఒక సమయంలో జరిగిన వార్షిక పరీక్షలయందు తక్కువ విద్యార్థులున్న హాలుకీయన్ను 'ఇన్విజిలేటర్'గా వేసి స్టేషనరీ మొదలైన వాటినిచ్చి పంపితే ఈయన ఆ వేసవిలో డ్యూటీ చేయటం భరించలేక ధోవతిని పైకి చెక్కి షర్టును విడిచి ఒక దగ్గర తగిలించి బయట పచార్లు చేస్తూ పరీక్ష వ్రాయిస్తుంటే చూడడానికి వెళ్లిన నేను ఆశ్చర్యపడ్డాను. ఈయన దూరంగా ఒక చెట్టు క్రింద కుర్చీలో నిద్రాళువు, హాల్లో విద్యార్థులు నేను వచ్చింది గూడా గమనించలేని శ్రద్ధతో పరీక్ష వ్రాయటం (కాపీ అనేదే లేదు) ఆశ్చర్యం అనిపించి హరిహరనాథ్‌గారిని లేపి, మాట్లాడి, పరీక్షలు నిర్వహించినాం. ఇక్కడ ఆనాటి మా విద్యార్థుల సత్ప్రవర్తన, గురుభక్తి అనేవి అభినందనీయాలు.

ఈయన ఒక తెలుగు, సంస్కృతాలే కాదు. మంచి ఇంగ్లీషు వచ్చినవాడు. హిందూ పత్రిక ఈయనకెంతో యిష్టం. దాన్ని అనుదినం ఆద్యంతం చదివేవాడు. మాన్యులు గుండేరావు హర్కారేగారి సన్నిధి, వీరిని ప్రాకృత – పాలీ భాషావిశారదుని చేసింది. హరిహరనాథ్‌గారు అలంకారశాస్త్ర

చర్చాపారీణుడు. నావంటివారితో చర్చించటం అంటే అది ఊషరక్షేత్రవర్షోదకమని భావించి అప్పటి మా ప్రిన్సిపాల్ విశ్వనాథ శర్మగారితో వాదించేవారు. ఐతే ఇద్దరు వాదిస్తుంటే వేదాల తిరువేంగళాచార్యుల వారి వాదన గుర్తొచ్చేది. చాలా ప్రొద్దున్నే (8గం.) మంచిగా భోజనం ముగించి – ఊళ్ళోవారు (మేడిపూర్) బంధువులు వస్తే కాస్తా మాట్లాడి అవిశ్రాంత పఠనం చేస్తుండే ఈయన నిత్య విద్యార్థియే గాదు. ఏ విద్యార్థి ఎప్పుడు వెళ్ళి ఏదడిగినా ఆ విషయాన్ని కూలంకషంగా వారికి చెప్పి సంతృప్తి పరచడాన్ని శిష్యులు గొప్పగా చెప్పుకుంటారు.

ఇక గోపాలకృష్ణారావుగారు బ్రహ్మచారి. మాధ్వ సంప్రదాయ వేష భాషలున్నా, సంస్కృతాంధ్రాల్లోను ప్రతిభా పరిణద్ధమూర్తి. వీరు దివారాత్రాలు తన శిష్యవర్గానికి గణిత బోధన చేయటం, వీరివల్ల ఎందరెందరో ఇంజనీరింగ్ పరీక్షల్లో నెగ్గి, నేటికీ సాంకేతిక రంగంలో కీర్తనీయులుగా వుండడానికి గోపాలకృష్ణారావుగారే ముఖ్యం అని స్మరిస్తారంటే అది గోపాలకృష్ణారావుగారి నిరీహ ప్రతిభా సమున్మేష విద్యాబోధన కొక ప్రతీక.

మా కళాశాలలో మేము సహోద్యోగులం. ఇండ్ల వద్ద ఆత్మీయతా మూర్తిమత్త్వాలు హరిహరనాథ్‌గారి సాహచర్యం కారణంగా పాలమూరు జిల్లాలోనే గాదు బయట కూడా ఎందరో పెద్దలను సేవించిన అదృష్టవంతుణ్ణి నేను. గంగాపురం నృహరిదీక్షితులు, హనుమత్‌శర్మ, సురభివర్మ వంటి వేదమూర్తులను, మహానుభావులనే గాక పల్లెర్ల వినాయక్‌రావు, గంగాపురం శ్రీహరినాథ్ మొదలైన స్నేహమే రూపుదాల్చిన వారిని సందర్శించి మిత్రుడనయినాను.

హరిహరనాథ్‌ను చూస్తే ఇంత విద్వత్తు గలవాడని, ఇన్ని భాషలు తెలిసినవాడని గమనించడానికి వారి విజ్ఞాన విశాల కూపంలోకి దిగి **'కృతతీర్థః పయసామివాశయః'** అనేదాన్ని సార్థకం చేసుకోవలసిన అవసరం వుండేది. తన బిడ్డలను, కుమారులను విద్యావంతుల చేసి, అర్ధాంగియైన ఇందిరాదేవి (అక్కగారి బిడ్డయే) గారి ఓరియంటల్ ఎంట్రన్స్ నుండి ఎం.ఎ దాకా విద్యావతిని చేసి, అనంతర కాలంలో తనకిష్టమైన 'శాసన సాహిత్యం' గూర్చి ఉస్మానియాలో పరిశోధింపచేసి పిహెచ్.డి పొందునట్లు చేసి సంతృప్తి చెందిన విద్యా తపస్వి.

బి.ఎన్.శాస్త్రిగారు మహబూబ్‌నగర్ జిల్లా సర్వస్వం (1992) సిద్ధం చేస్తున్నప్పుడు వీరితో ఒక వ్యాసం వ్రాయించడానికి మేము పడిన శ్రమ చెప్పరానిది. కానీ ఎంతో విలువైన వ్యాసం తయారు చేసి యిచ్చినారు. అదే **'పాలమూరు విద్వద్వరులు'** అనే పెద్ద రచన. ఇది **'నాఽన్యతోదర్శనీయ ప్రతిభా సమున్మేష విశేష విషయ సముపేత రచన'**. వీరుగాక వేరెవ్వరు వ్రాసినా ఆ 'జిగి' రాకపోయేది. నాడు పత్రికల్లో 'జి.కృష్ణ' వంటి మహానుభావుడు ఈ వ్యాసాన్ని ఎంతగా మెచ్చుకున్నా ఆయనలో మార్పులేదు. 'మూసీ' మొదలైన పత్రికల్లో వచ్చిన వీరి వ్యాసాలు ఇప్పటికీ మన శిరఃకంపానికనువుగా వుంటాయా లేదా అనే ఆలోచన వారికనవసరం. ఆయన రచన ఆయనది. ఆ వ్యాసాలన్నిటినీ పరిశీలించవచ్చు.

తమ పితృపాదులు నృసింహదీక్షితుల గూర్చి గొప్ప పుస్తకం వెల్వరించి, వైదిక సాహిత్య లోకానికెంతో మేలు చేసిన ప్రతిభావంతుడు. శ్రీ రామరాజుగారి పర్యవేక్షణలో **'ఆంధ్ర మహాభారతం – శాంతరస పోషణ'** అనే అంశం గూర్చి పరిశోధన చేసి భారతంలోని రసచర్చ చేసిన వారిని ఎక్కడా విమర్శించక తన రీతి తానుగా లేఖనం చేసి డాక్టరయిన హరిహరనాథ్ ఒక ధీరధిషణామూర్తియని నా యభిప్రాయం.

కళాశాలయందు మేము పాఠబోధన, పరీక్షల నిర్వహణ గూర్చి ఎంత వాదించుకున్నా అవన్నీ తరువాత **'పరమార్థేన నగృహ్యతాం వచః'** అనే సూక్తికి ప్రతీకలుగా నుండేవి. ఇదంతా ఆనాడు అధ్యాపక వృత్తిలో నున్న మా అంతరాంతరంగాలు. హరిహరనాథ్‌గారి స్వగ్రామం 'మేడిపూరు'. నాగరకర్నూల్ నుండి కల్వకుర్తికి వెళ్లే మార్గంలో 'దుందుభి' (డిండివాగు) నదీతీరంలో వుండేది. కొన్నాళ్లీయన తన భూముల్లో వ్యవసాయం చేయించుకుంటూ పాలెం – మేడిపూర్ సంచరించేవాడు. వారి వ్యవసాయం అక్షరాల 'బ్రాహ్మణ సేద్యం'గా ప్రసిద్ధమయింది. వారితో పాటు నేను మేడిపూర్, గుండూరు, తాడూరు గ్రామాలను చూచి వారి బంధువులు, జ్ఞాతులను చూచినాను. గుండూరు హనుమత్‌శర్మగారు అస్తమించినరోజు మేమంతా వెళ్లి వారికి చివరి వీడ్కోలు జరిపివచ్చి తొందర్లోనే 'దుందుభి' పేరున ఒక స్మారక సంచికను తీసినాం. దానిలో హరిహరనాథ్‌గారి 'ఖడ్గసృష్టి' వ్యాసం కలదు. అది ఎంతో విశేష విషయ భరితం. హనుమచ్ఛర్మగారు 'దుందుభి' నదీ కావ్యకర్త. అది చాలా ఖ్యాతి గాంచింది. వీరు హరిహరనాథ్‌గారికి అన్న వరుస కాగలరు. గొప్ప వేద సంస్కృతాంధ్ర పండితుడు. ఆనాడు బి.ఎన్.శాస్త్రి, శివరాం, పల్లెర్ల రాంమోహన్ సంపాదకత్వంలో తయారైన ఈ సంచిక పాలమూరు, కల్వకుర్తి ప్రాంత శాసనచరిత్రల సంచయం. ఇది తయారు కావడానికి నాడు హరిహరనాథ్ శ్రమ మరుపురానిది.

ప్రారంభంలో చెప్పినట్లు **'కాలోఽహ్యయం నిరవధిః'**. వ్యక్తులంతా గతానుగతికులే. 'సరిగ మనుష్య దేహమొక సత్రము. అందరమందులో ముసాఫిరులము'గ దా! ఇవన్నీ తెలిసిన మా హరిహరనాథ్ ఒక వ్యాసం వ్రాయలంటే కట్టె చింతపండును నానబెట్టి పులుసు పిండి'నట్లే వుండేది. ఐనా ఆ శ్రమను వారి రచన మరిపించి మురిపించేది. నా పాలెం ఉద్యోగ జీవితంలో గొప్పవారి పరిచయం, స్నేహానురాగాలు లభించి ధన్యుని చేసినాయి. అందుకే – మన పూర్వులు **'జననాంతర సౌహృదాని'** అన్నారు.

**'భ్రాతృనిర్విశేషులైన మా హరిహరనాథ్‌గారు అక్షర చిరంజీవి'**

**నమో మహద్భ్యః**


ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 10 (29) హైదరాబాద్ ఆగస్టు : 2022

# ఋషిత్వం, దేశభక్తి కలబోతే “కావ్యకంఠ వాసిష్ఠ గణపతి ముని”

ఎ. శ్రీనాథ్ రావు, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, ఫోన్ : 7981797832

అద్భుతమైన ఆధ్యాత్మిక సాధన, దేశ సంక్షేమం కోరటం.. ఈ రెండు ప్రతి మనిషికీ అత్యావశ్యకం. ఒక గొప్ప సాధకుడు దేశం కోసం ప్రార్థిస్తే వచ్చే ఫలం చాలా గొప్పది. 10 వేల మంది రాజకీయ నాయకులు చేయలేని పని ఒక్క సాధకుడు తన ప్రార్థన చేత చేయగలడు. అటు ఆధ్యాత్మికంగా ఆత్మ వస్తువు కోసం నిరంతరం పరితపిస్తూనే... తనలో వున్న అంతర్గత శక్తిని తట్టి లేపుతూనే.. తన స్వరూప నిష్ఠలో నిలబడిన వాడే నిజమైన మానవుడు. ఆతడే నిజమైన దేశభక్తుడు కూడా. తనను తాను తెలుసుకున్న రోజే నిస్వార్థంగా ఈ దేశానికి సేవ చేయడం సాధ్యమవుతుంది. సాంఘిక అసమానతలను దూరం చేసి, స్త్రీ, పురుష సమానత్వంతో పాటు దేశ ఆర్థి, సాంఘిక, ఆధ్యాత్మిక విషయాలలో పరిణతి తెచ్చుకొని, నిత్య నూతన స్వాతంత్ర్యాన్ని సమాజం పొందాలంటే ప్రతి ఒక్కరూ తపస్సు ద్వారా సాధన చేయాల్సిందే. స్పష్టమైన అవగాహనతోనూ, అంతర్లీనంగా ప్రకాశించే ఆత్మ తేజంతో పలికే ఏ మాటకైనా ఫలించే శక్తి వుంటుందని మన పెద్దలు చెబుతుంటారు. మరో వైపు దేశ క్షేమం కోసం ఆ ఫలాన్ని ధారబోయడం గొప్ప దేశ భక్తుడి శైలి. ఈ కోవలోని వారే వాసిష్ఠ గణపతి మునీంద్రులు. కావ్యకంఠులు ఎంత ఆత్మదర్శో.... అంత స్వాతంత్ర సమరయోధులు కూడా. భారత జాతి సముద్ధరణ కోసం గణపతి ముని లోలోపల ఎంతో పరితపించే వారు. అరుణాచలంలో (తిరువణ్ణామలై) లో ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన తర్వాత తరగతి గదిలోని విద్యార్థులకు వేద రహస్యాలు చెప్పేవారు. వేద రహస్యాలతో పాటు... స్వాతంత్ర్య సమరయోధుల గాథలు, బ్రిటీష్ వారు చేస్తున్న అఘాయిత్యాలను కూడా విద్యార్థులకు చెప్పేవారు. ఉపనిషత్తులు, వేదాలు, మన దేశం మూలాలు చెబుతూనే.. విద్యార్థులను స్వాతంత్ర్య ఉద్యమం కోసం తయారు చేసేవారు. అయితే.. బోధనను మాత్రం ఎక్కడా అశ్రద్ధ చేసేవారు కాదు. విద్యార్థులకు చెప్పాల్సిన సిలబస్ చెబుతూనే... దేశంలో జరుగుతున్న విషయాలపై కూడా గణపతి ముని అవగాహన కల్పించేవారు.

లౌకిక విషయాలు పట్టించుకుంటూనే... మరో వైపు కావ్య కంఠులు అరుదైన కపాల భేద సిద్ధిని కూడా పొందిన అపురూప రుషి. ఒక్క మాటలో చెప్పాల్నంటే కావ్యకంఠులు తన తపశ్శక్తిని అంతా... ఈ దేశ సంక్షేమం కోసం ధారబోశారు. ఇంత ఉపాసనా శక్తి వున్నా.. ఈ సమాజం కోసం, దేశం కోసం పరితపించిన వ్యక్తి. మన జాతి సర్వారిష్టాల నుంచి విముక్తి పొందాలని ఆకాంక్షించేవారు. కచ్చితంగా పొంది తీరుతుందని కూడా చెప్పేవారు. శిష్యుల ప్రార్థన మేరకు ఆయన ఉమాం వందేమాతరం అనే దేశభక్త మంత్రాన్ని



కూడా గణపతి మునులు ఉపదేశించి, విద్యార్థులను దేశ స్వాతంత్ర్యం కోసం సమాయత్తం చేశారు. దేశ క్షేమానికి కావ్య కంఠుల వారు తపస్సు చేశారన్న సత్యం వారి సాహిత్యంలో మనకి ప్రస్ఫుటంగా కానవస్తుంది. దేశం క్షేమం కాంక్షించి, ఉమాసహస్రం రాశారు. అందులోని శ్లోకాలు దాదాపు ఈ భరత ఖండం క్షేమాన్ని కాంక్షించి రాసినవే.

ఉదాహరణకు 2 శ్లోకాలను ఇక్కడ పరిచయం చేస్తున్నా.

**“ఆత్మీయ దేశ రక్షణే శక్తం కరోతు సర్వదా**
**పాపద్విషాం ప్రియంకరీ వాసిష్ఠ మింద్ర సుందరీ”**

(అమ్మా... వాసిష్ఠుని ఇంద్రాణీ... పాము చేయువారి శత్రువులపై ప్రియము గలదానా... నా దేశ రక్షణకై సర్వదా నన్ను శక్తివంతుణ్ణి చేయుము అంటూ గణపతి ముని ఇంద్రాణి సప్తశతీ లో అమ్మవారిని వేదుకుంటారు. )

**2. “భిన్నాం సంఘ సహస్రై: భిన్నాం శత్రుభరేణ**
**పాతుం భారత భూమిం మాతర్దేహి బలంన:”**

(ఓ ఇంద్రాణీ దేవీ... వేల కొలది సంఘాలుగా విడిపోయి, శత్రుభారంతో ఖిన్నురాలైన ఈ భారత దేశాన్ని రక్షించదానికి మాకు అత్యంత బలాన్నివ్వు)

**3. “ధ్వాంతం పరిహర్తుం తేజాంస్యపి భర్తుం**
**అంతర్మమ భూయా త్స్మేరేంద్ర పురంధ్రీ”**
**“భీతా మరిధూతా మార్యావని మేతాం**
**సమ్రాగ్ని బుధానాం దూనా మవ దీనాం”**

(చీకటిని పారద్రోలి, తేజస్సును నింపడానికి నా హృదయంలో ఇంద్రాణీ దేవి వుండు గాక. అమ్మా.. పండితులందర్నీ పాలించే నీవు ఈ ఆర్యా వర్తనం వైపు చూడు. అది శత్రువులకు ఆధీనమై... వణికిపోతూ.. దీనంగా వుంది. దానిని రక్షించు తల్లీ అని ప్రార్థిస్తారు.)

ఇలా కావ్య కంఠుల సాహిత్యంలో చాలా భాగం దేశ క్షేమాన్ని కాంక్షించిన శ్లోకాలే మనకు కనిపిస్తాయి. భారత కులాన్ని ఎప్పుడూ శుచిగా వుండేలా చూడుమని, దేశ ప్రజలందరూ ఆత్మ బలాన్ని ప్రకటించడానికీ, భారత దేశం ఉచ్చదశను పొందడానికి తల్లీ నీ పాదాలు సేవిస్తున్నానని కావ్య కంఠులు అమ్మ వారితో చెప్పుకుంటారు.

ఇంత తపశ్శక్తి వున్న కావ్యంకంఠుల వారు రాజకీయాల్లో కూడా పాల్గొన్నారు. ఇంత సంప్రదాయవాది అయిన వీరు.. స్త్రీల హక్కులు, అస్పృశ్యతకు వ్యతిరేకంగా కూడా పోరాడారు. కాకినాడ వేదికగా జరిగిన 'కాంగ్రెస్ మహాసభ సమ్మేళనం'లో పాల్గొన్నారు. ఈ సమ్మేళనానికి ఆహ్వాన సంఘ అధ్యక్షుడైన బులుసు సాంబమూర్తి గారి ప్రత్యేక ఆహ్వానంతో ఇందులో పాల్గొన్నారు. అయితే... దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేస్తున్న కాంగ్రెస్ సంస్థపై నాయనకు అభిమానం వున్నా... అది రాజకీయ మలుపులు కూడా తీసుకోవడంతో కాస్త సంశయించారు. ఆ తర్వాత 1916 లో బయ్యా నరసింహ శర్మ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కాంగ్రెసు సభలో కూడా పాల్గొన్నారు. కాకినాడలో జరిగిన కాంగ్రెసు సమ్మేళనంలో నాయన స్త్రీల హక్కుల గురించి శాస్త్రీయ ధోరణిలో మాట్లాడారు. సంస్కృతంలో, అటు తెలుగులో ద్విభాషాభినయం చేశారు. ఇక... ఆస్తిలో పురుషులతో పాటు స్త్రీలకు కూడా సమాన హక్కులు ఇవ్వాలని ఈ సభలో వాదించారు. పారమార్థిక విషయాల్లో నిర్వర్తించాల్సిన కర్మకాండ పురుషులకు ఎంత విధియో, స్త్రీలకు కూడా అంతే విధి అని, ఉపనయనం, హోమం, శ్రాద్ధం, వేదశాస్త్ర పఠనం మొదలగు విధులయందు స్త్రీలకు పురుషులతో సమానంగా హక్కులున్నాయని ఈ సభల ద్వారా నొక్కి వక్కాణించేరు. తమ తమ హక్కుల కోసం స్త్రీలు కచ్చితంగా పోరాడాలని కూడా సూచించారు. ఇంతటి గంభీరమైన, విమర్శా దృష్టితో సాగిన నాయన ఉపన్యాసాన్ని చూసి.. నేతల్లో, పండితుల్లో సంచలనం రేగింది. ఈ ఉపన్యాసం తర్వాత నాయనను కాంగ్రెస్ సమ్మేళనానికి అనుబంధంగా సాగిన సనాతన ధర్మ సభకు కూడా ఆహ్వానించారు. ఆలమూరు వేదికగా జరిగే ఈ సభల్లో అస్పృశ్యతా నివారణకు సంబంధించిన విషయాలపై శాస్త్రీయంగా మాట్లాడాలని కోరారు.

అనుకున్న ప్రకారం కావ్యకంఠులు ఆలమూరులో జరిగిన సనాతన ధర్మసభకు హాజరయ్యారు. అస్పృశ్యతా నివారణపై అనర్గళంగా ప్రసంగించారు. అయితే.. ఈయన ప్రసంగం ఛాందస పండితులకు గిట్టలేదు. స్పర్శా దోషము తురకల పట్ల, క్రిస్టియన్ల పట్ల సడలించినప్పుడు స్వమతమైన హిందూ మతంలో పంచముల విషయంలో ఎందుకు సడలించడం లేదని సూటిగా ప్రశ్నిస్తూ ఈ ఉపన్యాసం సాగింది. ఆ తర్వాత మిగతా ప్రాంతాలకు కూడా ఈ అస్పృశ్యతపై సంభాషించడానికి గణపతి మునులకు ఆహ్వానం అందింది. అయితే.. సరిగ్గా ఇదే సమయంలో 'శ్రీ కృష్ణ చయన' అనే పండితుడు వాసిష్ఠుడికి కౌంటర్ ఇవ్వడానికి పూనుకున్నారు. ఆంధ్ర పత్రిక వేదికగా... గణపతిమునుల వాదనలను ఖండిస్తూ.. వ్యాసాలు రాయడం ప్రారంభమైంది. ఇ చాలా కాలం ఆంధ్ర పత్రికలో ఈ వాద ప్రతివాదాలు సాగాయి. చివరగా... 2 నెలల తర్వాత శ్రీ కృష్ణచయన వ్యాసానికి గణపతి ముని బలమై, దీటైన విమర్శ రాశారు. ఇక.. ఆ తర్వాత శ్రీ కృష్ణచయన మళ్లీ వ్యాసం రాయలేదు. గణపతి ముని ఉపన్యాసాల శైలి, రాత శైలి చూసిన తర్వాత ఆయన్ను కాంగ్రెస్ వేదికగా జరిగే రాజకీయ వేదికపై వాడుకోవాలని చూశారు. కానీ గణపతిముని ఎక్కడా చిక్కలేదు. చివరికి... తనకు ఇష్టం లేకున్నా... 1924 లో వాసిష్ఠుడు కాంగ్రెస్ సంస్థకు సభ్యుడయ్యారు.

1924 లో తిరువణ్ణామలై వేదికగా జరిగిన ద్రవిడ రాష్ట్రీయ కాంగ్రెస్ సమ్మేళనంలో పాల్గొన్నారు. నాయన చాలా గంభీరమైన స్వాగత సంఘాధ్యక్షోపన్యాసం చేశారు. గణపతి మునుల వారి రాజకీయ ప్రసంగాలను 'హిందూ' పత్రిక ఎంతో మెచ్చుకుంది. ఆ తర్వాత గాంధీ అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ మహా సమ్మేళనానికి కూడా గణపతిమునిని తీసుకెళ్లారు. అక్కడ కూడా అస్పృశ్యతా నివారణపై గంభీర ఉపన్యాసం చేశారు. ఆ తర్వాత రాజకీయాలు నచ్చక... గణపతిముని వైదొలిగారు. చివరకు "రాష్ట్ర నిబంధన" అన్న గ్రంథాన్ని రాసి, రాజకీయ నాయకులు ఎలా మసులుకోవాలో అందులో పేర్కొన్నారు.

ఇక.. మన భాగ్యనగరంలో కూడా కావ్యకంఠులు పర్యటించారు. శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం రజతోత్సవాలకు రావాలని నిర్వాహకులు నాయనకు ఆహ్వానం పంపారు. అందుకు లేఖ కూడా రాశారు. అయితే.. నాయన తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆయన కుటుంబీకులు ఈ సమావేశాలకై భాగ్యనగరానికి రావడానికి ఒప్పుకోలేదు. ఇక్కడే ఓ ఆశ్చర్యం జరిగింది. ఒక రోజు ఓ సాధువు వచ్చి.. నాయన ఇంటి ముందు నిల్చున్నారు. కావ్యకంఠులు వున్నారా? కన్యాకుమారి నుంచి సాధువు వచ్చినారని చెప్పండి అని నాయన అల్లుడు సోమయాజులతో అన్నారు. అయితే.. ఆ సాధువుకు కాషాయ, కమండలాలు లేవు. అయినా... నాయన వీధిలోకి వచ్చి చూశారు. అప్పుడు సాధువు లేదు. చివరికి కావ్యకంఠులు తన దివ్య నేత్రంతో చూస్తే... ఆయన సాధారణ మానవుడు కాదని అర్థమైంది. ఆ సాధువు మాయమైనట్లే... కావ్యకంఠుల అనారోగ్యం కూడా మాయమైంది. దీని తర్వాత శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత భాగ్యనగరానికి చెందిన పెద్దవారు వారితో భేటీ అయ్యారు.

వీరిలో కొందరికి నాయన మంత్రోపదేశములు కూడా చేశారు. జెమ్ షెడ్ హాలులో, మహబూబు కళాశాలలో, ఆల్బర్టు రీడింగ్ రూములో, చిత్రా టాకీసులో నాయన ప్రసంగించారు. సికింద్రాబాదులో అనేక మందికి మంత్రదీక్షలిచ్చారు. మాడపాటి హనుమంతరావు, బి. రామకృష్ణ రావు, వీరభద్రరావు (ఆంధ్రభాషా నిలయం సెక్రెటరీ) వీరందరితో భేటీ అయ్యారు. ఆ తర్వాత నిజాం కళాశాలలో, రెడ్డి హొటలులో కూడా సమావేశాలు జరిగాయి.

ఇక సిటీలోనే వుండే బొల్లారంలో రావు సాహెబు వెంకటరెడ్డి, రావు సాహెబు శివశంకర అయ్యరు ఆహ్వానంతో మరో 3 ఉపన్యాసాలు ఇచ్చారు. ఇలా కొన్ని నెలల పాటు భాగ్యనగరంలోనే వుంటూ.. అటు స్వాతంత్ర్య కాంక్ష రగిలించడం, వైదిక మత లోతులు విప్పి చెప్పడం, మంత్ర దీక్షలు ఇస్తూ... నాయన ముందుకు సాగారు. ఈ క్రమంలో కావ్యకంఠులకు అనేక మంది శిష్యులయ్యారు. రాజా బహదూర్ పిళ్ళై, బాజీ కృష్ణారావు, కె. తాతాచారి, శ్యామారావు, బాజీ కృష్ణారావు, అయ్యా అయ్యరు, ప్రొఫెసర్ వీరభద్రుడు, రాయప్రోలు సుబ్బారావు వీరి శిష్యులే. ఇక...శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం రజతోత్సవాలు పూర్తైన తర్వాత, తనికెళ్ల వీరభద్రుడు గారి అధ్యక్షతన మూసీనది ప్రాంతాన ఆదిద్రావిడ సమ్మేళనం జరిగింది. ఆది ద్రావిడ నాయకుడైన భాగ్యరెడ్డి వర్మ నాయనను ఆహ్వానించారు. అయితే.. కొందరు నాయన ఉపన్యాసాన్ని బహిష్కరించాలని పిలుపునిస్తే.. భాగ్యరెడ్డి వర్మ వారందర్నీ సముదాయించి, అందరూ సమావేశానికి వచ్చేట్లు చేశారు.

ఇలా దేశంలోని చాలా ప్రాంతాలు పర్యటించిన తర్వాత కావ్యకంఠులు 1922 లో తిరిగి అరుణాచలం చేరుకున్నారు. ఉమా సహస్రాన్ని సంస్కరించే పనిలో మునిగిపోయారు. అయితే.. అంతకు ముందే వేలూరు దగ్గరే వవున్న పడైవీడు క్షేత్రంలో రేణుకా దేవిని దర్శించిన నాయన... అక్కడ తాను రాసిన ఉమా సహస్రాన్ని పఠించి, సంస్కరించాలని ప్రేరణ పొందారు. ఇలా 8 సార్లు ఉమా సహస్రాన్ని సంస్కరించారు. అయితే.. 750 శ్లోకాలనే సంస్కరించారు. చివరి 250 శ్లోకాలు భగవాన్ రమణుల ప్రత్యక్ష సాన్నిధ్యంలో పూర్తైంది. ఇలా... తల్లియైన ఉమా దేవికి తనయులిద్దరూ... (గణపతి, రమణులు) తమ వాక్కుతో అర్పించిన నీరాజనమే ఉమాసహస్రం. ఒక్క మాటలో చెప్పాలంటే రమణ, గణపతుల మధ్య జరిగిన శక్తి ప్రవాహమే ఉమా సహస్రం. ఆ శక్తి పాతాన్నే నాయన ఇంద్రాణీ సప్తశతిలోనూ ప్రవేశపెట్టారు. ఇందులో అంతా.. భారత జాతి సముద్ధరణ కోసం కావ్యకంఠులు ఎంతగా పరితపించారో స్పష్టంగా తెలిసిపోతుంది.

**"అన్నలోపక్రుశ భీరుక ప్రజాం... భిన్నభావ బలహీన నేత్రుకాం.. వాసవస్య వరవర్ణినీ పరై.. రర్ధిష్టా మవతు భారతావనిం"**

(అన్నం లేకపోవడం వల్ల కృశించి, భయభ్రాంతులై వున్న ప్రజలు

# సముద్రం నా గురువు

తనలో ఎంత బడబానలమున్నా
పైకి గంభీరంగా ఉండే తత్వాన్ని నూరిపోస్తది
ఆటుపోట్ల సునామీలు తలెత్తినట్లే
జీవితం కూడా భావోద్వేగాల సమాహారం
అనాదిగా ఏర్పరచుకున్న నదుల దారులన్నీ
సముద్రం వైపు పయనిస్తున్నట్లు
అనుబంధాల సుగంధాలన్నీ
సంసార సాగరంపై అలముకుంటాయి
సముద్రంలో ఎగసిపడే రెరటాలు ఎన్నెన్నో
కానీ పడి లేచే కెరటమనే
నా జీవన గమ్యానికి నిలువెత్తు స్ఫూర్తి
ఉప్పదనాన్ని కమ్మదనంగా మార్చే మేఘంలా
ప్రతికూలతను అనుకూలంగా మార్చే
గంభీర మనో మలయ మారుతం
కష్టాల కడలిని మథించి
అమృతసారం ఆస్వాదించే నాకు
సముద్రమే గురువు
ఎన్ని తుఫాన్లు వచ్చినా
ఎన్ని అలల సుడులు ఎదురైనా
కన్నీళ్ళ సుడిగుండాలతో
సతమతమయ్యే నాకు సముద్రం ఒక ఓదార్పు
సముద్రం ఎంత అగాధమైనది
ఎంత విశాలమైనది
ఎన్నెన్నో సిరుల గనుల్ని తనలో పదిలపరుచుకుంది
ఎన్నెన్నో వజ్రవైఢూర్యాలను తనలో భద్రపరచుకుంది
నా హృదయాంతరంగ సాగరంలో
ఎన్నెన్ని ఊహల సిరులు
మరెన్ని ఆలోచనా రత్నరాసులు
సాగరాన్ని మథిస్తే విషం, అమృతం రెండూ వెలుబడినట్లే
హృదయసాగర మథనంలో వెలువడేది
ఆవేదన, ఆనందమే కాదు
అనంత చైతన్య తత్త్వం
అనేక భావనల సమాహారం
అందుకే సముద్రం నాకు గురువు

**డా. తండు కృష్ణ కౌండిన్య**
నల్లగొండ, ఫోన్ : 9704731346

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 10 (32) హైదరాబాద్ ఆగస్టు : 2022

# కల్లోల కూడలి

ఎవరికోసం...?!
ఒంటరిగా తిరిగే కాలచక్రం
ఏకాంతానికి పురిగొలిపే సంగీతం
నిశ్శబ్దాన్ని మోసుకొచ్చే ఈదురుగాలి
అడియాశల సంధ్యాసమయం
అశుభపు తీతువు రాగం
అచేతనాన్ని ఆవాహన చేసుకున్న చేష్టలు
అవేవో ఊహాగానాలు
భయంగొలిపే సందిగ్ధ సమయాలు
అయత్నంగా గుర్తుకొచ్చే జ్ఞాపకాలు
ఇంకా మిగిలిపోయిన మాటలు
వ్యక్తంగాని ఏవో భావోద్వేగాలు
తనను వెతకసాగాయి...!

ఏకాంతం చూపించిన జ్ఞానం
ఒంటరితనం నేర్పిన అనుభవం
బంధాలు పరిచయం చేసిన భయం
మిత్రులు రుచి చూపించిన ద్రోహం
అజ్ఞాతపు అర్థాన్ని చెప్పించిన శత్రువు
గతం నేర్పించిన అబద్ధం
రాత్రి బయల్పెట్టిన రహస్యం
కూడలి కల్పించిన అయోమయం
భవిష్యత్తు హెచ్చరించే సందిగ్ధం
ఇంకెప్పుడు కనిపించని
తనను వెతకసాగాయి...!!



**డా. వడ్డాపురం కృష్ణ**
ఫోన్ : 96666 02670

భిన్న భావంతో దుర్భరులైన నాయకులూ వున్న ఈ భారత భూమిని పీడిస్తూ వున్న శత్రువుల నుంచి ఆ ఇంద్రాణీ దేవి రక్షించు గాక...)

**"భారత భూమేః శుచమపహతుం శ్రేష్ఠముపాయం పునరవగంతుం..**
**వాసవజాయే దిశ మమబుద్ధిం పావని మాయే కురుకురు సిద్ధిం..."**

(ఓ మాయా రూపిణీ... శచీదేవీ... ఈ భారత భూమి దుఃఖాన్ని తొలగించడానికి ఏదైనా శ్రేష్ఠమైన ఉపాయాన్ని తిరిగి.. (వేదాల్లోంచి) కనుగొనడానికి నాకు శక్తినివ్వు...)

**"ప్రచండచండీ ప్రమదే పురాణే పురాణ వీరస్య మనోధినాథు**
**ప్రయచ్ఛ పాతుం పటుతాంపరాం మే పుణ్యామిమా మార్యనివాస భూమిం"**


(ఓ ప్రచండ చండీ.. నీవు ఈ పుణ్య భూమియైన భారత దేశాన్ని రక్షించడానికి నాకు ఎక్కువ పటుత్వాన్ని ఇచ్చెదవు గాక)

ధర్మ సంస్థాపనకు, సంప్రదాయ రక్షణకు ఋషి సూత్రధారి. ఆర్యులు అటువంటి ‘షికుల సంతతికి చెందిన వారు. కళంకితమవుతున్న వేదానికి మరల ఉత్తేజం కలిగించాలని ఉద్యమించిన రుషి పరంపరలో కడపటి వారు వాసిష్ఠులు. వారి జన్మ వెనుక దేవ రహస్యం దాగి వుంది. ఈ లోకంలో జరగాల్సిన సంస్కారం వివిధ రంగాలకు చెంది వుండటం వల్ల దేవుడు మహా పురుషులను అవతరింపజేస్తూ వున్నారు. ఇప్పటికీ ఇది కొనసాగుతోంది. సద్గురు శివానంద మూర్తి గారి వరకూ నడుస్తోంది. అలా అవతరించిన వారిలో గణపతి ముని ఒకరు. దేశంలో అనిశ్చితి, అల్లకల్లోల పరిస్థితులు, అశాంతి, అరాచకాల నుంచి దేశాన్ని రక్షించమని అమ్మవారిని వేడిన గణపతిముని రాసిన ఇంద్రాణీ సప్తశతిని దేశ క్షేమం కోసం భారతీయులందరూ రోజూ పఠించాల్సిన అవసరం వుంది. కేవలం మన దేశంలోనే సుఖ సంతోషాలు నెలకొనడం కాకుండా... మన మన కుటుంబాల్లో కూడా అందరూ ఆరోగ్యంగా, ఆనందంగా వుండాలని కూడా పఠించాలి.

**"జయతు భరత క్షోణీ ఖణ్డం విషాద వివర్జితమ్**
**జయతు గణపస్తస్య క్షేమం విధాతు మనాముని:**
**జయంతు రమణస్తస్యాచార్యో మహర్షి కులాచలో**
**జయతు తయోర్మాతా పూతా మహేశ విలాసినీ"**

భారత ఖండము దుఃఖశూన్యమై వెలయు గాక. ఆ భారత ఖండమునకు క్షేమము కోరే గణపతి ముని వెలయుగాక. ఆ గణపతి మునికి ఆచార్యుడు ఆ రమణులు వెలయుగాక. ఆ గణపతి రమణులకు మాతయు, పూతయు అయిన.. మహేశ్వర కుటుంబిని వెలయుగాక....

**(దేశంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవాల సందర్భంగా...)**



ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 10 (33) హైదరాబాద్ ఆగస్టు : 2022

గ్రంథాంతరంగం
15

# శ్రీ ఆంధ్ర రత్న ద్యుతులు

**శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు,** ఫోన్ : 9964082076

సుప్రసిద్ధ తెలుగు పరిశోధకులు, సువిఖ్యాత ఆంగ్ల పాత్రికేయులైన కుందూరి ఈశ్వరదత్తు గారొకసారి కట్టమంచి రామలింగారెడ్డి గారికో ఇంగ్లీషులో వుత్తరం రాస్తూ "మీరు అనుమతిస్తే నేను మీ జీవిత చరిత్ర రాయడానికి పూనుకొంటాను." అని అన్నారట. "మీరు నా మరణానంతరం రాయడానికి నాకెలాంటి అభ్యంతర ముండదు. జీవిత చరిత్రలో వాస్తవిక విషయాలు పటిష్టమైన రీతిలో చరిత్ర రచనలా పకడ్బందిగా వుండాలి సుమా!" అని సూచించారట. కుందూరి ఈశ్వరదత్తు గారు "మై పోర్ట్రెయిట్ గ్యాలరీ' అనే పుస్తకంలో రెడ్డిగారు ఆయనకు రాసిన ఇంగ్లీషు ఉత్తరాలు ఉటంకిస్తూ పై మాటలన్నారు.

రాష్ట్రాభివృద్ధికీ, దేశప్రగతికీ, విశ్వమానవ కల్యాణానికీ తోడ్పడే ఘనకార్యాల్ని సాధించిన మహనీయుల జీవితాల వివిధ దశల్ని కాలక్రమంగా వెల్లడించే గద్య రచనల్ని జీవిత చరిత్రలుగా భావించవచ్చు. ఈ జీవిత చరిత్రల కేంద్ర వ్యక్తులు స్త్రీలైనా కావొచ్చు, పురుషులైనా కావొచ్చు. నిరుపేదలైనా, నిరక్షరాస్యులైనా, కోటీశ్వరులైనా, కొండగుట్టల్లో నివసించే గిరిజనులైనా కావొచ్చు. ఆ వ్యక్తుల జీవితాలు వాళ్ల కుటుంబాలకే పరిమితం కాక, విశాల సముదాయాలకు కూడా దారి దీపాలుగా నిలిస్తే చాలు. అదే పదివేలు.

జీవిత చరిత్రకారులు మూడు రకాలుగా వుంటారు. కేంద్ర వ్యక్తులతో సన్నిహితంగా వుండి, వాళ్ల ఆశయ లక్ష్యాలతో మమేకమై మెలిగినవాళ్లు మొదటి రకం, గ్రంథానికి మూలమైన వ్యక్తుల ప్రత్యక్ష పరిచయం లేకున్నా, వివిధ పత్రికల, పుస్తకాల, మిత్ర బంధువుల సంప్రతింపుల ద్వారా విషయాన్ని సేకరించి జీవితచరిత్రలు రాసేవాళ్ళు రెండవరకం. ఇక మూడవ రకం వాళ్లంటారా? కోట్లకు పడగ లెత్తిన వ్యాపార వేత్తల, పారిశ్రామిక వేత్తల, రాజకీయ నాయకుల, సినిమా కళాకారుల, క్రీడాకారుల ద్వారానో లేక పుస్తక ప్రచురణల నుంచో పెద్దపెద్ద ముడుపులు తీసుకొని, వాళ్ల జీవిత కథల్ని చాట భారతంగా వెలువరించే వారే ఈ తృతీయ శ్రేణి రచయితలు! ఈ రకం జీవిత చరిత్రలు ఒక్కొక్కప్పుడు లక్షలాది ప్రతులు అమ్ముడు పోయినా, ప్రసార మాధ్యమాలు గోరంతలు కొండంతలుగా చాటి చెప్పినా అవి క్షణకాలం పాటు మెరిసి మాయమయ్యేవే సుమా!


జీవిత చరిత్రకు కేంద్ర బిందువైన వ్యక్తితో సన్నిహిత సంబంధం వున్న వ్యక్తి అతని జీవయాత్రను వివరిస్తే ఆ గ్రంథంలో వాస్తవికత ఎక్కువగా వుంటుంది. ఆత్మీయత అధికంగా వ్యక్తమవుతుంది. పక్షపాత దృక్పథం వెలువడే అవకాశం కూడా వుంటుంది. పైగా జీవిత చరిత్ర రచనాకారుడి, వ్యక్తిత్వ విశేషాలు కూడా బహిర్గతమవుతాయి.

మనమిప్పుడు తెలుసుకొనబోయే గ్రంథం పేరు 'శ్రీ ఆంధ్రరత్న ద్యుతులు' జాతీయోద్యమ నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడైన దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జీవిత కథ ఇది. మరి ఈ పుస్తకం రాసినవారంటారా కథా నాయకుని ప్రియమిత్రులైన భావకవి శేఖరులు బసవరాజు అప్పారావుగారు. యాదృచ్ఛికమైన సంగతేమిటంటే అటు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య (1889 మే 26 –1928 జూన్) ఇటు బసవరాజు అప్పారావు (13.12.1894 – 10.6.1933) ఈ ఇద్దరు మిత్రులూ నలబైఏళ్లు నిండక ముందే మరణించడం.

బసవరాజు అప్పారావు 'ఆంధ్రరత్న' దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జీవిత చరిత్రను 1921వరకు మాత్రమే రచించి, తమ ఇతర అముద్రిత రచనల్ని కూడా అమలాపురం



'ఆంధ్రరత్న' దుగ్గిరాల గోపాలకృష్ణయ్య



శ్రీ ఆంధ్రరత్న ద్యుతులు
(ఆంధ్రరత్న గోపాలకృష్ణుని జీవితం)
రచయిత:
కీ॥ శే॥ బసవరాజు అప్పారావు

వాస్తవ్యులు, 'గోష్ఠి' పత్రికా సంపాదకులైన గుమ్మడిదల వెంకట సుబ్బారావుగారికి అప్పగించారు. ఆయన గోపాలకృష్ణయ్యగారి జీవిత చరిత్రలోని కొన్ని ప్రకరణాల్ని 1936లో 'గోష్ఠి' పత్రికలో ప్రకటించారు. మరో విచిత్రమేమంటే ఈ పుస్తకం కథా నాయకుడు, జీవిత చరిత్ర రచయితలు ఈ ఇద్దరూ చనిపోయిన తర్వాతే వెలుగులోకి వచ్చింది.

'శ్రీ ఆంధ్రరత్న ద్యుతులు' (ఆంధ్రరత్న గోపాలకృష్ణుని జీవితం) మొదట కొన్ని ప్రకరణాలుగా మాత్రమే ప్రచురింపబడితే

విజయవాడలోని ఉదయ భాస్కర్ పబ్లిషర్సు వారు 1963లో తొలిసారిగా పుస్తకరూపంలో అచ్చువేశారు. 'శ్రీ ఆంధ్రరత్న ద్యుతులు' మంచి పుస్తకమే అయినా ప్రచురణ సంస్థ ప్రసిద్ధమైనది కాకపోవడం వల్లా, వితరణ సౌకర్యం కొరవడి నందువల్లా, విశాల పాఠక వర్గానికి చేరలేక పోయింది. ఆంధ్రరత్న కాంతులు పరిమిత పాఠక లోకానికి మాత్రమే అందుబాటులోకి రావడం దురదృష్టకరం. 147 పేజీల ఈ పుస్తకానికి 'తొలినుడి' రాసిన గుమ్మిడిదల వెంకట సుబ్బారావు లోగడ గుమ్మిడిదల దుర్గాబాయమ్మ జీవిత చరిత్రను రాసిన మహోదయులే.

'శ్రీ ఆంధ్రరత్న ద్యుతులు' గ్రంథకర్త 'పీఠిక'లో రాసిన విలువైన మాటలిలా వున్నాయి– "అట్టులనే చిరమిత్రుడును నతి పరిచితుడును నగు శ్రీ గోపాలకృష్ణుడు నా కన్నుల కనుక్షణము క్రొత్త పురుషునివలె గన్పట్టుచున్నాడు. అందుచేత నతని జీవితచరిత్ర వ్రాయుటలో అపరిచితుడును నరమ్యుడుననగు నూతన పురుషుని జీవిత చరిత్ర వ్రాయుట పట్ల నెట్టి జాగరూకత నవలంబింపవలెనో యెట్టి కష్టముల నెల్ల దాటి కృతకృత్యుడుగా ప్రయత్నించెదను. చిరతరాబాల్య ప్రవర్ధిత స్నేహలతాబద్ధుడనగు నేను మిత్రవాత్సల్యముచే నేమి, రాగ ప్రమాదముచే నేమి యొక్కొక్కప్పుడు గుణగణ వర్ణమున నతిశయోక్తుల పొంత బోవుదునేమో? అంతియగాక పరులకు దోషప్రాయములుగ గన్పడు నీతిని గుణముల గొన్నింటిని భ్రాతృభావముచే సమర్థింపజూచుట పట్ల తలవని తలంపుగ నెవ్వరికే నపచారము గావించుదునేమో యను శంకయు బాధింపుచున్నది. రంధ్రాన్వేషణ ప్రజ్ఞ నితరులకు వదిలివైచి ప్రస్తుతాంధ్ర వీరులలో నెల్ల సాహసియు చిత్ర విచిత్ర పురుషుడునగు మన కథానాయకుని గుణములను మాత్రమే గురు భావముతో వర్ణించి సమ్మదిత హృదయుడ నయ్యెదను." (పేజీ: i,ii)

గ్రంథకర్త బసవరాజు అప్పారావు గారి పై వాక్యాల్ని జాగ్రత్తగా పరిశీలిస్తే ఆయన కథానాయకుడైన దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి జీవితంలోని మజిలీల్ని కొంచెం అతి రంజకంగా వర్ణించారేమో అన్న సందేహం కలుగుతుంది. పైగా గ్రంథ రచయిత నిష్పక్షపాత దృష్టితో, తాటస్థ్యం వహించలేక పోయారన్న భావమూ పొడముతుంది. 'అతి సర్వత్ర వర్జ్యతే' అన్న ఆర్యోక్తి మనమిక్కడ స్మరించుకోవాల్సి వస్తుంది.

'శ్రీ ఆంధ్రరత్న ద్యుతులు' పుస్తకంలో ఆరు ప్రకరణాలున్నాయి. గ్రంథకర్త బసవరాజు అప్పారావు మొదటి ప్రకరణంలో భారతదేశాన్ని మహమ్మదీయులు, ఆంగ్లేయులు స్వాధీనం చేసుకొన్న చరిత్రను, లాల్ బాల్ పాల్ (లాలా లాజ్‌పత్‌రాయ్, బాల గంగాధర తిలక్, బిపిన్ చంద్ర పాల్) గాంధీజీ మొదలైన జాతీయ నాయకులు స్వాతంత్ర్య పోరాటం సాగిస్తున్న నేపథ్యాన్ని వివరించారు.

రెండో ప్రకరణంలో రచయిత గోపాలకృష్ణయ్య బాల్యాన్ని, చదువు సంధ్యల్ని ప్రస్తావించారు. ఆయన దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారిని మొట్టమొదటిసారిగా 1909లో మచిలీపట్నంలో చూశారు. ఆ అవిస్మరణీయ దృశ్యాన్ని బసవరాజు అప్పారావుగారిలా చిత్రించారు."సాయన్తనపు వేళ మత్స్యపుర (బందరు) కళాశాలా పరిసరోద్యానమున సైకతస్థలమున సాహిత్య విదులును, రసిక శిఖా మణులును, గానరసాస్వాదనా పరులుననగు ననేకులగు మిత్రసత్తములతో గూడ విద్వద్గోష్ఠి యందును, మనోహర గానాలాపమునందును ప్రొద్దు పుచ్చుచుండగా బ్రప్రథమమున మన కథానాయకుడగు గోపాలకృష్ణుని గాంచగల్గితిని. నాటినుండి నేటివఱకును మా ఇరువురకును స్నేహమును, అనురాగమును బెరిగి పెంపొందిన కతమున నాతడు గురుప్రాయుడై ప్రేమపాత్రుడైనాడు. ఏనాడు అతని స్నేహ సంపద నాకు గైవసమయ్యెనో ఆనాడే నిజమగు మిత్రసత్తముడు దొరికినాడను భావము నా మనస్సున బ్రబలసాగెను. ఆ కారణమున నేనతని పరిచయము నెక్కువగ సంపాదించి యతని జీవితమున గల విశేషములలో బ్రధానములయిన వానిని గ్రహింపగల్గితిని" (పేజీ: 21)

దుగ్గిరాల గోపాలకృష్ణయ్యతో బసవరాజు అప్పారావుకు కలిగిన ఈ అనుబంధం ఎంతో ఆత్మీయంగా పరిణమించింది. జీవన పర్యంతం పెనవేసుకుంది. గ్రంథకర్త ఈ ప్రకరణంలో గోపాలకృష్ణయ్య చదువుసంధ్యల గురించి వివరంగా రాసి, ఆయన ఉన్నత విద్యాభ్యాసం కోసం బ్రిటనులోని ఎడింబరోలోని కళాశాలలో, ఆక్సుఫర్డ్ విశ్వవిద్యాలయం నుంచి అర్థశాస్త్రము, రాజనీతి శాస్త్రము, వేదాంత వ్యవసాయ శాస్త్రాల్లో యం.ఏ.,డిగ్రీ పొందారు. అంతే కాదు ఆయన ఎడింబరో కళాశాలలోని భారతీయ విద్యార్థి సంఘానికి కార్యదర్శిగా పని చేసి, తోటి విద్యార్థుల ప్రేమాదరాలు పొందారు కూడా. గోపాల కృష్ణయ్యగారి ఆంగ్ల భాషా పాటవం, ఉపన్యాస కౌశలం, వాక్చాతుర్యం, గానకళా ప్రావీణ్యం అక్కడి భారతీయ విద్యార్థుల్నే కాదు, పాశ్చాత్య విద్యార్థుల్ని కూడా సమ్మోహితుల్ని చేశాయి. భారతీయ శిల్ప, చిత్రకళా కోవిదులైన ఆనంద కుమారస్వామి గారికి అచ్చుమెచ్చు శిష్యులయ్యారు.

స్వదేశీయాభిమాని దుగ్గిరాల గోపాలకృష్ణయ్య తిరిగివచ్చి తన కత్యంత ప్రీతిపాత్రమైన ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించారు. రాజమండ్రి లోని ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా కళాశాలలో చరిత్ర, సాహిత్యాన్ని బోధించి విద్యార్థులకు ఆత్మీయ స్నేహితులుగా, తత్త్వవేత్తగా, మార్గదర్శిగా పేరు పొందారు. ఆ కళాశాల వార్షికోత్సవ సభకు కళాశాల ప్రిన్సిపాలు అధ్యక్షత వహించడం ఆనవాయితీ కాని ఆ యేడు (1917–18) విద్యార్థి లోకం గోపాల కృష్ణయ్యగారినే అధ్యక్షస్థానం అలంకరించేలా ఎన్నుకొంది. ఆ కళాశాల ఆంగ్లోపన్యాసకుల్ని, ప్రిన్సిపాలుగారిని అది కన్నెర్ర చేసింది. గోపాలకృష్ణయ్య భారతదేశచరిత్రను ఆంగ్లచరిత్ర కారుల దృష్టితో

కాకుండా ప్రాచీన భారతీయ రుషి పరంపర దృక్పథంతో బోధించి, విద్యార్థుల్లో జాతీయ చైతన్యాన్ని కలిగించారు. పైగా మచిలీపట్టణంలో జరిగిన విద్యార్థి మహాసభకు అధ్యక్షత వహించే అపూర్వ గౌరవం గడించడం ఆంగ్లేయాధికారులకు గుండెలో ముల్లయి కుచ్చుకొంది. కళాశాల, బ్రిటిషు ప్రభుత్వాధికారుల ఆంక్షలు భరించలేక ఉద్యోగానికి రాజీనామా చేశారు. దుగ్గిరాలవారు బందరులోని జాతీయ కళాశాలలో ఉపాధ్యాయునిగా ప్రవేశించారు. కాని కళాశాల అధికారులకు ఈయన బోధించే పాఠప్రవచనాల వైఖరి నచ్చలేదు. కాని "శాంత చిత్తుడై, వశీకృత నిజమానసుడై, సర్వస్వతంత్రుడుగ, నిజ సామ్రాజ్యాధిపత్యమును ననుభవింప కుతూహలమును, నాశయును" (పేజి:40) కలిగిన గోపాలకృష్ణయ్య ఈ ఉద్యోగానికి కూడా రాజీనామా చేసి చీరాల చేరారు. మూడవ ప్రకరణంలోని సారాంశమిది.

నాలుగవ ప్రకరణంలో కథానాయకుడు అనుభవించిన ఆర్థిక సంక్షోభం, మిత్రుల సమర్థన లేక పోవడం, పత్రికల పోట్లు చక్కగా, శక్తిమంతంగా వివరింపబడ్డాయి. గోపాలకృష్ణయ్య అప్పటి మనఃస్థితిని గ్రంథకర్త ఇలా వర్ణించారు. "ఆ కారణమున ద్రవ్య హీనుడౌటజేసి, విరథుడును బోలె, తోడివారల సాయము లేమింజేసి, యసహాయ యోధుని వలె బోరవలసిన వాడయ్యెను. పెద్దలమని తలంచికొన్న వారెల్లను నతడనిన గొంచెమెడమొగము, పెడమొగముగా దిరుగుచుండిరి. సత్యాన్వేషణమే ప్రధానముగా ననుష్ఠింప వలసిన పత్రికలు సయితమతడు పంపు వార్తలను, అతని అభిప్రాయము విశదీకరించు వ్యాసములను బ్రకటింపక పక్షపాతము మతింత కారణములయ్యెను." (పేజి: 44). రచయిత దుగ్గిరాలవారి వ్యక్తిత్వాన్ని చాలా దగ్గరగా నుండి గమనించిన కారణంగా అతని హృదయావిష్కరణ ఇలా చేశారు. "కాని రోష వేషములే ప్రధానముగా గలవాడును, నిర్భీత హృదయుడునునగు గోపాలకృష్ణుడు ప్రతికూల వాదుల వాదములకును బహిష్కారములకును 'సుంతయేని' యువంత నొందక, భయపడక, నిజ మనోభిప్సితసిద్ధికై నిరంతరాలోచనా నిమగ్నమానసుడై, సంక్షుభిత హృదయుడయ్యు, నాశాకిరణసాహాయ్యమున నిజమనోర్గథపథము ననుగమించి పోవుచుండెను." (పేజి:45)

గోపాలకృష్ణయ్య విదేశీ విద్యా విధానానికి వ్యతిరేకమైన, సహజ స్వాభావిక భారతీయ విద్యాప్రణాళిక గురించి 1919 మద్రాసులోనూ, ఒరిస్సాలోనూ, ఆంధ్రలోని మరికొన్ని ప్రాంతాల్లోనూ జాతీయోద్యమం గురించి, భారతీయ సంస్కృతి గురించి భావోత్తేజకరమైన ఉపన్యాసాలు చేశారు. కర్నూలు జిల్లా మహానందిలో 1920 మే, జూన్‌లలో జరిగిన ఆంధ్ర మహాసభలో గోపాలకృష్ణయ్య చేసిన ప్రసంగ ప్రభావం గురించి గ్రంథకర్త ఇలా రాస్తారు.

"సభికులెల్లరకును హాస్యభరితంబును, చమత్కార విలసితంబును, భారత సాంప్రదాయ విజ్ఞానైక బంధురంబునగు గోపాల కృష్ణుని వాగ్ధోరణి శ్రవణప్రేయమై, హృదయానందకరమై, పవిత్రోద్వేక జనకమై మహత్కార్య ప్రోత్సాహకమై యొప్పుకతన నెల్లరకును గోపాలకృష్ణుడు ప్రేమపాత్రుడును, గౌరవపాత్రుడును నయ్యెను. (పేజి: 53–54) దుగ్గిరాలవారు ఆనాటి ప్రముఖ విద్యావేత్తలైన సర్వేపల్లి రాధాకృష్ణయ్య, కోపల్లె హనుమంతరావు, జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి, అల్లాడి కుప్పుస్వామయ్య, యస్. శ్రీనివాసయ్యంగారు ప్రభృతులలో సంప్రతింపులు చేసి పటిష్ఠమైన, భారత సంస్కృతీ ప్రకాశకమైన విద్యాప్రణాళిక తయారు చేసి, గుంటూరు జిల్లా, చీరాల సమీపంలో రామనగర్‌ను స్థాపించి 'ఆంధ్ర విద్యాపీఠ గోష్ఠి' అనే పేరుతో గురుకుల విద్యాసంస్థను ఏర్పరచారు. అంతేకాక ప్రభుత్వాధికారులు పన్నులు వసూలు చేసేటప్పుడు ప్రజల్ని



బసవరాజు అప్పారావు

పలురకాలుగా హింసించడం, పేద పిల్లలకు విద్యా సౌకర్యం లేకపోవడం మొదలైన సమస్యల్ని పరిష్కరించేందుకై 'రామదండు' అనే పేరుతో దేశ భక్తులైన, స్వార్థ రహితులైన యువకుల్ని 'రక్తచందనాలిప్త సైన్యా'న్ని (రెడ్ ఆర్మీ)ని సిద్ధపరచారు. ఈ రామదండు ప్రజల వ్యాజ్యాల్ని పంచాయతీల ద్వారా పరిష్కరిస్తూ, సప్త వ్యసనాలకు లోనైన వాళ్లపై కులకట్టులు విధిస్తూ, వాళ్లను సన్మార్గులుగా చేయసాగింది. బెజవాడలో 1921 మార్చి 31 ప్రాంతంలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభలో ఆంధ్రరత్న సుమారు ఐదారువేలమంది రామదండు స్వయం సేవకులతో పాల్గొని గాంధీజీ మెప్పులు పొందారు. బాపూజీ ఏప్రిలు 6వ తేదీన చీరాల దర్శించారు. చీరాల, పేరాల ప్రజల ధైర్యసాహసాల్ని మెచ్చుకొని, సహాయ నిరాకరణోద్యమంలో తీవ్రంగా పాల్గొనమని ప్రబోధించారు. గోపాలకృష్ణయ్య నాయకత్వంలో జరిగిన చీరాల–పేరాల సత్యాగ్రహాన్ని గాంధీజీ 'యంగ్ ఇండియా' పత్రికలో వేనోళ్ల పొగిడారు. ఆయన ప్రజాసేవను ప్రశంసిస్తూ గుంటూరు

జిల్లా పొన్నూరులో, జరిగిన జిల్లా సమావేశంలో ఆయన్ను 'ఆంధ్రరత్న' బిరుదంతో ఘనంగా సన్మానించారు ప్రజలు.

బెజవాడలో జూలై నెలలో జరిగిన కృష్ణా పుష్కరాల సందర్భంగా ఏర్పాటైన కాంగ్రెసు మహాసభలో 'ఆంధ్రరత్న' దండనీతి, దౌర్జన్యం' అనే విషయంపై శాంతియుత పోరాటం ద్వారానే భారతదేశానికి స్వాతంత్ర్యం సంపాదించాలని ఉద్బోధించారు. ఆయన ఉత్కళలోని బరంపురంలో దేశ స్వాతంత్ర్యం కోసమై ప్రజలు శాంతిపూర్వకంగా ప్రాణాలకు లెక్క చేయకుండా పోరాడాలని ఉపన్యసించారు. గోపాల కృష్ణయ్య చెన్నపట్టణం నుండి తిరుచునాపల్లికి బయలుదేరే ముందు చిరునవ్వు నవ్వుతూ, ఛలోక్తులు విసరుతూ, జైలుకు వెళ్లుతున్నాననే భయం పెసరంత కూడా లేకుండా కనపడ్డారని ఆంధ్రపత్రిక (14-10-1921) విలేఖరి పేర్కొన్నారు. ఆయన తిరుచినాపల్లి జైలు పరిస్థితుల గురించి ఇలావ్యాఖ్యానించారు.

".....భూతలమున నెట్టి నరకావాసమున్నదని తామెన్నడును దలచియుండలేదనియు, నయ్యది యొక శ్మశానవాటిక వలె నున్నదనియు నతడు మాకు జెప్పెను." (పేజి: 129) దుగ్గిరాల గోపాలకృష్ణయ్య శ్రీకృష్ణజన్మస్థానానికి నిర్భయుడై, నిశ్చింతతో, స్వరాజ్యసిద్ధి ఆశిస్తూ వెళ్లడంతో ఐదవ ప్రకరణం ముగిసింది.

ఆరవ ప్రకరణమైన 'ఉప సంహారము' లో గోపాలకృష్ణయ్య గారి దైవభక్తి, జ్ఞానపిపాస, సంగీత ప్రావీణ్యం, ప్రజా సేవాదృక్పథం, నిస్వార్థత, ఉపన్యాస కౌశలం, ధైర్యసాహసాలు ప్రశంసింపబడ్డాయి. గ్రంథకర్త బసవరాజు అప్పారావు తన ప్రియ మిత్రులైన ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య వ్యక్తిత్వంలోని కాంతుల్ని ఎంతో ఆత్మీయంగా వర్ణించారు.

'శ్రీ ఆంధ్రరత్న ద్యుతులు' దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జీవిత చరిత్ర కంటే జీవిత కథగా రూపొందిందనడం సూక్తం. గోపాలకృష్ణయ్య భార్య, పిల్లల ప్రస్తావనే లేదు. ఆయన ఆలోచనామృతాన్ని, హాస్య, వ్యంగ్య చమత్కారాన్ని వ్యక్తం చేసే చాటుపద్యాల్ని మనమీ పుస్తకంలో చూడలేకపోవడం దురదృష్టకరమే! విశ్వవిఖ్యాత భారతీయ సాహిత్య, సంస్కృతుల వ్యాఖ్యాత డా. ఆనంద కుమారస్వామితో కలిసి చేసిన నందికేశుని 'అభినయ దర్పణ' సంస్కృత కృతికి చేసిన ఆంగ్లానువాదం, వారిద్దరి మధ్య జరిగిన ఆంగ్ల లేఖల ప్రస్తావన లేకపోవడం కొరతే. అయినా బసవరాజు అప్పారావుగారు 'తాజమహల్' కవితలో చెప్పినట్లుగా ఈ పుస్తకం "కామితమిచ్చే మామిడి పండూ కవులకు మిగిలింది'.

## మంచి మనుష్యుడు...!

**(మణిపూసలు)**

పరులకోసం పాటుపడు
తరుల పెంపుకు తపనపడు
చేయకెన్నడిలను హాని..
మాటకెప్పు డిల నిలబడు..!

కలసిమెలసి మెలుగుచుండు
అలసి పోకను కష్టపడు
తరతమ భేదం లేకను
నిరతము జనసేవనుండు..!

మానవతయె అతని మతము
జనహితమే తనకుసతము
కాంక్షించే మహా మనిషి...
రక్షించె గుణమున్నపథము..!


సద్గుణమున్నసచ్ఛీలత
సద్భావమున్నట్టినడత
మానవీయ మనసునందు
సడలనట్టి సమత మమత..!

అలుపెరుగని ఆత్మీయుడు
కల్మషాలు లేని హితుడు
శాంతి కోరు భావమున్న
సద్బుద్ధికి నీతిపరుడు..!

నిజాయితీకి పట్టుకొమ్మ
సౌశీల్యతకు పసిడిరెమ్మ
బాధ కడగండ్లను తుడిచే
ఇల వెలసిన మరో బ్రహ్మ..!

ఆపదలో ఆత్మబంధు
సేవలిచ్చు సదాసింధు
అందరిలో అనునిత్యము
బంధానికి చూపుముందు..!





డా. గన్నోజు శ్రీనివాసాచారి
మహబూబ్ నగర్
ఫోన్ : 8555 899 493

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 10  హైదరాబాద్ ఆగస్టు : 2022


# నిత్య సాహితీ వసంతుడు 'నిత్యానందుడు'

**డా. టి. శ్రీరంగస్వామి,** ప్రముఖ సాహితీవేత్త, ఫోన్ : 9949857955

1980వ దశకం మలినాళ్ళలోననుకుంటాను వెలుదండ నిత్యానందరావు గారితో పరిచయం ఏర్పడింది. అది క్రమక్రమంగా మూడు దశాబ్దాలుగా ముప్పిరులు అయి స్నేహబంధం సాగిపోతుంది. ఆయన హనుమకొండకు వస్తే తప్పకుండా నాకు ఫోన్ చేయడం, మేమిరువురం కలుసుకోవడం, కబుర్లు చెప్పుకోవడం సాధారణాంశం. ఆయన హాస్యరసంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టాను అందుకున్నవారు. అందువలననే కాబోలు ఆయన సరససంభాషణతో అలరిస్తారనిపిస్తుంది. వెలుదండ వారు వారి స్వగ్రామం మంగనూరులో హైస్కూలు విద్యను పూర్తి చేసుకొని, పాలెం ప్రాచ్య కళాశాలలో డిగ్రీని అందుకుని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో స్నాతకోత్తర పట్టాను, ఎం.ఫిల్, డాక్టరేట్ పట్టాలను పొందారు. వీరి సోదరులందరూ విద్యాధికులే. వారు కేవలం పట్టాలకే పరిమితం అవ్వకుండా సరస్వతీ కటాక్షాన్ని పొంది నిరంతరం అమ్మవారికి అక్షరార్చన చేస్తూ సంస్కార పరీమళాలను వెదజల్లుతున్నారు.












1987లో వివిధ విశ్వవిద్యాలయాలలో తెలుగు భాషా సాహిత్యాల మీద జరిగిన పరిశోధనలను, పరిశోధకులను ఏకీకృతం చేసి ఆయా అంశాలను తెలుసుకుని ముందు తరాలవారు తమ పరిశోధనకు ఉపయుక్తంగా ఉండేలా "విశ్వవిద్యాలయాలలో తెలుగు పరిశోధన" చక్కని ఆకరగ్రంథాన్ని (Reference book) అందించారు. మరొకసారి 2013లో పరివర్ధిత గ్రంథంగా ప్రచురించారు. ఈ గ్రంథం వలన విశ్వనాథ గారిపై వచ్చినన్ని పరిశోధనలు ఎవరి సాహిత్యంపై రాలేదనీ, ఎన్నెన్ని భిన్నభిన్న అంశాలపై మూల్యాంకనాలు జరిగాయో తెలుస్తుంది.


ఎం. ఫిల్ కోసం తొలి వికట ప్రబంధము– చంద్రరేఖా విలాపమును ఎంచుకుని నిత్యానందరావుగారు పరిశోధన చేసి పట్టాను అందుకున్నారు. హాస్యంలో వికటం కూడా ఒక అంశం. ఇది పునాదిగా డాక్టరేట్ కోసం 'తెలుగు సాహిత్యంలో పేరడీ' అంశంతో 1994లో పట్టా అందుకున్నారు. కేవలం డాక్టరేట్ పట్టాతో సరి పుచ్చుకోకుండా ఆయన పరిశోధనకు అనుబంధంగానో, పొడిగింపుగానో తాను రాసిన హాస్య విశ్లేషణాత్మకమైన వ్యాసాలను 'హాస విలాసం' పేరుతో వెలువరించారు. ఈ వ్యాసంగంతో పాటుగా అనేక పత్రికలలో సిద్ధాంత గ్రంథాల పరిచయం, విశ్లేషణలు, సమీక్షలు ధారావాహికంగా వెలువరిస్తూనే వస్తున్నారు. ఆయన నిరంతర పరిశీలనకు, గ్రంథావలోకనానికి తాను వెలువరించిన వ్యాసాలు, గ్రంథాలు సాక్షీభూతంగా నిలుస్తాయి. ఇవి అన్నీ నిత్య వైవిధ్యం, (2007), నిత్యానుశీలనం (2010), నిత్యాన్వేషణం (2018) అనే వ్యాస సంపుటాలుగా వెలువడ్డాయి.


నిజాంచెర నుండి విముక్తమైన తెలంగాణకు తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు. వారి జీవిత చరిత్రను పరిచయం చేస్తూ, ఆయనలోని సాహితీమూర్తిమత్వాన్ని చాటిచెప్పారు. ఈ పుస్తకం 2011 లో వెలుగుచూసింది. ఇందులో ఒక చోట హైదరాబాదులో తప్ప అప్పటికి తెలంగాణ జిల్లాల్లో డిగ్రీ కళాశాలలు లేకపోవడం, విద్యాపరమైన తెలంగాణ వెనకబాటుతనానికి నిదర్శనం. దీనికి నిజాం పరిపాలన కారణమని ప్రత్యేకించి చెప్పవలసిన పనిలేదు. బూర్గుల రామకృష్ణారావు మొదట విద్యాశాఖ మంత్రిగా, తరువాత ముఖ్యమంత్రిగా ప్రతి జిల్లాలో ఒక డిగ్రీ కళాశాల ఉండేటట్లు, పాఠశాలల్లో, కళాశాలల్లో తెలుగు మాధ్యమాలు (మీడియం) ఉండేటట్లు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. చైతన్యశీలురయిన నవతరం తెలంగాణాలో తయారు కావడానికి మార్గం సుగమమైంది (పుట. 119) అని చెబుతారు. సమీక్షలు ఎంత నిశితంగా,




సూక్ష్మంగా, సమగ్రంగా వ్రాయగలరో, అదే విధంగా సెమినార్లకు సమర్పించిన సుదీర్ఘ వ్యాసాలు 20పుటల నుండి 60 పుటలదాక వ్రాయగలరు. అవన్నీ కూడా విషయ పరిధిని దాటకుండా, అనవసరమైన విషయాలు లేకుండా సమాచారాన్ని పరిపుష్టంగా సమకూరుస్తూ అలరారడం గమనార్హం. ఆ వ్యాసాలను నిత్యాన్వేషణం అన్న పేరుతో 2018 లో అందించారు. ఈ వ్యాసాలను విడిగా గ్రంథాలుగా వేయడానికి అవకాశం కూడా ఉంది. ఉదాహరణకు 'హాస్య చతురుడు విశ్వనాథ' వ్యాసంలో విశ్వనాథవారి సాహిత్యంలో ఎక్కడెక్కడ ఏ ఏ పుస్తకంలో ఎలాంటి హాస్యం ఉందో ఇలా విభజించారు.


1. అమాయక హాస్యం 2. మనస్తత్వ ప్రదర్శనం 3. వర్ణనాత్మక హాస్యం 4. అజ్ఞాన ఖండం 5. తార్కిక హాస్యం 6. ప్రణయ హాస్యం 7. పేరడీ 8. ఆవేదనాత్మక హాస్యం 9.మిత్రసల్లాపం. 10. బంధు సల్లాపం 11. ఆర్థిక హాస్యం 12. అధిక్షేపాత్మక హాస్యం 13. చేష్టాగత హాస్యం.

ఈ విషయాలను గుర్తించి విశ్లేషించడానికి విశ్వనాథవారి సాహిత్యాన్ని ఎంతగా మథించాలి? ఆ మథనంలో నుండి హాస్యామృతాన్ని తనివి తీరా పంచారు. తన పరిశోధనా అంశాన్ని అంతటితో వదిలివేయకుండా ఇంకా కొనసాగిస్తున్నారు అనడానికి ఇది తార్కాణం. బంకించంద్ర పుస్తకం వెలువరిస్తున్న సందర్భంగా జాతీయోద్యమ సాహిత్యం గురించి విపులంగా చర్చించారు. ఉద్యమ సాహిత్యాన్ని ప్రచారం చేసిన ఖండకావ్యాలు, గేయ కవిత, నవల, కథానిక, నాటకం, పత్రికల నుండి సేకరించి ఈ గ్రంథంలో పొందుపరిచారు. బంకించంద్రుని నవలలు, కథలు, హాస్య, వ్యంగ్య రచనలు, పత్రికా నిర్వహణ, తులనాత్మక సాహిత్య విమర్శ, శ్రీ కృష్ణ చరిత్ర, కవిత్వం, ధార్మికతలను చాటి చెప్పారు. పుస్తకంలో అనుబంధంగా 'వందేమాతరం–పుట్టుపూర్వోత్తరాలు' తెలుగు సాహిత్యంపై బంకించంద్రుని ప్రభావం మొదలయిన అంశాలతో సంపూర్ణమైన గ్రంథం ప్రభావస్ఫోరకంగా మనముందుంచారు నిత్యానందరావు. ఈ పుస్తకం వందేమాతరం శత జయంతిని పురస్కరించుకొని 2006లో వెలువరించారు.


'వ్యాస విలాసం' శీర్షికతో వ్యాసం గురించి ఇలా వివరిస్తారు. సహస్రదళ పద్మంలా, అపూర్వంగా వికసించి పరిమళాలను వెదజల్లుతుందీ వ్యాసం. వ్యాసంలో ఒకే అంశాన్ని గురించి ఒకటి రెండు కోణాల్లోనే విశ్లేషించే అవకాశం ఉండడానికి హేతువు దానికున్న పరిమిత రూపమే. బహుకోణాల్లో, విస్తృతంగా రాస్తే అది వ్యాస పరిమితులను ఛేదించుకుని ఒక స్వతంత్ర గ్రంథంగా అవతరించగలదు. వ్యంగ్యంగానూ, ఆత్మీయమైన పలకరింపులను చిలకరిస్తూ, సృజనాత్మకంగానూ, విమర్శనాత్మకంగానూ ఇలా ఎన్ని రకాలుగా అయినా వ్యాసాన్ని రచయిత ప్రతిభా సామర్థ్యాలను బట్టి శోభాయమానం చేయవచ్చు. రూపం పరిమితమైతే వ్యాసం, దీర్ఘం అయితే పుస్తకం, వాచకమయితే ఉపన్యాసం అని స్థూలంగా చెప్పుకోవచ్చు అంటే వ్యాసం మాట్లాడితే ఉపన్యాసం అన్నమాట (నిత్యాన్వేషణం, పుటలు. 282, 283). 'వ్యాఖ్యానాలలో అర్థ నిర్ణయం సాధకబాధకాలు' అనే వ్యాసంలో వ్యాఖ్యానం ఒక విశిష్ట సాహిత్య ప్రక్రియ. అది ఒక కళ. కవి తన కావ్యం ద్వారా చెప్పదలచుకున్న అంశాలను పాఠకులకు అందేలా తోడ్పడటం వ్యాఖ్యాత కర్తవ్యం. సంప్రదాయ పద్ధతిలో అయితే ప్రతిపదార్థ తాత్పర్యాలు, వ్యాకరణ ఛందో అలంకార వ్యంగ్యార్థాలను, ప్రభావ పరిశీలనలను, పాఠాంతరాల చర్చలను, రాజనీతి, సంగీత, జ్యోతిషశాస్త్రాద్యంశాల ప్రస్తావన ఉంటే వాటి వివరణలను, వాటికి సమాధానాలను ప్రదర్శించే దాన్ని వ్యాఖ్యానం అని పిలుస్తున్నాం. ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాక పై అంశాలతోపాటు పాత్రచిత్రణలు సామాజిక అంశాల ప్రతిఫలనం, శిల్పం, కావ్యం మొత్తం ఇచ్చే సందేశం మొదలైన ఏదో ఒకటి రెండు అంశాలకు పరిమితమై రాయడం ఎక్కువైంది. వీటిని విమర్శక వ్యాసాలు అంటున్నామని వివరిస్తారు. రచయిత హృదయాన్ని ఆంతర్యాన్ని ఆవిష్కరించడానికి ప్రధానంగా జరగాల్సిన పని అర్థ నిర్ణయం (పుట 68, 69) అని నిత్యానందరావంటారు.

పల్లా దుర్గయ్య గారి గురించి ఇంతవరకు ఎవరూ పేర్కోని అంశాలను వివరిస్తూ, భావి పరిశోధకులకు, చరిత్రకారులకు ఉపయుక్తంగా ఉండే తీరుగా సుదీర్ఘవ్యాసాన్ని వెలుదండ నిత్యానందరావు రాశారు. ఈ వ్యాసం చివరలో "తెలంగాణ పండిత పరంపరలో ప్రముఖ స్థానం పొంది కూడా నిశ్శబ్ద సాహిత్య వ్యవసాయానికి


అంకితమైన నిర్మల చిత్తులు పరమ సాధుజీవనులు, ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖకు కాసిన మొట్టమొదటి అమృతఫలం అయిన డా. పల్లా దుర్గయ్య గారికి  అంజలి ఘటిస్తున్నాను" అని (పుట 141) అంటారు.





పల్లా దుర్గయ్య సంస్కృతాంధ్ర భాషల్లో గొప్ప విద్వాంసులు, పండితులుగా లబ్ధప్రతిష్టులైనారు. కాని కవిగా వారు ప్రచారాన్ని కోరుకోలేదు, ప్రకాశానికీ నోచుకోలేదు. అయినా తెలంగాణలో సాహితీ ప్రతిభను వెదజల్లిన విశిష్టమైన కంఠం ఆయనది అంటూనే దుర్గయ్య గారి సృజనాత్మకతను ఇలా విశ్లేషించారు. పల్లా దుర్గయ్య సృజనాత్మకతకు, ప్రతిభకు, కమ్మని భావుకతకు నిదర్శనంగా కలకాలం నిలిచిన వారి రచన గంగిరెద్దు కావ్యం. గంగిరెద్దు కావ్యంలోని  పద్యధార అచ్చ తెలుగు నుడికారం, అధిక్షేప విక్షేపం, దృష్టి నవ్యత, సహృదయ సాహితీ ప్రియుల స్మృతి పథాలలో నేటికీ పచ్చగానే ఉంది.




తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవన ప్రయత్నాల కాలంలో సాహిత్య సౌరభాన్ని అద్దిన విశిష్ట కావ్యాలు దుర్గయ్య గారి గంగిరెద్దు, పాలవెల్లి. సంప్రదాయ సిద్ధమైన పాండిత్యం, ఆధునిక చైతన్య సూచకమైన అధిక్షేపాది గుణాలు వారిలో సమపాళ్లలో మేళవించి పడ్డాయని, చెప్పడానికి ఈ రెండు కవితాసంపుటులే సాక్ష్యాలు అంటారు వెల్దండ. దుర్గయ్య గారి పరిశోధనాంశం, వారి మృదుస్వభావం, పద్య రచనా ప్రావీణ్యం సాంప్రదాయక పండితునిగా అనిపిస్తుంది. కానీ దుర్గయ్య గారి "వస్తున్నాం- వస్తున్నాం" అన్న కవిత చూస్తే రాజకీయ నాయకుల తీరుతెన్నుల పట్ల, బాధ్యతా రాహిత్యంతో తిరిగే యువకుల పట్ల వారెంత ధర్మాగ్రహం ప్రకటించారో తెలుస్తుంది. దుర్గయ్యగారు ఎంత ప్రగతిశీల దృక్పథంతో ఉండేవారో తెలుస్తుంది. (నిత్యాన్వేషణం, పుట.123) అని పల్లా దుర్గయ్యగారిని సమగ్రంగా చిత్రించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ నుండి ఎం.ఏ., పట్టా అందుకున్న మొదటి వ్యక్తీ, రెండవ వ్యక్తీ మా వరంగల్లుకు చెందినవారే కావడం విశేషం. మొదటివారు పల్లా దుర్గయ్య గారు కాగా, రెండవ వ్యక్తి ఈటూరి లక్ష్మణరావు గారు. ఈ విషయం ఎవరికీ తెలియదు అలా కనుమరుగైపోయింది. లక్ష్మణరావు గారు జనగామకు దగ్గరగా నున్న దేవరుప్పలకు చెందిన వారు.




1917లో జన్మించిన ఈటూరి లక్ష్మణరావు 1947లో ఎం.ఏ., తెలుగులో ఉత్తీర్ణులైన ఏకైక విద్యార్థి. అయితే వీరు తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులయినందున లెక్చరర్ ఉద్యోగానికి అనర్హులయ్యారు. దాంతో నిజాం రాష్ట్ర అనువాద శాఖలో ఉద్యోగస్థుడుగా చేరి, ఆంధ్రప్రదేశ్ అనువాద శాఖలో ఉపసంచాలకులుగా చేస్తున్న సమయంలో  1965లో దివంగతులయ్యారు. వారు తెలుగు, ఆంగ్లం, ఉర్దూ, హిందీ భాషలలో ప్రావీణ్యం ఉన్నవారు. ఏకసంథాగ్రహి కూడా. ఆ కాలంలో హనుమకొండ శ్రీ రాజ రాజ నరేంద్ర ఆంధ్ర భాషా నిలయంలోని మొత్తం పుస్తకాలను ఔపోసన పట్టిన విద్వాంసులు.  ఇంతటి విద్వాంసుని, మహోన్నత వ్యక్తిని తొలిసారిగా పరిచయం చేసిన ఘనత వెలుదండ నిత్యానందరావు గారికే దక్కుతుంది. (మరిన్ని వివరాలకు వెలుదండ నిత్యానందరావు సమగ్ర సాహిత్యం రెండవ సంపుటం, పుట 532 , 537).




వెలుదండ నిత్యానంద రావు గారు సుమారు నాలుగువేల పుటల  సాహిత్యాన్ని అందించారు. ప్రతి పుట, ప్రతివ్యాసం పాఠకుడికి వినూతన సమాచారాన్ని అందిస్తుంది. ఏ విషయాన్నయినా ఆయన పైపైన కాకుండా అందులో పూర్తిగా నిమగ్నమై ఆ అంశం పుట్టు పూర్వోత్తరాలను, లోతుపాతులను  తరచి మనకందిస్తారు. ఇంతవరకు ఎవ్వరూ చేయని ఒక పని ఆయన చేశాడు. అది ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ తొలి ఆచార్యుల నుండి నేటి ఆచార్యుల వరకు సమగ్ర సమాచారం వెలికి తీసి అందించారు. దీని వలన ఉస్మానియా తెలుగు శాఖ సమాచారం మనకు లభించినట్లయింది. అలాగే తెలుగు శాఖలోని తొలి దశాబ్ది విద్యార్థులను వారి వివరాలను తెలిపారు. ఇలాగ మరే యునివర్సిటీ తెలుగుశాఖలోనూ జరుగలేదు. నిఘంటువుల గురించి చెబుతూ వాటి పుట్టుపూర్వోత్తరాలను చెప్పారు. వరంగల్లుకు చెందిన పండితులు తూము రామదాసు గారి ఆంధ్ర పద నిధానము  తెలంగాణ మాండలికాలను తెలుపుతుందని చెపుతారు. (వెలుదండ నిత్యానందరావు సమగ్ర సాహిత్యం సంపుటం 1-పుటలు. 518- 528). వెలుదండ నిత్యానందరావు కేవలం తెలుగు శాఖలో ఆచార్యులు మాత్రమే కారు, విద్యార్థులకు పాఠాలు చెప్పడంతో

## నాగళ్లకు సంకెళ్లు

రైతు నాగళ్ళకు ఇనుప సంకెళ్లు
దుక్కిదున్నే కర్రుల మీద నిర్బంధ నిప్పులు
లాకప్ లో చిక్కుకున్న పచ్చని వరిపైర్లు
జైల్లో వ్యవసాయదారుల దుక్క పొరకం

అర్ధరాత్రి గౌరవెల్లి పల్లె గొడ గొడ ఏడ్చింది
పరిహారం అడిగిన పాపానికి నెత్తురూ కార్చింది

తాతలు తండ్రులనాటి భూముల విస్తాపన
ఇస్తానన్న పైకమన్నా ఇవ్వక సతాయింపు
నినాదమై నిలిచినందుకు చేతులకు బేడీలు

మన తెలంగాణమని రణం చేసిన చేతులవి
ఇంతలోనే ఆ హస్తాలకు బంధనాలు

అంగేటి తిరుపతిరెడ్డి ఆరుగాలం
అంగి విడిచి అరక దున్నే బక్క రైతు

భూక్యా సక్రు నాయక్ భూమిని రంగరించి
బంగారి పంటలు పండించే గిరి పుత్రుడు

బద్దం శంకర్ రెడ్డి పొద్దుందాక పొలం దగ్గరే
గోదలు మర్లేసుకునే బోలా శంకర రైతు

రాగి శ్రీనివాసుకైతే ఎవుసమే లోకం
యాసంగి వానాకాలం వడ్లు పండించుడే
వ్యాపకం

గౌరెల్లి గుడాటిపల్లెన ఇంక ఎవరయ్యా
రాజ్యం మీద యుద్ధం చేసింది

వాళ్లు చరాచర ఆహార సృష్టికర్తలు
వాళ్లు పొలం దున్నీ దున్నీ

మన్ను నుంచి అన్నం పుట్టిస్తున్నరు
ఆకలి తీర్చడమే వాళ్ల జీవన సంకల్పం.

**అన్నవరం దేవేందర్**
**9440763479**

సరిపెట్టుకోలేదు, ఆయన పరిశోధకుడు. సాహితీ మథనుడు, నిత్య పఠనవ్యసని. కేవలం తను ఉపన్యాసకుడుగా, ఆచార్యుడుగా భీష్మించుకు కూర్చోకుండా, విద్యార్థులతో మమేకమై ఉంటాడు. ఒక చిన్న ఉదాహరణ. నిత్యానందరావు గారు తమ నిత్యాన్వేషణం గ్రంథానికి తన విద్యార్థి శిష్యుడు అట్టెం దత్తయ్యను సంపాదకుడిగా చేశారు. నాలాంటి సాహితీ మిత్రులతో కూడా అతను కలసి మెలసి ఉన్నప్పుడు తానొక ఆచార్యుడననే అహంభావ ఛాయలను దగ్గరకు రానీయకుండా మసలుకుంటాడు.

'ముఖే ముఖే సరస్వతీ' కదా ఎదుటివారిలోని సరస్వతిని పరిశీలిస్తూ ఉంటాడు. గత 30 సంవత్సరాలలో నాతో ఎప్పుడూ ఒక సాహితీ మిత్రులుగానే ఉన్నారు. నేను ప్రచురించిన వ్యాస సంకలనాలకు వ్యాసం అడిగితే ఏ మాత్రం భేషజం లేకుండా అందించారు. అలాగే 'శ్రీలేఖ సాహితీ సదస్సు'లకు కూడా వచ్చారు. ఆయన వరంగల్‌కు ఏ పని మీద వచ్చినా నాకు ఫోన్ చేసి కలిసేవారు. అది ఆయన ఆప్యాయత, స్నేహశీలత. నిత్యానందరావు ప్రస్తుతం తమ సమగ్ర సాహిత్యం ఏడు సంపుటాలుగా వెలువరిస్తున్నారు. ఆయన నలుబది సంవత్సరాలుగా వ్యాసాలు, పరిశోధనలు, సమీక్షలు, సృజనాత్మక రచనలు అన్నీ ఒకచోటికి తెచ్చే బృహత్ప్రయత్నం అన్నమాట. ఇది ఎంతో ఆర్థికభారంతో కూడింది. పుస్తకాలమ్ముకోలేక చేతులు కాల్చుకోవడమే. "గైకొని" కాక "కొని" ప్రోత్సహించడం మనందరి కర్తవ్యం కావాలి.

నిత్యానంద రావు 1983 ఆగస్టులో ఎం.ఎ విద్యార్థిగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరి "సీనియర్ ఆచార్యుని"హోదాలో 39ఏళ్ళ తరువాత 2022 ఆగస్టులో బయటకు సగౌరవంగా వస్తున్నారు. రావలసిన పదోన్నతులన్నీ సకాలంలో వచ్చాయి. తెలంగాణలో అన్నిరకాల ఉద్యోగస్థులు 61ఏళ్ళకు రిటైరవుతుంటే విశ్వవిద్యాలయ ఆచార్యులు మాత్రం 60 ఏళ్ళకు రిటైర్ కావడంలోని ఔచిత్యమేమిటో, ఈ వివక్ష వల్ల కలిగే ప్రయోజనమేమిటో బోధపడడంలేదు. నిత్యానంద రావు నిత్యసంతుష్టుడు. ప్రతి విషయంలోను సర్దుకొనిపోయే మనస్తత్వం కలవాడు. కనుక సమస్య లేదు. కేవలం పదవీ విరమణ మాత్రమే చేస్తున్నారు. ఆయన ఇక పూర్తి కాలపుసాహిత్యకారుడుగా మారాలి. అందువలన తన ఆలోచనలలో మిగిలిపోయిన సాహిత్యాంశాలను మన ముందుకు తెస్తారని ఆశిస్తున్నాను. ఆ దేవదేవుడు వెలుదండనిత్యానందరావుగారికి ఆయురారోగ్యాలతో పాటు, పూర్ణాయుష్షును, ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ అభినందిస్తున్నాను.

**"స్నేహం నీడనిచ్చే చెట్టు లాంటిది"**

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 10 (41) హైదరాబాద్ ఆగస్టు : 2022

# నీలగిరి, తెనుగు పత్రికల శతాబ్ది స్ఫూర్తి

**డా. నుగ్గునూతల యాకయ్య,** జర్నలిస్ట్, ఫోన్: 891 991 3723

తెలుగు పత్రికారంగ చరిత్రలో వందల సంఖ్యలో పత్రికలు ప్రచురితమయ్యాయి. కొన్నాళ్లకే ఆగిపోయాయి. కానీ ఇందులో కొన్ని పత్రికలు మాత్రమే సమకాలీన చరిత్రకు అద్దం పట్టాయి. జనాన్ని జాగృతం చేశాయి. అలాంటి పత్రికల గురించి మాట్లాడుకో వడమంటే.. మన గతాన్ని నెమరువేసుకోవడమే. తెలంగాణ ప్రాంతంలో తొలినాళ్లలో వచ్చిన అలాంటి పత్రికలే నీలగిరి, తెనుగు పత్రికలు. వార్తా పత్రిక లక్షణాలతో తొలిసారిగా ఈ ప్రాంతంలో 1913లో హితబోధిని పత్రిక వెలువడగా, ఆ తర్వాత 1922 ఆగస్టు నెలలో తెలంగాణ ప్రజలు గర్వించదగిన నీలగిరి, తెనుగు పత్రికలు మూడు రోజుల తేడాతో ప్రచురితమయ్యాయి. నిజాం రాష్ట్రాంధ్ర కేంద్ర జన సంఘం కార్యకలాపాల ప్రచారం, తెలుగు భాష ఉద్ధరణ కోసం తీసుకురాబడిన ఈ రెండు పత్రికలు వెలువడి 2022 ఆగస్టుతో వందేళ్లవుతోంది. ఈ సందర్భంలో నాటి మేటి పత్రికల గురించి, ఆ పత్రికలు ఇచ్చిన స్ఫూర్తి గురించి తెలుసుకోవడం సముచితం.

1920వ దశకం నాటికి హితబోధిని అనే పత్రిక ఒకటి మాత్రమే బరారు శ్రీనివాస శర్మ సంపాదకత్వంలో వచ్చి ఆగిపోయింది. ఇతర కొన్ని పత్రికలు వెలువడినా తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా లేవు. అప్పటివరకు వచ్చిన పత్రికల లక్ష్యానికి భిన్నంగా 1922లో వచ్చిన పత్రికలు నీలగిరి, తెనుగు. 1921లో నిజాం రాష్ట్రాంధ్ర కేంద్ర జనసంఘం ఏర్పాటైన తర్వాత ఈ సంఘ కార్యకలాపాలను ప్రచారం చేసేందుకు, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఓ పత్రికను నడపాలని మాడపాటి హనుమంత రావు, వద్లకొండ నరసింహారావు తదితరులు భావించారు. మాడపాటి హనుమంతరావు తన ఆంధ్రోద్యమం గ్రంథంలో ఇదే విషయాన్ని ప్రస్తావించారు. 'బ్రిటీషాంధ్ర ప్రాంతం నుండి వెలువడు చుండిన తెనుగు పత్రికలు, ఇచటి ఆంధ్రోద్యమ వార్తలనప్పుడప్పుడు ప్రకటించుచుండెను. అయినను వాని వలన తగినంత అవసరముగ నుండినంత సహాయము లభించలేదు. అది సహజమే. అవి దూర స్థలములుగా నుండుట యొక కారణము. బ్రిటీషిండియాలోని ఉద్యమాల బాహుళ్యము వలన, ఇచ్చటి ఉద్యమముల నెక్కువగా ప్రోత్సహించునవకాశము వానికి లేకయుండెను. ఇంతేగాక, రాజకీయముగా, నిజాం రాష్ట్రాంధ్ర దేశము భిన్నపరిస్థితులకు లోబడి యుండినందున ఇచ్చటివారి సమస్యలను సరిగా గ్రహించుట అచ్చటి పత్రిక రచయితలకును, దేశారాధకుల కును ఆ కాలమున వీలు లేకుండయుండెను. ఈ కారణము వలన నిజాంరాష్ట్రంలోని ఆంధ్రోద్యమము ఇచ్చటి తెనుగు పత్రికల యాశ్రయమునే నమ్ముకొని, వాని పైననే ఆధారపడవలసిన దయ్యెను.' అని అభిప్రాయపడ్డారు.

అందువల్ల తెలంగాణలో నిజాం రాష్ట్రాంధ్ర జన సంఘం ఉద్యమ వార్తల ప్రచారానికి పత్రిక తక్షణావసరంగా మారింది. అందుకే మాడపాటి హనుమంతరావు, వద్లకొండ నరసింహారావు సూచన మేరకు నల్లగొండ జిల్లాకు చెందిన భూస్వామి, స్థితిమంతుడు, జన సంఘం అభిమాని అయిన షబ్నవీస్ వెంకటరామ నరసింహారావు పత్రిక స్థాపనకు ముందుకొచ్చారు. అప్పటికే ఆయన నల్లగొండ జిల్లాలో పలుచోట్ల గ్రంథాలయాలను నెలకొల్పి భాషా సేవ చేస్తున్నారు. ఆయన తన జిల్లా నల్లగొండ పేరు మీదే 'నీలగిరి' పేరుతో 1922 ఆగస్టు 24న వారపత్రికగా మొదటి సంచిక ప్రచురించారు. సొంత ప్రింటింగ్ ప్రెస్‌లోనే పత్రికను అచ్చువేసేవారు. ఈ పత్రిక స్థాపనకు గల ముఖ్య ఉద్దేశాలను వెంకటరామ నరసింహారావు తన సంపాదకీయంలో పేర్కొన్నారు.

'హైదరాబాద్, సికింద్రాబాద్ నగరములను వీడి రాష్ట్రమంతయు వెదికినచో ఒరంగల్లు, నల్లగొండ, ఇనుగుర్తి యందు తప్ప మరే స్థలమందునాంధ్ర ముద్రణాలయములు గోచరింపవు. మొత్తము రాష్ట్రమునగల ఈ ముద్రణాలయములను వ్రేళ్ల మీద లెక్కింపవచ్చును. వీనికైనను తగిన పని కలదా లేదా యని విచారించినపుడు మాత్రమాశ్చర్యము అనింపక మానదు. ఈ వృత్తిలో ప్రవేశించినవారు దండుగలు పడి ముద్రణాలయములు సగము వెలకమ్ముకొని తమ వృత్తిని మానుకొనుచున్నారు. ఇప్పటికి హైదరాబాదు వంటి ముఖ్య పట్టణములో కేవలం మాంధ్రక్షరముల నుంచుకొని జీవించు ముద్రణాలయమే గోచరింపదు.' అనే సంపాదకీయ వ్యాఖ్యలను బట్టి పత్రిక స్థాపనలో, పుస్తకాల ముద్రణలో నష్టాలు ఉన్నాయని తెలిసి కూడా వెంకటరామ నరసింహారావు పత్రికను స్థాపించడం సాహసమే అనిపిస్తుంది. తనకు ముద్రణా యంత్రాన్ని విక్రయించిన 'హితబోధిని' పత్రిక సంపాదకుడు బి. శ్రీనివాసశర్మ చవిచూసిన అనుభవాలను కూడా పరోక్షంగా ఇందులో చెప్పాడని తెలుస్తోంది.

నీలగిరి పత్రిక ప్రతి సంచిక మూడో పేజీలో సంపాదకీయాలు ఉండేవి. సంపాదకీయాలు చిన్నగా ఉన్నప్పటికీ రెండు, మూడు అంశాలపై సంపాదకీయ వ్యాఖ్యలు ఉండేవి. నానా జాతి సమితి మొదలు నల్లగొండ రోడ్ల సంగతుల వరకు ఇందులో ప్రస్తావనకు వచ్చేవి. ఇందులో చిన్నచిన్న అడ్వర్టయిజ్‌మెంట్లు కూడా అచ్చయ్యేవి. వివిధ గ్రంథమాలలు, భారతి, సుజాతలాంటి పత్రికల ప్రకటనలు కూడా వచ్చేవి. టాబ్లాయిడ్ సైజులో ఉండే నీలగిరి పత్రికలో శేషాద్రి వెంకటరమణ కవుల్లో ఒకరైన దూపాటి వెంకటరమణాచార్యులు, నల్లగొండలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న కె. రాములు, గంగుల శాయిరెడ్డి, గవ్వా అమృతరెడ్డి, ముదిగొండ బుచ్చయ్య లింగశాస్త్రి, కోదాటి రామకృష్ణారావు, ముదిగొండ శంకర శాస్త్రి, ఆదిరాజు

వీరభద్రరావు, శేషభట్టర్ వేంకట రామానుజాచార్యులు, కంభంపాటి సత్యనారాయణ, చాట్రాతి లక్ష్మీనరసాంబ, మంగళగిరి రాఘవమ్మ తదితరులు రచనలు చేశారు. 12 పేజీల ఈ పత్రికలో పేజీకి మూడు కాలమ్స్ ఉండేవి. శేషభట్టర్ వెంకటరామానుజాచార్యులు 'లోకజ్ఞుడు' గుప్తనామంతో 'భావ ప్రపంచం' అనే ఖండకావ్యాన్ని సీరియల్‌గా ప్రచురించారు. దీంతోపాటు హిందీ, ఉర్దూ పత్రికల నుంచి ప్రముఖ వార్తలను అనువదించి ఈ పత్రికలో ప్రచురించేవారు. ఐదేళ్లపాటు నడిచిన నీలగిరి పత్రిక 1927లో ఆగిపోయింది.

నీలగిరి పత్రిక తొలి సంచిక వెలువడిన మూడు రోజులకే తెలంగాణ పత్రికారంగ చరిత్రలో ఓ అద్భుత ఆవిష్కరణ జరిగింది. తెలంగాణలో పత్రికను ప్రారంభించడమే ఓ సాహసంగా చూసే ఆ రోజుల్లో వరంగల్ జిల్లా మానుకోట డివిజన్‌లోని మారుమూల అటవీ గ్రామమైన ఇనుగుర్తి నుంచి 'తెనుగు' పత్రిక వెలువడింది. ఒద్దిరాజు సోదరులుగా ప్రసిద్ధులైన ఈ పత్రిక సంపాదకులు ఒద్దిరాజు సీతారామచంద్రరావు, రాఘవరంగారావు అసాధారణ ప్రజ్ఞావంతులు. బహుముఖ ప్రతిభాశాలులు. ఏకసంథాగ్రహులైన ఈ సోదరులు ఆయుర్వేద శాస్త్రం నుంచి హస్తకళల వరకు నేర్వని విద్య లేదు. సంస్కృతం, ఉర్దూ, తమిళం, ఆంగ్లం, పారశీ, అరబ్బీ, హిందీ భాషల్లో వీరు నిష్ణాతులు.

కాశీనాథుని నాగేశ్వరరావు బొంబాయి నుంచి నడుపుతున్న ఆంధ్ర పత్రికతోపాటు ఆంగ్ల పత్రిక టైమ్స్ ఆఫ్ ఇండియా వీరింటికి వచ్చేవి. అప్పటికే మద్రాస్ నుంచి ప్రింటింగ్ మిషన్ తీసుకొచ్చి ఈ సోదరులు తాము ఓ పత్రికను స్థాపించాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా మద్రాస్‌కు వెళ్లి కాశీనాథుని నాగేశ్వరరావును(ఆ సమయంలోనే బొంబాయి నుంచి పత్రిక కార్యాలయం మద్రాస్‌కు మారింది) కలిశారు. అలాగే బందరు వెళ్లి ముట్నూరి కృష్ణారావును కలిసి సలహాలు అడిగారు. దేశంలో రాజకీయ, సాంఘిక చైతన్యం కలిగించడంలో పత్రికలకు మించిన సాధనం మరొకటి లేదని, అందువల్ల ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా పత్రికను నడపాలని హితబోధ చేశారు. రాజకీయ వార్తలు, యథార్థ విషయాలు ప్రచురించినప్పుడు ఇబ్బందులు తప్పవని వివరంగా చెప్పారు. విషయం తెలుసుకున్న ఒద్దిరాజు సోదరుల మిత్రులు కొందరు వరంగల్ నుంచి పత్రికను తీయవలె గాని పల్లెటూరి నుంచి వద్దు అని వారించారు. రోడ్డు మార్గం సరిగ్గా లేని, పోస్టు సౌకర్యం లేని అటవీ గ్రామం నుంచి పత్రిక నడపడం వారికి చాలా కష్టమైన పనే అయినప్పటికీ వారికున్న పట్టుదల ముందు ఈ అసౌకర్యాలన్నీ దిగదిడుపే అయ్యాయి.

నిజాం సర్కార్ అనుమతి సంపాదించి 'తెనుగు' పత్రిక తొలిసంచికను 1922, ఆగస్టు 27న ఆదివారం వెలువరించారు. పత్రిక మొదలయ్యాక పోస్టల్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్‌తో మాట్లాడి గ్రామంలో పోస్టాఫీసు పెట్టించారు. అయితే పోస్ట్ మాస్టర్ చేయాల్సిన పనులన్నింటిని ఈ సోదరులే మీద వేసుకోవాల్సి వచ్చింది. వార్తలు, వ్యాసాలు రాసేవారు, చందాదారులను చేర్పించేవారు, పత్రికను అమ్మే ఏజెంట్లు లేక ఇబ్బందులు పడ్డారు. ఈ పనులన్ని అన్నీ తామై చేసుకోవాల్సి వచ్చింది. ఈ పత్రిక మొదటి సంవత్సరం ప్రతివారం 500 ప్రతులు ముద్రించేవారు. ఆ తర్వాత చందాదారులు పెరిగినకొద్ది మరుసటి సంవత్సరం 1000 ప్రతులు ముద్రించారు. ఇలా తెనుగు పత్రిక ఆరు సంవత్సరాలు ఇనుగుర్తి గ్రామం నుంచి వెలువడి తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, రాజకీయ చైతన్యానికి ఎంతగానో కృషి చేసింది.

తెనుగు పత్రికలో శేషాద్రి రమణ కవులు, హరిబాపయ్య, పంగనామముల రామచంద్రరావు, రాయప్రోలు సుబ్బారావు, దేవులపల్లి వేంకటచలపతిరావు, నామపల్లి కృష్ణారావు, చకిలం శ్రీనివాస శర్మ, బి. వెంకటరామరాజు హరిదాసు, మధురకవి, గంగుల శాయిరెడ్డి, నందిగామ దత్తాత్రేయ,శర్మ, బి. భూమలింగం, చిట్టా రాజన్నలతోపాటు చాట్రాతీ లక్ష్మీనరసమాంబ, పందింటి సత్యవతీబాయి, పాపమ్మ(కరీంనగర్) లాంటి మహిళల రచనలు కూడా అచ్చయ్యేవి. ఆ తర్వాత ఈ పత్రికను ఇనుగుర్తి నుంచి ఓరుగల్లుకు మార్చాలని దేవులపల్లి రామానుజరావు తండ్రి వేంకటచలపతిరావు, తూము వరదరాజులు కలిసి ఒద్దిరాజు సోదరులను బలవంతం చేశారు. అయితే ఇది ఒద్దిరాజు సోదరులకు ఏ మాత్రం ఇష్టం లేదు. కానీ మిత్రుల ఒత్తిడికి తలొగ్గి యాజమాన్యం మానుకొని పత్రికను వరంగల్లుకు మార్చారు. అయితే ఆ తర్వాత ఒద్దిరాజు సోదరుల్లాంటి సమర్థులు పత్రిక బాధ్యతలు చూడకపోవడం, అంతకు ఏడాది క్రితమే 1926లో వచ్చిన 'గోలకొండ' పత్రికను తట్టుకొని నిలబడలేకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులతో 1927లో 'తెనుగు పత్రిక' మూతపడింది. 'తెనుగు' పత్రికకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు 1926 సెప్టెంబర్‌లో 'నీలగిరి' పత్రిక విరాళాలు సేకరించేందుకు ప్రయత్నించినప్పటికీ అది సాధ్యం కాలేదు.

నిజాం రాష్ట్రాంధ్ర జన సంఘం కార్యకలాపాలు ఉధృతమవుతున్న సమయంలోనే నీలగిరి, తెనుగు పత్రికలు ఆగిపోవడం తెలంగాణ సమాజానికి తీరని నష్టమే. అందుకే మాడపాటి హనుమంతరావు తన 'తెలంగాణ ఆంధ్రోద్యమము' గ్రంథంలో ఈ పత్రికల భాషా, సంఘ సేవ గురించి చక్కగా చెప్పారు. "నీలగిరి, తెనుగు పత్రిక ఆగిపోవుట వలన తెలంగాణమునకు, ఈ రాష్ట్రమున చాలాకాలంగా వెనకబడియున్న ఆంధ్ర భాషా ప్రసారమునకు అతినష్టం కలిగినది. ఎన్నియో శ్రమలను భరించి నడుపుచుండిన పై పత్రికలు ఆంధ్రోద్యమ వ్యాప్తికి చేసిన సేవ ఇంతింతని చెప్పుట అసాధ్యం. ముఖ్యంగా ప్రారంభకాలమున నీలగిరి, తెనుగు పత్రికల వంటి తెనుగు వార్తా పత్రికలు దేశమున లేకుండినచో ఆంధ్రోద్యమునకు ఈపాటి వ్యాప్తి, వికాసములు లభించియేయుండకపోవునని చెప్పినచో, అందే మాత్రము అతిశయోక్తి యుండజాలదు.' అని పేర్కొన్న మాటలు అక్షర సత్యాలే. పత్రిక నిర్వహణలో షబ్నవీస్ వెంకటరామ నరసింహారావు, ఒద్దిరాజు సోదరుల స్ఫూర్తి ఈ తరానికి కూడా ఆదర్శం.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 10 (43) హైదరాబాద్ ఆగస్టు : 2022

తెలంగాణ విస్మృత కవులు – 2

# శతక కవి – మాటూరు వెంకటేశం

**డా. పెబ్బేటి మల్లికార్జున్,** సహాయ ఆచార్యులు, నాగర్ కర్నూలు, ఫోన్: 9491881916

నేను పరిశోధన నిమిత్తం తెలంగాణాలో పర్యటిస్తున్నప్పుడు ఈ కవి గురించిన సమాచారం లభించింది. ఇతని గురించి ఏ సాహిత్య చరిత్రలలో కూడా పేర్కొనబడలేదు. ఇతను ఖమ్మం జిల్లాలోని మధిర తాలూకాలో గల మాటూరు గ్రామ వాస్తవ్యుడు, కాలం క్రీ.శ.1720 నుండి 1800వరకు. సాహిత్య చరిత్రలలో మాటూరు వెంకటప్పయ్య (క్రీ.శ.1800–1870 ప్రాంతం) గురించి కనిపిస్తుంది. ఇతని ఏకైక రచన **భూరిగుణజాల శతకం**. ఇతనిది కూడా మాటూరు గ్రామమే. వీరిద్దరు రక్త సంబంధీకులు అయ్యే అవకాశం ఉంది. వీరిద్దరి వయస్సులో దాదాపు 80 సంవత్సరాలు తేడా ఉంటుంది. దీనిని బట్టి వెంకటేశం గారికి వెంకటప్పయ్య ముని మనుమడు అయ్యే అవకాశం ఉంది.

### రచనలు

1. మాటూరి చెన్నకేశవ శతకం 2) బుధమనోల్లాస శతకం 3) రామాజానకీ నాయక శతకం 4) మాటూరివాసా శతకం 5) రాయపట్నములవాస గోపాలదేవ శతకం.

ఇతన్ని శతక కవిగా పేర్కొనవచ్చు. తెలుగు సాహిత్యంలో శతకాలది ప్రత్యేకస్థానం. పండిత పామరులను రంజింపజేశాయి. పురాణాలు కథలను, ప్రబంధాలు వర్ణనలను, గేయాలు సంగీతాన్ని ప్రధానంగా కలిగి ఉంటాయి. శతకాలు ముక్తకాలై, కవి ఆత్మను ప్రకటించటం ప్రధానంగా ఉంటుంది.

### 1. మాటూరి చెన్నకేశవ శతకం

చంపక, ఉత్పలమాలా వృత్తాలతో 110 పద్యాలు కలిగిన ఈ శతకంలో 108కి మించొద్దనే కారణం చేత గణపతి గురించి ఉపోద్ఘాతంగా రెండు పద్యాలలో రాసి, తరువాత శ్రీకారంతో శతకాన్ని ప్రారంభించాడు.

కం. హేరంబుని గణనాథుని
**గౌరీ సుతనేకదంతు కాంచన వర్ణున్**
**కోరి భజించెదనెప్పుడు**
**కోరికలోన గూడ నధిక కుతకము తోడన్**

ఉ. **శ్రీధర వాసుదేవ హరి చిన్మయరూప మహానుభావ జే**
**దోద్ధర దైత్య సంహరణ తోయజనేత్ర యశోద నందనా**
**సాధు జనానుపోషయహిశాయి జనార్ధనా గోపవల్లభా**
**భూధర చక్రహస్త సురపూజిత మాటూరి చెన్నకేశవా!**

అని మాటూరిలోని చెన్నకేశవుని గూర్చి 3వ పద్యంతో ప్రారంభం చేశాడు. శతకాలకు సంఖ్యా నియమాన్ని పలువురు పలువిధాలుగా పాటించినా, ఎక్కువమంది 108ని పాటించారు. దీనికి కొన్ని కారణాలున్నాయి. తాంత్రికులు 108సార్లు నామాన్ని స్తుతించడం వలన లాభమని చెప్పారు. అట్లాగే 108 ప్రదక్షిణలు చేయడం, 108 సూర్య నమస్కారాలు చేయడం, జపమాలలో 108 పూసలుండటం ఆచారంగా ఉంది. ఈ నియమాల వలననే శతకాలలో అష్టోత్తరశత పద్యాలు చెప్పే ఆచారం ఏర్పడింది. వేంకటేశంగారు ఈ నియమాన్ని రెండు శతకాలలో పాటించారు.

ఈ శతకం చివరిపద్యంలో కవి తన కులగోత్రాలు, తండ్రి గురించి చెప్పుకున్నాడు.

**చం. అవని సురుండ మాటురి కులాధిపు సీతన మంత్రి పుత్రుడన్**
**కవిజన పూజ్యుడన్ ఘనుడ కౌండ్యసగోత్రుడ వెంకటాఖ్యుడన్**
**కవులు నుతింప నొక్క శతకంబు రచించితి దేవదేవు మా**
**ధవు సుచరిత్రముల్కడు ముదంబున మాటురి చెన్నకేశవా!**

ఈ పద్యంలో కవులు కీర్తించేటట్లు ఒక్క శతకాన్ని రచించినట్లు చెప్పుకోవడం వలన ఇతని రచనలలో ఇది మొదటి శతకంగా నిర్ధారించవచ్చు. తన పద్య రచనా విధానాన్ని తెలిపి, వినయాన్ని ప్రకటించుకున్న భావం క్రింది పద్యంలో చూడవచ్చు.

**చం. సుధఘటి కల్పితసత్కథలు సొంపుగనేనవి వృత్త పద్యముల్**
**నధికత చేయగా దలతు నాత్మను నింతియకాని మిక్కిలినిన్**
**అధికుడగాను విద్యకును నట్లగు నందుకుగాన తప్పులే**
**విధమున జెందనీకు హరి వెన్నుక మాటురి చెన్నకేశవా!**

వేంకటేశంగారు తన పాండిత్య ప్రతిభను ఇందులో ప్రదర్శించాడు. ప్రాసతో రమణీయంగా...

**చం. రవిశశినేత్ర పద్మజ సురాధిప సేవిత దివ్యగాత్ర శాం**
**భవి జపమాల మంత్ర పురభంజన మిత్ర రమాకళత్ర స**
.......... ......... ....... ...........

అని చెప్పిన పద్యంతో పాటు అఖండ యతిప్రాస సంధిని పాటిస్తూ రాసిన పద్యాలు కూడా ఉన్నాయి. పోతన ఆంధ్ర మహాభాగవతంలో రాసిన 'ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై' అనే పద్యాన్ని పోలిన 'ఎవ్వనిచే సృజింపబడు నెల్ల జగంబులు వృద్ధి బొందగా!' అనే పద్యాలు ఉన్నాయి.

**2. రామా జానకీనాయక శతకం**

ఇందులో 108 శార్దూల మత్తేభ వృత్త పద్యాలున్నాయి. ఇందులో రామాయణ కథను చెప్తూనే హరి యొక్క అవతారాలు, వాటి విశిష్టతలను తెలియజేశాడు.

**శా. శ్రీరామా రవివంశజా రఘుపతి సీతేశ శ్రీరాఘవా**
**పారేశా శతకోటి పూర్ణవదనా దాక్షిణ్య రత్నాకరా**
**మారీచాది సమస్త దైత్య హరణా మార్తాండ కోటి ప్రభా**
**మారారీ ప్రముఖా సురావినుత రామాజానకీ నాయకా**

విష్ణువు యొక్క అవతారాలలో మత్స్యావతారం గురించి క్రింది పద్యములో చెప్పాడు.

**మ. నిగమంబుల్గొనిపోవు సోమకునితో నీరాంబుధింజొచ్చి స**
**త్వగతిన్ వాని వధించి వేదచయము ల్వాణీశుకిప్పించవా**
**పగ సాధించి మహాత్మయచ్యుత పరబ్రహ్మంబవైనట్టి నీ**
**మగమీనాకృతికేను మ్రొక్కెదను రామా జానకీ నాయకా!**

**3. బుధమనోల్లాస శతకం**

ఈ శతకాన్ని 109 పద్యాలతో 'బుధ మనోల్లాస మాటూరి పుర నివాస చెన్నకేశవ సర్వేశ జగధీశ' అనే మకుటంతో రాశాడు. తెలుగులో ద్విపాద మకుటాలతో కొన్ని శతకాలు ఉన్నాయి. 'భూత లోకేశ అచంటపురానివాస / భావ భవనాశ రామేశ పార్వతీశ' (అచంట రామేశ్వర శతకం), భూషణ వికాస శ్రీధర్మపుర నివాస / దుష్టసంహార నరసింహ దురితదూర (నరసింహ శతకం), సర్వగుణ ధామ శ్రీశైల సార్వభౌమ / చెన్న మల్లేశ శివలింగ శరణు శరణు (చెన్నమల్లేశ్వర శతకం – సిద్ధరామకవి) వంటివి ఉన్నాయి.

ఈ శతకంలో ఇతని కవితా శైలికి ఒక పద్యం

**సీ. శ్రీరామ చంద్రుండు సీతా సమేతుం**
**డు నగరాజధీరుండు నగధరుండు**
**రవికోటి తేజుండు రాక్షస హననుండు**
**జనకుండు దశరథ నాత్మజుండు**
**శర్వాశివంద్యుండు సద్ధర్మశీలుండు**
**రఘువంశ తిలకుండు రాఘవుండు**
**దేవాది దేవుండు ధీరుండు దారుండు**
**శ్రీకంఠ మిత్రుండు శివకరుండు**
.... ..... .... ....
**బుధ మనోల్లాస మాటురి పురనివాస**
**చెన్నకేశవ సర్వేశ జగదీశ**

**4. మాటూరి వాసా శతకం**

109 కంద పద్యాలతో కవి ఈ శతకాన్ని రచించాడు. మొదటి పద్యం

**క. శ్రీ రమణీ ధవ కేశవ**
**నారద హృత్కమల భృంగనంద తనూజా**
**క్షీరనిధి శయనయచ్యుత**
**మారసహస్ర స్వరూప మాటురి వాసా!**

అంకిత పద్యం

**కం. మాటూరి వేంకటదాసుడ**
**నీటుగ శతకంబు చెప్పి నిశ్చలభక్తిన్**
**ధాటిగా కృతినీకిచ్చితి**
**మాటుకి నన్నేలుమయ్య మాటురివాసా!**

వృద్ధాప్య దశలో ఈ శతకం రచించడం వలన సంసారంపై విరక్తిని ప్రకటించిన భావం కన్పిస్తుంది.

**క. సంసారము నిస్సారము**
**హింసాకరమూనుగాని హేయంబను**
**చున్ కంసారిన్ భజియించెద**
**మాంసాశన నాశయాశ మాటురివాసా!**

ఇతని ఇంకొక శతకం 'రాయపట్నము వాస గోపాలదేవ శతకం' అలభ్యం.

ఈ విధంగా శతక రాజాలను రచించాడు. ఈ కవి తెలంగాణా మాండలిక పదాలను వాడటం విశేషం. మాటూరి చెన్నకేశవ శతకంలో 'రాయని యన్న మాత్రమున రప్పున పాపము లేగుదూరమై! అనే పద్యంలో 'రప్పున' అనేది మాండలిక శబ్దం. వీరి రచనలు శైలిలో, వర్ణనలో, ప్రాసల ప్రయోగాలలో, పదజాల ప్రయోగంలో పాండిత్య ప్రతిభ కనబర్చి, చివరి దశలో ప్రౌఢకవిగా మారిన వేంకటేశంగారు సాహిత్య చరిత్రకారుల దృష్టికి రాకపోవడం వలన విస్మృత కవిగా మిగిలిపోయాడు.



ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 10 (45) హైదరాబాద్ ఆగస్టు : 2022

# సామాజిక వాస్తవికతకు ప్రతిబింబం – కాలువ మల్లయ్య సాహిత్యం

**డా. వేల్పుల కుమార స్వామి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, నిజాం కళాశాల, ఫోన్ : 90000 56655



**'హితేన సహితం సాహిత్యం'** అని ఆలంకారికులు సాహిత్యానికున్న లక్ష్యాన్ని వివరించారు. సమాజానికి మేలు చేసేదే సాహిత్యం అని దాని అర్థం. సాహిత్యం సమాజానికి మేలు చేయాలంటే దానికి వాస్తవికతనే భూమికగా ఉండాలి. వాస్తవికత అంటే సామాజిక వాస్తవికత. సమాజం అంటే మానవ సంబంధాల సమూహం అని తత్త్వశాస్త్రం చెప్తుంది. కనుక సామాజిక వాస్తవికత అంటే మానవ సంబంధాలలోని వైరుధ్యాల తాలూకు వాస్తవికత. ఆ వాస్తవికతను ఆధారంగా చేసుకొని, అందులోని బహుముఖీనమైన కోణాలను దర్శింపజేస్తూ, సత్యాన్వేషణ, సత్యవివేచన, సత్య నిరూపణ ధ్యేయంగా సృష్టించబడిన సాహిత్యమే గొప్పసాహిత్యంగా చరిత్రలో నిలబడింది. ఇంకాస్త ముందుకెళ్లి చెప్పాలంటే అటువంటి సాహిత్యానికే సార్వకాలీనత, సార్వజనీనత అనే లక్షణాలు ఉంటాయి. విదేశీ సాహితీవేత్తలైన విలియం షేక్స్పియర్, హోమర్, సోఫోక్లిస్, వర్జిల్, మార్క్, డాంటే, ఛాసర్, ఫ్రాంకోయిస్ రాబెలైస్, మిగ్వెల్ సెర్వాంటెస్, జాన్ డొన్నే, జాన్ మిల్టన్, జాన్ బున్యన్, వోల్టేర్, విలయం బ్లేక్, జేన్ ఆస్టిన్, హాన్స్ క్రిస్టియన్ అండర్సన్, చార్లెస్ డికెన్స్, హెర్మన్ మెల్విల్లె, గుస్తేవ్ ఫ్లాబర్ట్, దాస్తోవ్స్కీ, జ్యూల్స్ వెర్నె, లియో టాల్స్టాయ్, ఎమిలి డికిన్సన్, లూయిస్ కార్రల్, జేమ్స్జాయిస్, ఫ్రాన్జ్ కాఫ్కా, ఇలియట్, స్కాట్ ఫిట్జెర్లాండ్, జార్జ్ లూయిస్ బోర్జెస్, జార్జ్ ఆర్వెల్, గాబ్రియెల్ మార్క్వెజ్ మొదలైనవారి సాహిత్యాన్ని ప్రపంచం ఇప్పటికీ స్మరించుకోవడం వారి సాహిత్యంలో ఆ లక్షణాలు ఉండడం గమనించవచ్చు. స్థానికంగా చూసుకున్నప్పుడు తెలుగులో నన్నయ, పాల్కురికి సోమనాథుడు, మల్లికార్జున పండితారాధ్యుడు, తిక్కన, పోతన, ఎఱ్ఱన, శ్రీనాథుడు, శ్రీకృష్ణదేవరాయలు, ధూర్జటి, మొల్ల, వేమన, అన్నమయ్య మొదలు కందుకూరి, గురజాడ, చిలకమర్తి, శ్రీశ్రీ, చలం వరకు, ఆపై ఆధునిక కవులు, రచయితల వరకు వారు సృష్టించిన సాహిత్యంలో కూడా అవే లక్షణాలు కనబడతాయి. గత ఐదు దశాబ్దాలుగా వివిధ సాహిత్య సామాజిక వాదాలు తలెత్తిన తర్వాత వందలాది మంది రచయితలు, కవులు పుట్టుకువచ్చినప్పటికీ కేవలం పదుల సంఖ్యలో పేరెన్నికగన్న సాహితీవేత్తల పేర్లు, వారు సృష్టించిన సాహిత్యమే వర్తమాన సాహిత్య చర్చల్లో ప్రధానంగా వినబడడానికి కూడా అవే కారణాలు కనబడతాయి. స్థూలంగా చూసినప్పుడు సామాజిక వాస్తవికతను భూమికగా చేసుకుని సాహిత్య సృజన చేసినవారే సాహిత్య చరిత్రలో ఆదర్శమూర్తులుగా, వారి సాహిత్యమే కాలాతీత ఆచరణీయమైన విలువలు అందించేదిగా బోధపడుతుంది. ఈ విశ్లేషణా దృక్పథం ఆధునికమే అయినా అన్ని కాలాల, అన్ని ప్రాంతాల సాహిత్యానికీ అన్వయం చేయదగినది.

ఇప్పటివరకు తొమ్మిది వందల కథలు, పదహారు నవలలు, ఆరువందల పైచిలుకు వ్యాసాలు, రెండువందలకు పైగా కవితలు రాసిన ప్రముఖ తెలుగు కవి, రచయిత కాలువ మల్లయ్య సాహితీ ప్రస్థానానికి ఇంతకుముందు చెప్పిన దృక్పథాన్ని అన్వయించి చూసినప్పుడు, ఆయన సాహిత్యంలో కూడా సార్వకాలీనత, సార్వజనీనత అనే లక్షణాలు ప్రస్ఫుటంగా కనబడతాయి. తెలుగు సాహిత్య చరిత్రలో ఇంత విస్తారమైన సాహితీ సంపదను సృష్టించిన రచయితలను వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. ఇది అతిశయోక్తిగా కనిపించినప్పటికీ, సాహిత్య విమర్శ కేంద్రక విశ్లేషణలో ఇదే వాస్తవంగా తేలుతుంది.

కాలువ మల్లయ్య తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లా జూలపల్లి మండలం, తెలుకుంట గ్రామంలో ఓదేలు, పోచమ్మ దంపతులకు జనవరి 12, 1953లో జన్మించారు. తాను పెరిగి పెద్దయ్యే క్రమంలో, తనచుట్టూ ఉన్న సమాజాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకున్నారు. తాను అర్థం చేసుకున్న సమాజాన్నే, ఆ సమాజంలోని వైరుధ్యాల్నే సాహిత్యంగా మలిచారు. సహజంగానే ఆ సాహిత్యంలో వాస్తవికత అనేది మౌలికమైన అంశంగా చోటుచేసుకున్నది. కాలువ మల్లయ్య రాసిన విస్తారమైన సాహిత్యంలో ప్రముఖంగా నిలబడిన 'సాంబయ్య చదువు' అనే నవలలోని వాస్తవికతను విశ్లేషించడమే ఈ పరిశోధనా వ్యాసోద్దేశం.

ఈ నవల మొట్టమొదట 2001లో 'తెలుగు వచనం' ప్రచురణగా వెలువడింది. కాలువ మల్లయ్యగారు జన్మించిన కరీంనగర్ జిల్లాలోని ఒక మారుమూల ఊరిలోని కుటుంబంలో పుట్టిన దళితుడి జీవిత ప్రయాణమే ఈ నవలకు ప్రధాన వస్తువు. 'చదువు నేపథ్యంగా 1940–1986 వరకు తెలంగాణ గ్రామీణ జీవనంలో నెలకొన్న



సామాజిక పరిణామాలను ఈ నవల ప్రతిఫలింపజేసింది. కాలువ మల్లయ్య స్వీయ జీవనం అంతస్సూత్రంగా ఈ నవల రూపుదిద్దుకుంది' అని ప్రముఖ తెలుగు విమర్శకులు బన్న ఐలయ్యగారు ఈ నవల గురించిన అభిప్రాయాన్ని తెలిపారు.

ఈ నవలలోని మౌలికమైన విషయాలను చర్చించే ముందు అందులోని ఇతివృత్తాన్ని పరిచయం చేయడం అవసరం. కరీంనగర్ జిల్లాలో చిలుకయ్య, రాజమ్మలది ఒక దళిత కుటుంబం. వారి సంతానం సాంబయ్య. చిలుకయ్య చదువులేనివాడు. తాను చదువుకోలేకపోయినందుకు, తన జీవితంలో మిగిలిపోయిన లోటును తన కొడుకు ద్వారా అయిన పూరించుకోవాలనుకుంటాడు చిలుకయ్య. అందుకే తన కొడుకైన సాంబయ్యను చదివించాలనుకుంటాడు. తన కోరిక నెరవేరాలంటే ఆ గ్రామంలోని దొర అనుమతి తప్పనిసరి. ఆ ఊరి దొర వెంగళరావు కుటిలబుద్ధితో సాంబయ్య చదువుకోవద్దని, తనదగ్గర పాలేరుగా చేరితేనే మేలని, పైగా అంటరానివాళ్లకు చదువు అనవసరమని చిలుకయ్యకు చెప్తాడు. కానీ చిలుకయ్య మనసులో తీరని కోరిక సలుపుతూనే ఉంటుంది. కాబట్టి ఆయన తన కొడుకును ఊళ్లోనే ఉన్న పాఠశాలలో చేర్పిస్తాడు. భారతీయ సమాజం నిచ్చెనమెట్ల కులసమాజం కాబట్టి, అందులో మానవీయతకు అసలు చోటే లేదు కాబట్టి, సహజంగానే పాఠశాలలో చేరిన సాంబయ్య అనేక కుల అవమానాలను చవిచూస్తాడు. అయినా తండ్రి కోరికతోపాటు, తనలో ఉన్న పట్టుదలతో చదువును ఆపేయాలని మాత్రం అనుకోడు. పైపెచ్చు విద్యపట్ల తనకున్న అకుంఠితమైన పట్టుదలతో శ్రద్ధగా చదువును కొనసాగిస్తాడు. ఆఖరికి, తన ఊరి పెద్దకులాల పెద్దలు, వారి పిల్లలను సాంబయ్యతో చనువుగా మెలగమనే స్థితికి సాంబయ్య ప్రతిభ ఎదుగుతుంది. సాంబయ్య పాఠశాల విద్య పూర్తవుతుంది. ఇంటర్‌మీడియెట్‌లో చేరుతాడు. సరిగ్గా అదే సమయంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర నిర్మాణోద్యమం మొదలవుతుంది. చదువంటే అమితమైన ప్రేమ కలిగిన సాంబయ్య ఆ ఉద్యమానికి దూరంగా ఉన్నప్పటికీ, అది ఉద్యమం కనుక, దాని ప్రభావం సహజంగానే సమాజం మీద పడుతుంది కనుక దానివల్ల సాంబయ్య పరోక్షంగా ప్రేరేపితుడూ, చైతన్యవంతుడూ అవుతాడు. అదే కాలంలో ఉత్తర తెలంగాణలో మొదలై బలపడే క్రమంలో ఉన్న విప్లవోద్యమంచేత ఆకర్షింపబడినా, తన కుటుంబ పరిస్థితులవల్ల ఉద్యమంలో పాలుపంచుకోకుండా చదువును కొనసాగిస్తాడు. తనతో తిరిగే మిత్రులు, విప్లవోద్యమంలో పనిచేస్తున్నవాళ్లు తనమీద ఎంత ప్రభావం వేస్తున్నప్పటికీ తన లక్ష్యానికి దూరం కాడు. పట్టుదలతో, క్రమశిక్షణతో డిగ్రీ పూర్తి చేస్తాడు. కుటుంబంలో నానాటికీ పెరుగుతున్న ఆర్థిక ఇబ్బందులు, మరోవైపు ఒత్తిడిలో సాంబయ్య నిరుద్యోగిగా ఉన్నప్పుడే తల్లిదండ్రుల ప్రోద్బలంతో పెళ్లి చేసుకుంటాడు. ఆ తర్వాత రెండు నెలలకే 'హాఫ్ ఎ మిలియన్ స్కీమ్' కింద టీచర్ ఉద్యోగం వస్తుంది. ఎన్నో కలలతో పై చదువులు చదివిన సాంబయ్యకు టీచర్ ఉద్యోగం రావడం సంతృప్తిగానే ఉంటుంది. తను అనుకున్న ఉద్యోగం వచ్చినందుకు సంతోషం అనిపిస్తుంది. కానీ సమాజంలో నాటుకుపోయిన 'బతకలేనివాడు బడిపంతులు' అనే నానుడి వినిపిస్తూ తన చుట్టూ ఉన్నవాళ్లు సాంబయ్యను ఎగతాళి చేస్తారు. మరోవైపు మంచి చదువు ఉందికదా, పెద్ద ఉద్యోగం తప్పక వస్తుందని ఆశపడి పెళ్లి చేసిన భార్య తరపువాళ్లు కూడా అదే అభిప్రాయాన్ని కలిగి ఉంటారు. కట్టుకున్న భార్య కూడా ఉపాధ్యాయ వృత్తి మాని వేరే ఉద్యోగం చేయమని వత్తిడి తెస్తుంది. తప్పనిసరి పరిస్థితుల్లో తాను వేరే ఉద్యోగం చూసుకోవాల్సిన అగత్యం ఏర్పడుతుంది. అదే సమయంలో కేంద్రప్రభుత్వ యాజమాన్యంతో గోదావరిఖనిలో మందుల ఫ్యాక్టరి నిర్మాణమవుతుంది. అందులో సాంబయ్యకు కొలువు దొరుకుతుంది. ఆ తర్వాత, తనను చదివించి ఇంత మంచి స్థానంలో నిలబెట్టిన తన తల్లిదండ్రుల్ని తన దగ్గరికి తెచ్చుకోవాలని అనుకుంటాడు. ఇంకొకవైపు విప్లవోద్యమం విస్తరిస్తూ గ్రామాల మీద పట్టు సాధిస్తుంది. దాంతో అంటరానివాళ్ల జీవితాల్లో పెనుమార్పులు సంభవిస్తాయి. అప్పటిదాకా అనేక అవమానాలు, అణచివేతలు ఎదుర్కొన్న ప్రజానీకం ఆత్మగౌరవంతో ధిక్కార జీవితాలను మొదలుపెడతారు. విప్లవోద్యమ ప్రభావానికి వ్యతిరేకంగా ఏలికలు ఆ ఉద్యమాన్ని నీరుగార్చాలని, ఆ ఉద్యమానికి భూమికగా ఉన్న

ఊర్లపై తీవ్రమైన అణచివేతను ప్రయోగిస్తారు. విప్లవశక్తులు, పోలీసుల మధ్య ప్రతినిత్యం దాడులు, ప్రతిదాడులు తీవ్రమైపోతాయి. కళ్లముందటి సామాజిక సంఘర్షణ నుండి తన గతాన్ని పునరవలోకించుకుంటాడు సాంబయ్య. ఎన్నో సంఘటనలు, ఎన్నో ప్రభావాలు సాంబయ్యను విప్లవోద్యమంవైపు లాగుతున్నా, తన లక్ష్యం మాత్రం అతనిలో స్థిరంగా ఉంటుంది. అయినప్పటికీ ఉద్యమాలు సమాజానికి మేలు చేస్తాయా, కీడు చేస్తాయా అనే మీమాంస మాత్రం అతనిలో రగులుతూనే ఉంటుంది. తన ఊళ్లో ఒకనాడు అనేక అణచివేతలకు గురైన కుటుంబాల్లోని యువతరమే నేడు విప్లవోద్యమానికి నాయకత్వం వహిస్తున్న సన్నివేశాన్ని, వాటన్నిటికీ దూరంగా ఉన్న తననూ పోల్చుకునే ప్రయత్నం చేస్తాడు. పేద దళిత కుటుంబం నుండి దిగువ మధ్యతరగతికి ఎదిగిన సాంబయ్య మట్టితో పెనవేసుకుపోయిన సంబంధాన్ని విడిచిపెట్టలేని తన తల్లిదండ్రులను ఊళ్లోకే వెళ్లి చూసొస్తుంటాడు. మారిన సామాజిక స్థితిగతుల మధ్య, లోకం నిర్ణయించిన విలువల చట్రంలో తన కుటుంబాన్ని వెళ్లదీస్తుంటాడు. ఇదే ఈ నవలా ఇతివృత్తం.

కరీంనగర్ జిల్లాకు చెందిన ఒక మనిషి చదువు, ఉద్యోగం, జీవిత ప్రస్థానమే ఈ నవలరూపంలో కనిపించినా అనేక సందర్భాలూ, సన్నివేశాలూ, వైరుధ్యాలూ చిత్రించబడ్డాయి. వాటిలో ముఖ్యమైన అంశాల గురించి రచయిత చిత్రించారు.

చరిత్ర, సాహిత్యం పరస్పర పరిపూరకాలు. సాహిత్యంలోని విశేషాల ఆధారంగా చరిత్రను వాస్తవికంగా నిర్మాణం చేయడానికి, చరిత్ర ఆధారంగా సాహిత్యాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేయడానికి పరస్పరం ఉపయోగించుకుంటాయి. ఈ నవలలోని ఒక విషయం చారిత్రక ఆధారాల్ని పట్టి ఇస్తుంది.

1946లో తెలంగాణలో ప్రారంభమైన రైతాంగ సాయుధ పోరాటంనాటి విషయాలను గురించి చరిత్రలో నమోదైన విషయాల్లో భిన్నత్వం కనిపిస్తుంది. పటేల్ సైన్యం నిజాంను, ఆయన ప్రైవేట్ సైన్యమైన రజాకార్లను అణచడానికే సైన్యాన్ని పంపిందని, ఆపరేషన్ పోలో జరిపింది అందుకే అనే వాదన ఒకటుంది. దాని పునాదిగానే 1948, సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినంగా జరిపేవారున్నారు. మరోవైపు కమ్యూనిస్టుల (ఆంధ్రమహాసభ పేరుమీద) పోరాటాన్ని అణచడానికే ఆపరేషన్ పోలో జరిగిందని చెప్పే మరొక వాదన ఉంది. వాస్తవానికి ఆనాటి పోరాట విషయాలను తర్వాతి కాలంలో భిన్నమైన దృష్టికోణాల్లో చూసినవాళ్లు, రాసినవాళ్లు ఉన్నారు. అయితే వాస్తవాలను తెలుసుకోవడానికి ఈ నవలలోని ఒక విషయం దోహదం చేస్తుంది. "'మొత్తం మీద కమ్యూనిస్టు కొట్లాడితేనే రజాకార్ల పీడన పోయింది.' 'అల్లతోనేం తియ్యి... పటేలు మిల్ట్రి రాకుంటే వీళ్లను తుక్కుతుక్కు జేసెటోల్లు రజాకార్లు'. 'పటేలే సైన్యం పంపింది రజాకార్లనణిచే పేరు మీద కమ్యూనిస్టోల్లను



చంపడానికి. అప్పటికే వీళ్ళు భూములు పంచిండ్రు. అట్లనే ఉంటే దొరల పట్టు పోతుందని వాళ్లనణచేసింద్రు. ఎంతమంది దొరలు ఊళ్లిడిసి పోలేదు?"(మల్లయ్య, కాలువ. సాంబయ్య చదువు. పుట. 133). ఈ మాటల ద్వారా ఆనాటి చరిత్రను అంచనా కట్టవచ్చు. నిజానికి ఆనాడు నిజాం ప్రభుత్వానికి లొంగిపోయిన తర్వాత కూడా పోలీసు సైన్యం తన పనిని కొనసాగించింది. ఆ కొనసాగింపు కమ్యూనిస్టుల కోసమేనన్నది ఈ నవల ద్వారా అర్థమయ్యే విషయం.

సుప్రసిద్ధ విప్లవకవి వరవరరావు పరిశోధనా గ్రంథంలో ఇట్లా ఉంది. "యూనియన్ సైన్యాలు ప్రవేశించిన వారం రోజుల లోపుగానే నిజాం నవాబు లొంగిపోయాడు. సంస్థానంలో యూనియన్ మిలిటరీ ఆధిపత్యంలో సైనికపాలన ఏర్పడింది. పారిపోయిన జమీందార్లు, జాగీర్దార్లు, దేశముఖులు యూనియన్ సైన్యాలతోపాటు గ్రామాల్లోకి ప్రవేశించారు. శత్రువైన నిజాం రాజ్యం కూలిపోయింది. కనుక ప్రజలు పంచుకున్న భూములు, పశువులు, భూకామందులకివ్వాలని, తర్వాత కాంగ్రెసే భూములను పంచుతుందని కాంగ్రెసు ప్రచారం చేసింది. గ్రామరాజ్యాలను గుర్తించి, ప్రజలు పంచుకున్న భూములు ప్రజలకే ఇవ్వాలని కమ్యూనిస్టు పార్టీ ప్రతిపాదించింది. మిలిటరీ ప్రభుత్వం ఈ కనీస కోర్కెలను కూడా తిరస్కరించి కమ్యూనిస్టులపై పెద్దఎత్తున దాడులకు పూనుకున్నది" (వరవరరావు. తెలంగాణా విముక్తి పోరాటం – తెలుగు నవల. పుట. 37). వరవరరావుగారి పరిశోధనా గ్రంథంలోని ఈ మాటలు, ఈ నవలలో చెప్పబడిన విషయాలు సరిపోలుతున్నాయి. దీని ఆధారంగా ఆనాటి ప్రజల పోరాటాన్ని అణచివేయడం ప్రధాన లక్ష్యంగా, నిజాంను గద్దె దింపడమన్నది అప్రధాన లక్ష్యంగా ఆనాటి పోలీసు చర్య ఉద్దేశించబడినది అని అర్థం అవుతుంది. ఎందుకంటే 1947 నవంబర్‌లోనే భారత ప్రభుత్వం నిజాంతో నీ సంస్థానంలోని ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోమని యథాతథ ఒడంబడిక చేసుకుని ఉన్నది గనుక.

తెలంగాణలో భూస్వామ్యం ఉందని, అది కూడా అగ్రకుల భూస్వామ్యం అని చరిత్ర చెబుతుంది. అంటే దీనర్థం భూమి పరమైన ఆర్థిక విషయంతోపాటు, సాంఘికమైన కుల అణచివేత కూడా



తెలంగాణలో ఉన్నదని. ఈ విషయాన్ని 'సాంబయ్య చదువు' నవలలో చిత్రించారు. "ఛీ నీయవ్వ! మాదిగిండ్లకెల్లచ్చిన. కాళ్ళకు చెప్పులెవ్వని ఎన్నిసార్లు చెప్పినా తేకపాయె లింగడు. బట్టపేలికలు బజార్లనే పారేసిరి. కాలుకు తగిలింది. పెయ్యి కడుక్కోవాలె' అన్నాడు" (మల్లయ్య, కాలువ. సాంబయ్య చదువు. పుట. 138). ఈ మాటలు ఆనాడు కులవ్యవస్థ ఎంత బలంగా ఉన్నదో తెలియజేస్తాయి. నిజానికి కుల వ్యవస్థ పుట్టుక అగ్రకులాల చేత సృష్టించబడినా ఆ తరువాత అదొక భావజాలంగా మారిన తర్వాత అన్నికులాలకూ వ్యాపించింది. నిజానికి ఈ నవలలో వెనుకబడిన తరగతికి చెందిన లచ్చుమయ్య అన్నమాటలు ఇవి. ఒక వెనుకబడిన కులానికి చెందిన వ్యక్తికి కులం ఒక భావజాలంగా సమాజం నూరిపోసింది. సమాజంలో ఆ భావన నిలిచి ఉండడానికి భూస్వామ్యం తోడుగా నిలిచింది. తెలంగాణలో నాడు దొరలంతా అగ్రకులాలకు చెందినవారే కనిపించడం ఈ విషయాన్ని ధృవీకరిస్తుంది.

ఈ నవలలో మరోచోట క్షవరం చేసే దగ్గర కూడ కులాన్ని ఎలా పాటిస్తారో వివరించబడింది. "ఏం జేసుడే చిలుకన్న... అందరికి నేసినట్టు కాదుగద... ఈల్లకు సవురం జేయన్నంటె ధోతిడిసి గొంగడి కట్టుకోవన్నాయె... ఇగో భాగోతమిగ'. 'ఇప్పుడు గూడ గవన్నేంది? టేలాలల్ల ఏ కులమని సూత్తాండ్రా?' 'కస్సూరు సంగతులు గీ పల్లెలల్ల నడువయి... పోచాలు హొటల్ల గాలాసలు వేరే పెడుతరు' అని అంగీ విడిచేసాదు నర్సయ్య. గొంగళి కట్టుకుని ధోతి కూడ విడిచేశాడు. అక్కన్నుంచి పీట తీశాడు. బజాట్లో కూచోపెట్టి లింగయ్యకు క్షవరం చేస్తున్నాడు నర్సయ్య. హరిజనులకు క్షవరం చేసుటప్పుడు గొంగళి కట్టుకుని చేయడం చాలా కాలంగా ఉంది. ఉన్నికి ముట్టుండదని, నూలువైతే మైలపడతాయని వాళ్ళ నమ్మకం"(మల్లయ్య, కాలువ. సాంబయ్య చదువు. పుట. 145). ఈ మాటలు కూడా తెలంగాణలో ఉన్న కులవ్యవస్థ రూపాన్ని బట్టబయలు చేస్తాయి. నిజానికి ఇక్కడ కూడ వెనుకబడిన మంగలి కులస్థులు కూడ దళితుల పట్ల ఎటువంటి కుల వివక్షను కలిగి ఉన్నారో తెలుస్తుంది.

నిరక్షరాస్యులైన ప్రజలు కులాన్ని పాటించడం ఏదో ఒక స్థాయిలో అర్థం చేసుకోవచ్చు. వారి చైతన్యస్థాయినిబట్టి అది సహజమని కూడా అనుకోవచ్చు. కానీ చదువుకున్న, చదువుచెప్పే అగ్రవర్ణ ఉపాధ్యాయులకు కూడా ఎంతటి అగ్రకులాధిపత్యం ఉండేదో కూడ ఈ నవలలో చిత్రించారు. "శర్మగారు హిందీ పండిట్... అతడు కులాలు, మతాలు, తరతమ భేదాలు అన్ని దైవనిర్మితాలని, మనకు జన్మలు మన పూర్వజన్మల కర్మలను బట్టి వస్తాయని చెప్పేవాడు. అతడు బాల్యవివాహాలను కూడా సమర్థించేవాడు. ఒకరికొకరు పొంతన లేకుండా చెబుతుంటే సాంబయ్యలో రకరకాల సంఘర్షణలు కలిగేవి. అంటరానితనం ఉండకూడదని గాంధీ తప్పుచేశాడని శర్మ చెప్పేవాడు. ఓరోజు పాఠం చెబుతూ మధ్యలో ఇలా చెప్పసాగాడు శర్మ. 'బ్రాహ్మణులు బ్రహ్మ ముఖంలోంచి పుట్టారు. భుజాల్లోంచి క్షత్రియులు పుట్టారు. వైశ్యులు ఉదరంలోంచి పుట్టారు. పాదాల్లోంచి శూద్రులంతా పుట్టారు. వీటినే నాలుగు వర్ణాలుగా విభజించడం జరిగింది. ప్రస్తుత కాలంలో ఈ వర్ణాలనిలా చెప్పవచ్చు. బ్రాహ్మణులు బుద్ధిజీవులు.. అంటే బుద్ధినుపయోగించి బతికేవారు...క్షత్రియులు ఆయుధజీవులు... ఆయుధాలు ధరించి దేశరక్షణ భారాన్ని, పరిపాలనా భారాన్ని మోసేవారు. వైశ్యులు వ్యాపారజీవులు... వ్యాపారాన్ని వృత్తిగా చేసుకుని బతికేవారు... శూద్రులు శ్రమజీవులు... పంటలు పండిస్తూ, ఇతర పనులు చేస్తూ బతికేవారు... కులాలన్నీ భగవంతునితో ఏర్పాటు చేయబడ్డవే"(మల్లయ్య, కాలువ. సాంబయ్య చదువు. పుట. 165). ఈ మాటలు పాఠశాలల్లో కులం ఎటువంటి పాత్రను కలిగిఉన్నదో తెలియజేస్తుంది. దేశభవిష్యత్తు తరగతిగది నాలుగు గోడల మధ్య నిర్మాణమవుతుందని ఆంగ్ల విద్యావేత్త మెకాలె చెప్పాడు. అటువంటి ప్రాముఖ్యత కలిగిన పాఠశాలలో ఉపాధ్యాయులు, సమాజ పురోగమనానికి బాటలు వేయవల్సినవారు ఎంతటి దుర్మార్గమైన రీతిలో అగ్రకుల ఆధిపత్యాన్ని బోధించేవారో ఈ నవల తెలియజేస్తుంది.

ఏ కాలంలోనైనా ఉద్యమాలు సమాజంలోని అసమానతలవల్లనే వస్తాయి. సమాజంలో వివిధ రకాలైన ఆధిపత్యాలనుండి, అవమానాల నుండి, అనివార్యమైన పరిస్థితుల నుండే ఉద్యమకారులు ఉద్భవిస్తారని ఈ నవలలోని విషయాలు ప్రతిపాదిస్తాయి. "ఎంతో అమాయకులనుకున్న వాళ్ళు చాకలి బక్కమ్మ కొడుకులాంటివాళ్ళు అలాంటి ఉద్యమాలకు నాయకత్వం వహిస్తున్నారని తెలుసుకొని

ఆశ్చర్యపోయాడు సాంబయ్య" (మల్లయ్య, కాలువ. సాంబయ్య చదువు. పుట.228). చాకలి బక్కమ్మ ఊరి పెద్దల చేత అన్యాయంగా, అక్రమంగా గ్రామం నుండి బహిష్కరింపబడిన అబల. లేని ఆరోపణలు ఆమె మీద వేసి ఆమెను వెలేస్తారు. తర్వాతి కాలంలో ఆమె కొడుకే విప్లవోద్యమంలో చేరి నాయకత్వ స్థానానికి ఎదుగుతాడు. తనతల్లి మాత్రమే కాదు, ఎందరో ప్రజలు గ్రామాల్లోని దొరల అరాచకాలకు బలైపోతున్నారని, సకల ఆధిపత్యాలు నశించాలంటే ఉద్యమంలో చేరడమే మార్గమని నమ్మి అందులో చేరిపోతాడు. నిజానికి నవలలో ప్రస్తావించబడిన ఉద్యమ నాయకులంతా పూర్వం తమ తమ జీవితాల్లో అన్యాయాలకు గురైనవాళ్లే. దీన్ని బట్టి ఆనాడు ఉత్తర తెలంగాణలో మొదలైన ఉద్యమం దొరల, భూస్వాముల ఆధిపత్యాల నుండే ఉద్భవించిందని తెలుస్తుంది.

ఈ నవలలో బక్కమ్మ విషయంలో జరిగిన పంచాయితీ దొరల దౌర్జన్యాలకు మచ్చుతునక. ఆమె భర్త మరణించిన తర్వాత మేనబావ కొంరయ్యను ప్రేమిస్తుంది. శారీరకంగా ఒక్కటవుతారు. కానీ పెళ్లి చేసుకోరు. వారి ప్రేమ ఫలితంగా బక్కమ్మ గర్భవతి అవుతుంది. ఇద్దరు పెళ్లి కూడ చేసుకోవడానికి సిద్ధపడతారు. కానీ అనవసరంగా దొర వెంగళరావు పంచాయితీ పెట్టి, మూడువందల రూపాయల జరిమానా, బక్కమ్మకు గ్రామ బహిష్కరణ శిక్ష వేస్తారు. ఆ సందర్భంలో కోపోద్రిక్తుడైన కొంరయ్య దొర వెంగళరావుతో "అయితే మీ కొడుకు తెనుగు నర్సయ్య బిడ్డను పాడుజేసిండు. దానికేం దండుగగడ్తరో జెప్పుండ్రి"(మల్లయ్య, కాలువ. సాంబయ్య చదువు. పుట.140) అంటాడు. దానికి దొర కొంరయ్యను పంచెలతో వేపచెట్టుకు కట్టి గొడ్డును బాదినట్లు బాది, రాత్రి మొత్తం అలాగే కట్టి ఉంచండి అని ఆదేశించి వెళ్లిపోతాడు. సామాన్యులకు ఒకరీతి, దొరలకు ఒక నీతి, ఇదేమిటి అని ప్రశ్నించిన కొంరయ్యకు దొర విధించిన శిక్ష అది. నిజానికి ఆనాటి దొరల ఆగడాలకు ఇదొక మచ్చుతునక అని చెప్పవచ్చు.

ఈ నవలలో తెలంగాణలో ప్రత్యేక రాష్ట్రం కోసం 1969లో నడిచిన ఉద్యమాన్ని గురించి వర్ణించారు. ఆనాటి చరిత్రను గురించి 21 శతాబ్దంలో మాట్లాడుతున్న చాలామంది అబద్ధాలను, అసత్యాలను ప్రచారం చేస్తున్న సన్నివేశం కనిపిస్తుంది. ఉద్యమం కేవలం ఉద్యోగుల సృష్టి అనీ, అది కేవలం కొందరి స్వార్థ ప్రయోజనాల ఉద్దేశితమని, గ్రామీణ ప్రాంతాల్లో అసలు ప్రత్యేక తెలంగాణ భావన లేదని ప్రచారం చేస్తున్న కాలం కనిపిస్తున్నది. ఇప్పటి ప్రచలిత వాదనలు తప్పని, చరిత్ర మరోలా ఉన్నదని ఈ నవలలోని ఆధారాలు నిరూపణకు దోహదం చేస్తున్నాయి. "ఈ మధ్య 'జై తెలంగాణ' ఉద్యమం ప్రారంభమైంది. మొదట్లో పట్టణాలకే పరిమితమైన ఉద్యమం క్రమక్రమంగా గ్రామాల్లోకి వ్యాపించింది. పాఠశాలలు మూసివేయాలని అల్లరి ప్రారంభమైంది. ఇందులో లాయర్లు, ఇంజనీర్లు, రాజకీయ నాయకులు, డాక్టర్లు అంతా పాల్గొంటున్నారు.....చాలాకాలంగా తెలంగాణాకు అన్యాయం జరుగుతోంది. మొదట్నుంచీ అభివృద్ధి చెందిన కోస్తా...వీళ్ళే రాజకీయాధికారం చేతుల్లో పెట్టుకొని వాళ్ల ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుంటున్నారు... మనకు రావాల్సిన నిధులను అటు మర్లించుకుంటున్నారు. ఉద్యోగాల్లోనూ మనకన్యాయమే జరుగుతుంది. కోస్తానుంచి ఎంతోమంది వచ్చి మన దగ్గర ఉద్యోగాలు చేస్తున్నారు. అందువల్ల మనవాళ్లకుద్యోగాలు దొరకడం లేదు. ఈ ప్రాంతం కానివాళ్లను ఇక్కణ్ణుంచి తరిమివేయాలి. అది ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడే సాధ్యమవుతుంది. జై తెలంగాణ... జైజై తెలంగాణ..."(మల్లయ్య, కాలువ. సాంబయ్య చదువు. పుట.187). ఈ మాటల ద్వారా ఆనాడు తెలంగాణ ఉద్యమ తీవ్రతను తెలుసుకోవచ్చు. దాని వ్యాప్తినీ అంచనా కట్టవచ్చు. అయితే ఉద్యమ సందర్భంలో విచక్షణ కోల్పోయి ఆవేశకావేశాలలో కొన్ని అప్రజాస్వామికమైన మాటలు కూడా దొర్లుతాయనేది కూడ 'ఈ ప్రాంతం కానివాళ్లను ఇక్కడినుంచి తరిమివేయాలి' వంటి మాటల ద్వారా అర్థం చేసుకోవచ్చు. అయితే దానిని మరోకోణంలో సంవత్సరాల వివక్ష, అణచివేతల నుండి పెల్లుబికే ఆవేదనలో భాగంగా అర్థం చేసుకున్నప్పుడే విషయం వివరంగా బోధపడే అవకాశం ఉంటుంది.

స్థూలంగా ఈ నవలా వస్తువులోని అంశాలివి. ఒకవైపు కటిక పేదరికం, మరోవైపు విద్యమీద ప్రేమ, మరోవైపు అశాస్త్రీయ విద్యావిధానం, కుల అసమానతలు, దొరల దౌర్జన్యాలు, కరువు – మరోవైపు విప్లవోద్యమం నిర్వహిస్తున్న పోరాటం, 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, ప్రజల్లో వచ్చిన చైతన్యం ఈ నవలలో చిత్రితమయ్యాయి. ఈ నవల దాదాపు తెలంగాణ రైతాంగ సాయుధపోరాట కాలం నుంచి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో జరిగిన జగిత్యాల జైత్రయాత్ర కాలందాకా మూడు నాలుగు దశాబ్దాల ఉత్తర తెలంగాణ గ్రామ జీవితాన్ని, అందులోని మార్పుల్ని ఒక కుటుంబాన్ని నమూనాగా తీసుకొని చిత్రించింది.

ఈ నవలలో పాత్రోచిత సంభాషణ కనిపిస్తుంది. ఆ సంభాషణల్లో కూడా చక్కటి తెలంగాణ నుడికారం ప్రయోగించబడింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు మాట్లాడుకునే భాష, ఆ భాషలోని సొబగులు, నానుడులు, నుడికారాలు చక్కగా వాడారు రచయిత. ఏ రచనకైనా రచనలోని పాత్రల సొంతభాష ఉండడమనేది సజీవ చిత్రణకు మిక్కిలి దోహదం చేస్తుంది. మనిషి ఆత్మను పట్టియిస్తుంది.



## 75 వ భారతస్వాతంత్ర్యోత్సవమును పురస్కరించుకొని పంచ కంద పద్యాంజలి !!!

భీతిల్లకపోరాడిరి
స్వాతంత్ర్యముకొరకునాంగ్ల సామ్రాట్టులతో
జాతిని జాగృత పరచియు
ఖ్యాతిని పొందిరి ముదముగ ఘననేతలిలన్!!

దేశమునేప్రేమించిరి
దేశముకై ప్రాణములను దేదీప్యముగన్
దేశముకై యర్పించియు
దేశస్సేవయెహితమనితెలిపిరిమనకున్!!!

తలతును మహనీయులనే
కొలుతును నామనమునందు కూర్మిగనెపుడున్
విలువగు స్వాతంత్ర్యఫలసు
ధలు వరముగనొసగినట్టి ధార్మికవరులన్!!!

దండము భారతమాతకు
దండము మహనీయ త్యాగధనులకుజేతున్
దండము భారతజనులకు
దండము జెండాకు జేసి, ధరపై నిలుతున్!!!

భారతమాతాకీజై!
భారతదేశపు విలువల ప్రగతికి జైజై!
భారతకీర్తికి జైజై!
భారతసత్సాంప్రదాయ పద్ధతులకు జై!!!

**కట్ల రంజిత్ కుమార్**
తెలుగుఉపన్యాసకులు, సిద్ధిపేట
చరవాణి :- 6300474467

## మరణం

విధి అంటుగట్టిన చీకటి మొక్కకు
పూసిన ఓ ... చేదు పుష్పమా...
మరణమా.... కర్కశ హృదయ పాషాణమా ...
మరణమా ... ప్రాణాలను హరించే మంత్ర
దండమా..

బంధాల ముంగిళ్ళ రక్త రంగవల్లివి
ఆనంద సాగరాన విషగుళికవి
వ్యథ వడగాలుల రాగానివి
గుండె కోతల నిశ్శబ్ద యుద్ధానివి
బ్రతుకు వెంట నడిచే అదృశ్య పిశాచివి
ఓ ... మరణమా...

సృష్టి కల్పక రాచపుండువి
ప్రాణికోటి పాలిట ప్రళయ భూకంపానివి
యుగయుగాల సజ్జనుల మింగి కూర్చున్న
గండభేరుండాగ్రహానివి
ప్రేమాభిమానాలెరుగని
కాలాగ్ని మంటపానివి

ఓ ... మరణమా ...
జన్మమెంత సంబరమో
నీ కర్మమంత కాఠిన్యమో ...
దుఃఖ మెత్తుకున్న కన్నులు
ఎడారి ఎండమావులైన
ఆకాశమంటిన వేదనలు
అహోరాత్రులు జ్వలించిన
నీ చూపు నీ దారేగా....
ఓ ... మరణమా ...

**డా. కందుల శ్రీను**
నల్లగొండ
ఫోన్ : 965 267 4834

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 10 (51) హైదరాబాద్ ఆగస్టు : 2022

# అమ్మంగి సహృదయ సాహిత్య విమర్శ – విహంగ వీక్షణం

**గడ్డమీది మల్లేశం,** పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఉ.వి. ఫోన్ : 709 5252 232

ఆధునిక సాహితీ వనంలో విభిన్న ప్రక్రియలలో రచనా వ్యాసంగం కొనసాగించి తనకంటూ ఒక గుర్తింపు సంపాదించుకున్న అమ్మంగి వేణుగోపాల్ గారిని తెలంగాణ సాహిత్య విమర్శకులలో ఒకరిగా చెప్పుకోవాలి. రచయితగా, పరిశోధకుడుగా, విమర్శకుడిగా, అనువాదకుడిగా ప్రసిద్ధి పొందిన అమ్మంగి వేణుగోపాల్ జనవరి 20, 1948వ సంవత్సరంలో వికారాబాదు జిల్లాలోని, ఆలంపల్లి గ్రామంలో రుక్మిణమ్మ, మదనయ్య అనే దంపతులకు జన్మించారు.

పదిహేను ఏళ్ళకే రచనా వ్యాసంగంలో అడుగు పెట్టిన అమ్మంగి ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన గౌరవ పురస్కారాలు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే ప్రతిష్ఠాత్మకమైన కాళోజీ నారాయణరావు పురస్కారం అందుకున్న తొలి రచయిత అమ్మంగి వేణుగోపాల్.

విమర్శకుడిగా అమ్మంగి వేణుగోపాల్ గారు తన విమర్శనాత్మక శక్తికి రోజు రోజుకూ పదును పెడుతూ సహృదయ విమర్శకుడిగా తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో సాహిత్య విమర్శ ఒక పెద్దవ్యవస్థగా పరిణామం చెందింది. తెలుగు సాహిత్యంలో కూడా ప్రాచీన, ఆధునిక సాహిత్యాలను గురించి శాఖోపశాఖలుగా విమర్శలు వస్తూనే ఉన్నాయి. అయితే సాహిత్యం, సాహిత్య సిద్ధాంతాలు, సామాజిక సూత్రాల మీద తగుమాత్రం అవగాహన అధికారం ఉన్నవారు మాత్రమే విమర్శకులుగా చలామణి అవుతారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో విమర్శకులు చాలామంది ఉన్నా సాహిత్య సృజనకు దీటుగా మాత్రం విమర్శలు రావడం లేదని భావించి విమర్శారంగంలోకి అడుగుపెట్టారు అమ్మంగి. వారిలో ఉన్న విమర్శ సాహిత్య సృజనను పాఠకలోకానికి పరిచయం చేయడమే తన కర్తవ్యంగా అమ్మంగి తన విమర్శను కొనసాగిస్తున్నారు.

ఒక గ్రంథంలోని ఔచిత్య, అనౌచిత్య విషయాలను, ధ్వని విశేషాలను, శయ్యా సౌభాగ్యాలను, వస్తు నిర్మాణ సౌష్ఠవాన్ని, పాత్రపోషణ, సన్నివేశ కల్పనలు మొదలైన గ్రంథంలోని సర్వవిషయాలను కూలంకుషంగా చర్చించి సాహిత్యంలో ఆ గ్రంథానికి ఉన్న స్థానాన్ని నిర్ణయించడాన్ని సాహిత్య విమర్శగా పేర్కొనవచ్చు. అలాగే లౌకికాలైన దేశ, కాల, వ్యక్తిత్వాలకు దూరంగా ఉండే విషయ చర్చ కూడా విమర్శగా పరిగణించవచ్చు. వీటన్నిటినీ పరీక్షించిన తరువాతనే విమర్శకుడు ఒక గ్రంథాన్ని లేదా కావ్యాన్ని సమీక్షించేందుకు పూనుకుంటాడు. ప్రతి విమర్శకునికి ప్రధానంగా ఉండాల్సిన లక్షణం సహృదయత. సహృదయత అంటే వైయక్తికమైన ప్రశంసలకు, స్వీయ వ్యక్తిత్వానికి, పక్షపాతాలకు గురి కాకుండా



రచయిత పయనించిన బాటలోనే ప్రయాణించి రచనలోని సౌందర్యాత్మకమైన విషయాలను వెల్లడించి పాఠకుల హృదయాలలో భావానుభూతిని కలిగించడం. సహృదయత ప్రగాఢంగా గల సాహిత్య విమర్శకుడు ఏ సందర్భంలో కూడా స్వీయ ఆవేశాలకు లోనుకాకుండా సమతౌల్యంతో భావావేశ రాహిత్యంగా తన విమర్శను కొనసాగిస్తాడు. ఆ విమర్శ దేశ, కాల, వ్యక్తిత్వాలకు అతీతంగా సాగే సద్విమర్శగా గుర్తింపు పొందుతుంది.

కవి తన అనుభవాల్ని కార్యరూపంలో ఉంచితే, సహృదయ విమర్శకుడు దాన్ని పరామర్శించి కావ్యంలో కవి నిక్షేపించిన శిల్పాన్ని గుర్తించి పాఠకుల చెంతకు చేరుస్తాడు. ఇంకా చెప్పాలంటే సహృదయ విమర్శకుడు అనేవాడు కావ్యంలోని భావానుభూతిని పొంది, ఆ అనుభూతికి ఆధారమైన కావ్యగత శిల్ప విషయాలను పరామర్శ చేస్తాడు. ఈ లక్షణాలన్నింటిని పరిశీలించిన అమ్మంగి 1967లో సమీక్షలతో విమర్శ రంగంలో అడుగుపెట్టారు. "నవలా రచయితగా గోపీచంద్" (1988) అన్న సిద్ధాంత గ్రంథంతో పరిశోధన రంగంలోకి ప్రవేశించారు. విమర్శకు సంబంధించినంత వరకు 'అవినాభావం' (1990) వారి తొలి విమర్శనా గ్రంథం. అనంతరం 'గోపీచంద్ జీవితం–సాహిత్యం' (2010) శత జయంతి నివాళి మోనోగ్రాఫ్, 'సాహిత్య సందర్భం సమకాలీన స్పందన' (2012), వట్టికోట ఆళ్వారుస్వామి రచనలు – ఒక పరిశీలన (2014), సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం (2018) అన్న వ్యాస సంపుటులను ప్రచురించారు.

పైన తెలిపిన విమర్శనా గ్రంథాలను గురించి వివరించడం అనేది ఒక పరిశోధన సిద్ధాంత గ్రంథం అవుతుంది. అందుకే "సహృదయ సాహిత్య విమర్శ-వైవిధ్యం" (2018) అన్న సాహిత్య విమర్శ వ్యాస సంపుటిని గురించి మాత్రమే చర్చించదలచాను. ఈ వ్యాస సంపుటిలో మొత్తం 62 వైవిధ్యభరితమైన వ్యాసాలు ఉన్నాయి. ఈ సంపుటిని తెలంగాణ జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక, హైదరాబాదు వారు 2018లో ప్రచురించారు.

అమ్మంగి వేణుగోపాల్ గారు ఈ వ్యాస సంపుటి ఆరంభంలోనే అద్భుతమైన వ్యాసాలతో పాఠకులను సహృదయ పూర్వకంగా సాహిత్య విమర్శలోకి ఆహ్వానిస్తున్నారు. పరిశోధననే ప్రమాణంగా జీవిస్తున్నవారు కావడం మూలంగానేమో అమ్మంగి మొదటి వ్యాసాన్ని ఒక పరిశోధనా గ్రంథంలో నిక్షిప్తమైనటువంటి సత్యాన్వేషణలు, విజ్ఞాన సంబంధమైన విషయాలను గురించి వివరించారు. 'ఆధునికాంధ్ర కవిత్వం-సినారె పరిశోధన' అన్నది మొదటి వ్యాసం. ఈ వ్యాసంలో సి. నారాయణరెడ్డిగారి "ఆధునికాంధ్ర కవిత్వము : సంప్రదాయము, ప్రయోగములు" అన్న పరిశోధన గ్రంథం గురించి ఆ సిద్ధాంత గ్రంథంలో ఉన్నటువంటి సాహిత్య విశేషాలు గురించి విశ్లేషణాత్మకంగా వివరించారు.

సంప్రదాయంపై జరిగే మార్పే ప్రయోగమని భావించిన సినారె గారి వ్యక్తిత్వాన్ని వారు తమ సిద్ధాంత గ్రంథంలో చేసినటువంటి నూతన ప్రయోగాలను గురించి అమ్మంగి ఈ వ్యాసంలో వివరించారు. వేణుగోపాల్‌గారికి సినారె గారంటే ఎంతో గౌరవం. ఎందుకంటే అమ్మంగి వారికి పాఠాలు నేర్పిన సాహిత్య గురువు సి. నారాయణరెడ్డిగారు. వారిపై ఎంతో గౌరవం ఉన్నప్పటికీ ఈ వ్యాసంలో పరిశోధకునికి సంబంధించిన వ్యక్తిత్వ విశేషాలను గురించి ఏమాత్రం కూడా విశ్లేషించకుండా పరిశోధనా గ్రంథంలో ఉన్న ఆధునికతను గురించి మాత్రమే చర్చించారు. అదే అమ్మంగిలో ఉన్న సహృదయ దృక్పథం అని చెప్పవచ్చు. ఎన్ని కోణాలనుండి పరిశీలించినా 1962లో వెలువడినటువంటి ఈ సిద్ధాంత పరిశోధనా గ్రంథం అన్ని విధాలుగా సమగ్రతను సంపాదించుకుంది అని ప్రతిపాదించిన తీరు అద్భుతంగా ఉంది.

రెండవ వ్యాసం మొదటి వ్యాసానికి ఎలాంటి పొంతన లేని గంగుల శాయి రెడ్డి గారు రాసిన 'కాపుబిడ్డ' పద్యకావ్యం గురించి. ఈ కాపు బిడ్డ కావ్యం గ్రామీణ నేపథ్యంలో నిసర్గమైన వాతావరణంలో సాగిన ఒక 'శ్రమోపనిషత్తు' అని కావ్యంలో కవి చిత్రించినటువంటి కర్షక జీవితాన్ని సజీవంగా ఉంచి పాఠకుల చెంతకు చేర్చారు అమ్మంగి. ఈ కావ్యం ద్వారా శాయిరెడ్డి గారు సమాజంలో అత్యధిక సంఖ్యాకులైన వ్యవసాయదారుల జీవితాన్ని చిత్రించటానికి నిజాయితీగా ప్రయత్నించారు అని చెప్పడంలో కవి అంతరాత్మను అర్థం చేసుకున్న తీరు స్పష్టం అవుతుంది. ఏ ప్రక్రియను ఎంచుకున్నా అమ్మంగి విమర్శకుడిగా ఆ కవిలో లేదా ప్రక్రియలలో ఉన్నటువంటి మహోన్నతమైన అంశాలను మాత్రం కచ్చితంగా విశ్లేషించే ప్రయత్నం చేస్తున్నారు. శాయిరెడ్డి తన కావ్యాన్ని మొదట పౌరాణిక సందర్భాలతో ప్రారంభించినప్పటికీ ముగింపుకు వచ్చేసరికి భౌతిక ప్రపంచంలోకి ప్రయాణించి కావ్యాన్ని ముగించారని అమ్మంగి తెలిపారు.

పరిశోధనా గ్రంథాల మీద రాసిన వ్యాసాలే కాకుండా ఈ సంపుటిలో పరిశోధనలు చేసి నూతన సిద్ధాంతాలను ప్రతిపాదించిన వ్యాసాలు కూడా ఉన్నాయి. "తెలంగాణాలో కవి సమ్మేళనాలు" అన్న వ్యాసంలో క్రీ.శ.ఒకటవ శతాబ్దంలోనే తెలంగాణాలో తొలి కవి సమ్మేళనాలు జరిగాయనడానికి ఆధారాలు ఉన్నాయంటారు అమ్మంగి. అందుకు ఉదాహరణగా శాతవాహన రాజైన హాలుడు 273 మంది కవులు రచించిన 700 గాథలను కవుల సమ్మేళనం ద్వారా సేకరించి సంకలనంగా రూపొందించి 'గాథా సప్తశతి' అన్న గ్రంథాన్ని వెలువరించి ఉంటాడని వివరించిన తీరు తెలంగాణ ప్రాంత వాసులలో తొలి సారిగా చారిత్రక సువాసనను రాజేసే విధంగా ఉంది. ఇలా నిర్ధారించడానికి ప్రధాన కారణం క్రీ.శ. 946 కాలం నాటి కరీంనగర్ జిల్లాలో జినవల్లభుడు వేయించిన కుర్క్యాల(బొమ్మల గుట్ట) శాసనమే తెలంగాణ సంస్కృతికి నిలువెత్తు నిదర్శనమని వివరించారు. అంటే తెలంగాణలో రెండువేల సంవత్సరాల క్రితమే కరీంనగర్ జిల్లాలోని కోటిలింగాలలో గాని, మెదక్ జిల్లా కొండాపూర్ లో గాని తొలి కవి సమ్మేళనాలు జరిగి వుంటాయని అమ్మంగి చారిత్రక ఆధారాలతో వివరించారు.

తెలంగాణలోని చారిత్రక ఆధారాలను సమగ్రంగా విశ్లేషించిన తరువాత తెలంగాణలోని కరీంనగర్ జిల్లాకు చెందిన హిందుస్తానీ సంగీత దిగ్గజం అయిన నారాయణరావుగారి జీవిత ఇతివృత్తం ఆధారంగా వెలువడినటువంటి "మ్రోయుతుమ్మెద" నవలను గురించి పరిశోధనాత్మకంగా విశ్లేషించారు. ఈ వ్యాసాన్ని 'మ్రోయుతుమ్మెద : నారాయణరావు' (ఒక విస్మృత సంగీత విద్వాంసుని జీవితం) అనే శీర్షికతో రాయడం జరిగింది. ఈ మ్రోయుతుమ్మెద నవలను తెలుగు సాహిత్యరంగంలో అహంకారాన్ని ఒక అలంకారంగా ధరించి, సంప్రదాయ హైందవ భావాలను ప్రచారం చేయటానికి సాహిత్యాన్ని ఒక వారధిగా ఎంచుకున్నటువంటి విశ్వనాథ సత్యనారాయణగారు రచించారు. విశ్వనాథ సత్యనారాయణగారు 1960 ప్రాంతంలో తెలంగాణలోని కరీంనగర్ జిల్లాలో అధ్యాపక వృత్తిని కొనసాగించిన సమయంలో నారాయణరావుగారి ఆధ్యాత్మిక ప్రభావం విశ్వనాథగారిపై పడిందని ఆ కారణంగానే నారాయణ రావుగారినే నవలా నాయకునిగా చేసుకుని మ్రోయుతుమ్మెద నవలను రాసారని అమ్మంగి పేర్కొన్నారు. నారాయణ రావుగారి జీవిత సంగీతాలను వస్తువుగా తీసుకుని విశ్వనాథ రాసిన ఈ నవల ఆ మహా సంగీతవేత్తకు

గొప్ప నివాళి అని తెలంగాణ ప్రాంత వ్యక్తుల గొప్పతనాన్ని తెలియజేసారు వేణుగోపాల్. అందుకే మ్రోయుతుమ్మెద ఒక విలక్షణ సంగీత విద్వాంసుని జీవితం ఆధారంగా రాయబడ్డ అర్ధ వాస్తవిక, అర్ధ కాల్పనిక నవలని చెప్పగలిగారు.

''తెలంగాణ చిరస్మరణీయులు''అన్న వ్యాసంలో ప్రాచీన కాలంలోని గుణాఢ్యుని నుంచి ఆధునిక కవిత్వం మీద తనదైన ముద్ర వేసి తెలంగాణ అస్తిత్వాన్ని చాటి చెప్పినటువంటి అలిశెట్టి ప్రభాకర్, ప్రొఫెసర్ జయశంకర్ గారి వరకు తెలంగాణ చరిత్రలో నిలిచేపోయే చిరస్మరణీయుల సేవలను, వారు సాధించిన విజయాలను గురించి విశ్లేషించారు. అదే విధంగా 'తెలంగాణ అంతరాత్మ కాళోజీ' అన్న వ్యాసంలో తెలంగాణ ఉద్యమంలో భాషారూపంలోని ఆధునికతకు మాత్రమే కాకుండా భావరూపంలోని ఆధునికతకు పెద్ద పీట వేసినటువంటి కాళోజి నారాయణ రావుగారు ప్రజలందరి ఆత్మ, తెలంగాణ అంతరాత్మ అంటూ కాళోజి గారిలో ఉన్న ప్రజాదృష్టి, ఉద్యమ స్ఫూర్తిని గురించి వివరించిన తీరు గొప్పగా ఉంది. అదేవిధంగా 'తెలంగాణ ఉద్యమ కవిత్వం-మలిదశ' అన్న వ్యాసం 'చరిత్ర రచనలో సాహిత్యాత్మ', 'గోలకొండ'అన్న వ్యాసాలలో కూడా తెలంగాణ చరిత్ర, సాహిత్యం, ఉద్యమ స్ఫూర్తిని గురించి ఎంతో స్పష్టంగా వివరించారు. భిన్న ప్రక్రియలపై వ్యాసాలు రాసినప్పటికీ తెలంగాణ ప్రాంతం, తెలంగాణ చరిత్ర, తెలంగాణ ఉద్యమం, సాహిత్యం మీదనే ఎక్కువ వ్యాసాలు రాయడం జరిగింది.

ఈ విధంగా అమ్మంగి వేణుగోపాల్ గారు రాసినటువంటి ప్రతి విమర్శనా వ్యాసం కూడా పరిశోధనా విలువలను పుష్కలంగా కలిగి ఉన్నాయని చెప్పవచ్చు. వేణుగోపాల్ గారు పరిశోధనా గ్రంథాలపైన, పద్యకావ్యాలపైన, పరిశోధనా పూర్వకంగా రాసిన వ్యాసాలే కాకుండా ఈ వ్యాస సంపుటిలో కావ్యాలకు, యాత్రా చరిత్రలకు, కవితా సంపుటాలకు రాసిన ముందుమాటలు, చారిత్రక గ్రంథాలపైన సమీక్షలు చాలానే ఉన్నాయి. ముందుమాటల విషయానికి వస్తే ప్రతి ముందుమాటను కూడా స్పష్టంగా, సమగ్రంగా పాఠకుల దృష్టిని ఆకర్షించే విధంగా చెప్పారు. దేవులపల్లి కృష్ణమూర్తి, రావులపుల్లాచారి గార్ల కథా సంపుటాలకు, దాసోజు జ్ఞానేశ్వర్, పప్పుల రాజిరెడ్డి, నిజం, బి.యస్. రాములు, వల్లపైడి, దోరవేటి చెన్నయ్యల కవితా సంపుటాలకు, తెలుగువారి మహాయాత్రికుడు ఆదినారాయణ గారి యాత్రా చరిత్రకు, ఎ.వి.యన్. రాజు, జలజం సత్య నారాయణ గారి అనువాద గ్రంథాలకు అమ్మంగి వేణుగోపాల్ గారు రాసిన ముందుమాటలు అన్నీ కూడా కవిలో, రచయితలో, యాత్రికునిలో, అనువాదకునిలో ఉన్నటువంటి సాహిత్య జిజ్ఞాసను విశ్లేషించిన తీరు విమర్శకుల మన్ననలు పొందే విధంగా ఉన్నాయి.

తెలంగాణ ప్రముఖుల వ్యక్తిత్వ సాహిత్య చిత్రణలను తెలంగాణ వైతాళికులు అయిన కాళోజి నారాయణరావు, వట్టికోట ఆళ్వారుస్వామి, దేవులపల్లి రామానుజరావు, పొట్లపల్లి రామారావు, బిరుదురాజు రామరాజు, సామల సదాశివ గారి గొప్పతనాన్ని గురించి వారి వ్యక్తిత్వాలను గురించి ఎంతో అద్భుతంగా ఈ సంపుటిలో వివరించారు.

కేవలం కవులను గురించి విశ్లేషించడం మాత్రమే కాకుండా అమ్మంగి కవయిత్రులు, ఉత్తమ వ్యకిత్వం కలిగిన స్త్రీలను గురించి కూడా వ్యాసాలను రాసారు. అందులో తెలంగాణ ఉద్యమంలో క్రియాశీల వ్యక్తిగా కృషి చేసిన శ్రీమతి జ్వలిత గారిని గురించి, వ్యథార్థ – జీవుల యధార్థ కథల రచయిత్రి కరుణ, జీవితాన్ని చదివితే వచ్చిన జ్ఞాన ప్రభావంతో సాహిత్య రంగంలోకి ప్రవేశించి సమ సమాజం దిశగా సంకల్పశక్తితో అడుగులు వేస్తున్నటువంటి కనక సుగుణ గారిని గురించి ఎంతో చక్కగా వివరించారు.

ఈ గ్రంథ పరిధిలో లేని మరొక మంచి పరిశోధన గూర్చి పేర్కొనటం అవసరం. తెలుగుభాషలోనే కాక, ఇతర దేశాల్లోనూ, విదేశీ భాషలలోనూ వచనకవితా ప్రక్రియ ఆవిర్భావవికాసాలను గూర్చి అమ్మంగి వేణుగోపాల్ ఒక సుదీర్ఘ సమగ్ర వ్యాసం రచించారు. దీన్ని 'విజేత' సంస్థ వారు "సాహితీసుధ" గ్రంథంలో 2018లో ప్రచురించారు. ఈ విధంగా సహృదయ విమర్శకులుగా అమ్మంగి వేణుగోపాల్ గారు రాసినటువంటి ప్రతివ్యాసం, ప్రతి ముందుమాట కూడా సాహిత్య విలువలు పొందినవిగా ఉండి రచనలకు శోభను కలిగించే విధంగా ఉన్నాయి. వారి సహృదయత కారణంగానే నేటికి అనేకమంది ఆధునిక యువకవులు అమ్మంగి వారితో కావ్యాలకు ముందుమాటలు, కావ్యాలపై సమీక్షలు రాయించుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. సహృదయ దృష్టితో రాసినటువంటి ఈ విమర్శనా వ్యాసాలు అన్నీ కూడా సహృదయ పాఠకుల దాహం తీర్చేందుకు తెలుగు నేలంతా ప్రవహిస్తున్నాయి. పాఠకులలో పఠనాసక్తిని పెంచి విజ్ఞాన బోధ వైపు పరుగులు తీస్తున్నాయి.

**ఉపయుక్త గ్రంథ సూచిక**

1. రామారావు, ఎస్వీ. తెలుగులో సాహిత్య విమర్శ. హైదరాబాదు : పసిడి ప్రచురణలు, 2007.

2. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. విమర్శా శిల్పం. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2002.

3. వేణుగోపాల్, అమ్మంగి. సహృదయ సాహిత్య విమర్శ-వైవిధ్యం. హైదరాబాద్: జయమిత్ర సాహిత్య,సాంస్కృతిక వేదిక, 2018.

4. వేణుగోపాల్, అమ్మంగి. సాహిత్య సందర్భం-సమకాలీన స్పందన. హైదరాబాదు:జయమిత్ర సాహిత్యసాంస్కృతిక వేదిక, 2012.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 10 (54) హైదరాబాద్ ఆగస్టు : 2022

సమీక్ష

# తాత్త్విక జ్ఞానానికి గ్రంథాలయం 'నీహారిక గజళ్ళు'


**కళ్ళెం నవీన్,** కామారెడ్డి, ఫోన్ : 996 369 1692

నీహారిక గజల్లు తెలుగు గజల్ రచనలకు చైతన్య పరిచేదిగా మార్గనిర్దేశనం చేస్తుందని చెప్పవచ్చు. ఎందుకంటే సూరారం శంకర్ గారు రచించిన ఈ నీహారిక గజల్ల సంపుటి అనేది ఎన్నో విలువలను సమాజానికి అందిస్తుంది. ప్రతి గజల్ ఒక జీవితం నుండి అనుభవాలలో నుండి జన్మించిన అక్షరాలు అవి. లోతుగా కవి చెప్పిన మాటలు అర్థం చేసుకుంటే ఎంతో స్వచ్ఛంగా భావ సౌందర్యంతో ప్రతి గజల్ కనిపిస్తుంది. ఎన్నో జీవితాలను మార్చే విధంగా ప్రతి గజల్‌ని తాత్విక చింతనతో రాయటం కేవలం సూరారం శంకర్ గారికి చెల్లుతుంది. గజల్ రాసే వాళ్ళు తెలుగులో తక్కువ మందే ఉన్నారు అందులో తాత్వికంగా గజల్స్ రాసే వాళ్ళు కేవలం సూరారం శంకర్ గారి అని చెప్పవచ్చు. ప్రతి గజల్ ఎంతో అందంగా అద్భుతంగా ఉంటుంది. ప్రతి అక్షరాన్ని ఎంతో ప్రేమిస్తూ పొందుపరిచి అందించిన ప్రతి గజల్ అద్భుతమే.

ఇది వరకే సౌగంధిక, సౌపర్ణిక గజల్ సంపుటాలను వెలువరించారు. ఎంతోమంది గొప్ప కవుల చేత మన్నలను పొందింది. నీహారిక అనేది మూడవ గజల్ సంపుటి. 40 సంవత్సరాల ఈ సుదీర్ఘ ప్రయాణంలో అద్భుతమైన గజల్స్ మాత్రమే రాయడం గొప్ప విషయం. శంకర్ గారు ఎప్పుడు అనేవారు మనం రాసేవి సంఖ్య కాదు ముఖ్యం సరుకు ముఖ్యమని. నిజమే కదా ఎన్ని రాశామనేది కాదు రాసినవి ఎంత ప్రాచుర్యం పొందాయి సమాజాన్ని ఎంతవరకు ప్రభావితం చేశాయనేదే ముఖ్యం. ఆయన మనిషిని ప్రేమిస్తాడు. మనుషులను మారుస్తాడు. మనసులను హత్తుకుంటాడు. ఈయన ఎంతో మంది కవుల ప్రశంశలు పొందాడు. తెలుగు విశ్వ విద్యాలయం నుండి "కీర్తి పురస్కారం" పొందాడు. ఆధునిక గజల్ కవులలో సూరారం శంకర్ గారు ప్రముఖులు. నీహారిక సంపుటిలో మొత్తం 68 గజల్స్ తో కూడుకుని గొప్పగా రచించబడ్డది. నీహారిక లో రాసినటువంటి గజల్ల గురించి చెప్పుకుంటే సమాజాన్ని ఎంతగానో చైతన్య పరుస్తాయి అని చెప్పవచ్చు. అందులోని కొన్ని గజల్లని పరిచయం చేసుకుంటే ఇలా ఉంటాయి.

**"నదులను చూసి, నడకలు నేర్చిన పయనం నాది**
**పికమును చూసి, స్వరములు కూర్చున కవనం నాది"**

నీహారిక లో ఈ గజల్‌తో ప్రారంభించి కవి ఎంత గొప్పగా ప్రతి గజల్ లో ప్రయాణం చేశాడో అర్థం అవుతుంది. నడకను నదులను చూసి నేర్వడం మరియు పక్షిని చూసి స్వరములు రాయడం అనేది చెప్పిన తీరు వర్ణనాతీతం.



**"గజలంటే తుహిన కణం తాకినట్టు ఉండాలి**
**ఎదవాకిట ఆమని చిగురించినట్టు ఉండాలి"**

ఇలా మొదలైన గజల్ గురించి అందులో ఎంతో లీనమై జీవించి రాస్తే తప్ప ఇలా చెప్పలేరని అనిపిస్తుంది. గజల్ అనేది వెన్నెల్లో చల్లగా ఉన్నట్టు, శ్రోతకు హృదయాన్ని తాకినట్టు ఉండాలంటాడు. ఇంకా గుండె వాకిట్లో వసంతమై లేలేతగా చిగురించినట్టు ఉండాలనడం కవి గజల్స్ ని ఎంతగా ప్రేమించి రాస్తాడో అర్థం చేసుకోవచ్చు.

**"నాకు తెలియని నేను ఒక కల, కలను కలిసిన అద్భుతం**
**నీకు తెలియని నేను ఒక శిల, శిలను తెలిసిన అద్భుతం"**

ఈ గజల్ గొప్ప తాత్వికమైన భావాలతో హృదయాలను చేరుతుంది. ఈ ఒక్క గజల్ తో ఒక గ్రంథాన్ని రచించవచ్చని మాత్రం చెప్పగలను. ఈ గజల్ ప్రధానంగా అంతరంగాన్ని తాకుతుంది. తనను తాను తెలుసుకున్న వాడు కలల ప్రపంచంలో ఉండిపోడు. కలను సాకారం చేసుకునే దిశలలో విజయాలను అద్భుతాలను సృష్టించగలడని ఈ గజల్ ద్వారా అద్భుతంగా చెప్పాడు.

సూరారం శంకర్ గారి ఆలోచనలు, భావాలు ఉన్నతస్థాయిలో ఉంటూ సమాజంలోని మార్పును కాంక్షిస్తూ మనిషి మనుగడకు జీవిత పరమార్థాలకు చెందినవిగా ఉంటాయి. సూరారం శంకర్ గారు ప్రతి గజల్ లో మమేకమై ప్రతి అక్షరాన్ని ఆస్వాదిస్తూ చక్కగా కూర్పు చేసి సమాజానికి అందించాడు. ఇంకా గొప్ప విషయం ఏంటంటే తన గజల్లకు తానే అనుగుణంగా బొమ్మలను వేసుకోవడం అనేది ఆయనకు ఉన్నటువంటి మరో అద్భుతమైన కళ. బొమ్మలు చూస్తే చాలు అక్షరాలు అందులో నాట్యం చేస్తున్నట్లు అనిపిస్తుంది. నీహారిక ప్రచురించి మాముందు ఇలా తీసుకువచ్చినందుకు సూరారం శంకర్ గారికి నా హృదయ పూర్వక అభినందనలు.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 10 (55) హైదరాబాద్ ఆగస్టు : 2022

## కె. విశ్వనాథ్ చలన చిత్రాలు – సామాజిక అవలోకనం – 26

# స్వయం కృషి

**టి. లక్ష్మీనారాయణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9704829254



**"కృషితో నాస్తి దుర్భిక్షం", "కష్టేఫలి"** అనే మాటలను జీవన మంత్రంగా భావించి నిరంతరం తాము చేరాలనుకునే గమ్యం కోసం కృషి సలిపే ఏ వ్యక్తైనా తాను సంకల్పించిన స్థాయికి చేరగలడు. దానికి ఎంతో పట్టుదల, సహనం, కృషి అవసరం. ఏ మాత్రం ఆస్తి–అంతస్తులు, కుల–గోత్రాలు లేని సాధారణ వ్యక్తి ఉన్నతంగా ఎదగాలంటే దానికి మరింత క్రమశిక్షణ, స్వయం కృషి అవసరం. ఆ స్థాయికి చేరిన తర్వాత తాను ఎలాంటి ప్రవర్తనా, వ్యక్తిత్వాలతో జీవిస్తున్నాడనే దాన్ని బట్టి అతడు సంఘంలో కీర్తించబడతాడు. సరిగ్గా అలాంటి వ్యక్తి కథనే ఈ మాసం వ్యాసంలో చర్చించుకోబోతున్నాం.

"కె. విశ్వనాథ్ చలన చిత్రాలు – సామాజిక అవలోకనం" నందు ఈ మాసం చర్చించబోయే చిత్రం "స్వయం కృషి". ఈ చిత్రం 1987 సెప్టెంబర్ 3న విడుదలైంది. పూర్ణోదయా క్రియేషన్స్ వారి ఆధ్వర్యంలో నిర్మించబడిన ఈ చిత్రంలో చిరంజీవి, విజయశాంతి, సుమలతలు ప్రధాన తారాగణంగా నటించారు. అప్పటికే సుప్రీం హీరోగా ప్రేక్షకులను ఉర్రూతలూగించిన చిరంజీవి తాను చేసే పాత్రలకు, నటనకు పూర్తి విభిన్నంగా వుండే పాత్రలో నటించడం ఆయన నటనాభిలాషకు, కొత్త తరహా పాత్రలు చేయడం పట్ల ఆయన ఆసక్తికి నిదర్శనం.


**చిత్ర కథ :**

సాంబయ్య(చిరంజీవి) ఓ చెట్టు కింద చెప్పులు కుట్టుకుంటూ కష్టాన్ని నమ్ముకుని నిజాయితీగా జీవించే వ్యక్తి. అతడితో పాటు అదే చెట్టు క్రింద ఓ పసిబాబును ప్రేమగా అల్లారుముద్దుగా పెంచుతుంటాడు. ఆ పసిబాబు సాంబయ్య చెల్లెలి కుమారుడు. వరుసకు అల్లుడు. చెల్లి మరణం, బావ బాధ్యత లేని జులాయి జీవన విధానం వల్ల ఆ పసిబాబును చిన్నా పేరుతో సాంబయ్య పెంచాల్సి వస్తుంది. గంగ (విజయశాంతి) గుడి ముందు భక్తుల చెప్పులకు కాపలా వుంటూ దానికి గానూ వాళ్ళిచ్చే కొద్దిపాటి చిల్లర డబ్బుతో తృప్తిగా జీవనం సాగిస్తూ వుంటుంది. గంగ మంచి మాటకారి, గడుసు పిల్ల. గంగ తండ్రి అతడికి వున్న పోలీస్ ఉద్యోగం పోగొట్టుకుని తాగుడుకు బానిసైన వ్యక్తి. గంగకు సాంబయ్య అంటే వల్లమాలిన అభిమానం, దానికి మించి ప్రేమ. అతడితో జీవితం పంచుకోవడానికి లోలోపల ఆశపడ్తూ వుంటుంది. కాని సాంబయ్య మాత్రం శారదను పెళ్ళి చేసుకోవాలని కలల్లో బతికేస్తుంటాడు. ఆమె చదువు కోసమై పైసా, పైసా కూడబెట్టి పై చదువులు చదివిస్తూ కష్టపడుద్తుంటాడు. శారద (సుమలత) చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి సాంబయ్య పెంపకంలో పెరిగి పెద్దదవుతుంది. సాంబయ్య పంపే డబ్బుతో పట్నంలో ఏ కష్టాలు లేకుండా చదువుకుంటుంది.

సాంబయ్యకు చెప్పులు కుట్టడానికి గిరాకీ కావాలనే ఉద్దేశ్యంతో గంగ తన వద్ద పెట్టే భక్తుల చెప్పులకు కప్పులూడదీసి అతడి వద్దకు భక్తులు వెళ్లి చెప్పులు కుట్టించుకునేలా చేస్తుంటుంది. నిజాయితీ పరుడైన సాంబయ్య గంగ చేసిన తుంటరి పనిని మనసులో పెట్టుకొని చాలామందికి ఉచితంగా కుట్టిస్తూ వుంటాడు. అంతేకాక గంగను అలా చేయొద్దంటూ వారిస్తూ వుంటాడు. సాంబయ్య బావ గోవిందు (చరణ్ రాజ్) జైలు నుంచి వచ్చీరాగానే తప్పతాగి ఊర్లోని ఒక ఇల్లాలు పై బలాత్కారం చేయబోతాడు. ఆ విషయం తెలిసి సాంబయ్య గోవిందును దండించి, ఎంతైనా చెల్లి భర్తే అనే కడుపుతీపితో వదిలేస్తాడు. చెడు వ్యసనాలన్నింటినీ ఒకే చోట పోగు చేస్తే అదే గోవిందు. చిన్నా, శారదలే జీవితంగా బతికే సాంబయ్య ఆమెను పెళ్ళి చేసుకోవడానికై ఆమె చదువు ఎప్పుడెప్పుడు పూర్తవుతుందా! అని ఎదురు చూస్తుంటాడు. సాంబయ్య తనకు ఎప్పుడూ మార్గదర్శకుడిగా భావించే మాష్టారు (జె.వి.సోమయాజులు) వద్దకు వెళ్లి పెళ్ళి ముహూర్తం అడగడం పెళ్ళి సామాన్లు తెస్తుండడం చేస్తూ వుంటాడు. మాష్టారు ప్రతిసారి ముహూర్తం పెట్టి విసిగిపోవడం షరా మామూలైపోతుంది.

ఓరోజు సాంబయ్య శారదతో వివాహ విషయాన్ని చెప్పడానికి ఆమె చదువుకునే చోటకు వెళ్తాడు. కాని సాంబయ్య తన మనసులోని మాట చెప్పే లోగా ఆమె తాను పై చదువులు చదవాలనుకుంటున్నట్లు చెప్పడంతో నిరాశగా వెనుదిరుగుతాడు. ఓసారి గంగకు గుడి వద్ద

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 10 (56) హైదరాబాద్ ఆగస్టు : 2022




బ్యాంకు మేనేజర్ కూతురుతో పరిచయం అవుతుంది. ఆమె ద్వారా వ్యాపారం పెట్టుకోవడానికి బ్యాంకులు ఇచ్చే ఋణ వివరాలు తెలుసుకుంటుంది. ఆ విషయాన్ని సాంబయ్యతో ప్రస్తావిస్తుంది గంగ. ఇద్దరు కలిసి బ్యాంకుకు వెళ్ళగా అక్కడ మేనేజర్ సాంబయ్యను గుర్తించి సానుకూలంగా స్పందిస్తాడు(గతంలో గుడి వద్ద మేనేజర్ చెప్పును కుట్టి వుంటాడు). గంగ మాత్రం ఆ మేనేజర్ చెప్పుకప్పును గుడి వద్ద ఊడదీసిన విషయం గుర్తు చేసుకుని భయపడుతుంది. ఆ మేనేజర్, సాంబయ్య మంచితనం, కష్టపడే తత్వం గుర్తించి ఋణం మంజూరు చేసి చిన్న చెప్పుల వ్యాపారం చేసుకునే అవకాశం కల్పిస్తాడు.

శారద ఒకరోజు ఒక అబ్బాయిని వెంటబెట్టుకుని సాంబయ్యను కలవడానికి వస్తుంది. ఆ అబ్బాయే భాస్కర్ (సర్వదమన్ బెనర్జీ). భాస్కర్ శారదతో పాటు చదువుకుంటున్న వ్యక్తి. శారద భాస్కర్ ను ప్రేమిస్తున్నట్లు సాంబయ్యకు చెప్తుంది. అక్కడే ఉన్న గంగ సాంబయ్య మనసులోని విషయం శారదకు చెప్పబోగా ఆమెను నిలువరిస్తాడు. అంతేకాక పెద్ద మనసు చేసుకుని శారద– భాస్కర్ లకు వివాహం చేసి పంపిస్తాడు. శారదను కోల్పోయిన భాదను భరించలేక ఫుల్లుగా తాగి ఏ మాటా అర్థం చేసుకోలేని చిన్నాతో 'శారదను పెళ్ళి చేసుకోకపోవడమే మంచిదైంది రా చిన్నా!!, లేకపోతే నీపై ప్రేమ తగ్గిపోయి నిన్నెక్కడ నిర్లక్ష్యం చేసేవాడ్నో?? ఇక నాకు పిల్లలు పుట్టే అవకాశమే లేదు, చాలా సంతోషంగా వుంది'. అంటూ బాధపడ్తాడు. ఇదంతా విన్న గంగ తనకు సంతానం కలగకుండా ఉండేందుకు ట్యూబెక్టమీ చేయించుకుంటుంది. గంగ తనకు సంతానం కలగకుండా చేసుకున్న పిచ్చి పనిని గూర్చి మాష్టారు సాంబయ్యకు తెలియజేస్తాడు. ఆమె ప్రేమకు చలించి ఆమెను వివాహం చేసుకుంటాడు సాంబయ్య. మరోవైపు కాలం గడిచే కొద్దీ సాంబయ్య వ్యాపారం దినదినాభివృద్ధి చెంది సాంబయ్య కాస్తా సాంబశివరావు పేర పెద్ద ఐశ్వర్యవంతుడుగా గుర్తింపు పొందుతాడు(తదుపరి వ్యాసంలో సాంబశివరావు పేరును సాంబయ్యగానే వాడడం జరిగింది). తాను పెంచిన చిన్నా కూడా పెద్దవాడై బడిలో చేరతాడు. చిన్నాను సాంబయ్య గారాబంగా పెంచినా అతనికి సాధారణ జీవితపు కష్టాలు, విలువలు తెలిసేలా పెంచాలని భావిస్తాడు.

భాస్కర్ స్వంతంగా వ్యాపారం చేయడానికై సాంబయ్య తో డబ్బులు తీసుకురమ్మంటూ శారదపై ఒత్తిడి చేస్తుంటాడు. ఒక రోజు శారదను చూడడానికి వచ్చిన సాంబయ్యకు ఈ విషయం తెలిసి ఆమెను తన ఇంటికి తీసుకువెళ్తాడు. సాంబయ్య వ్యాపార కార్యకలాపాలపై వెళ్తున్న సందర్భంలో రోడ్డుపై చెప్పులు కుట్టి కాలం వెళ్ళదీస్తున్న ఇద్దరు చిన్న పిల్లలను యాధృచ్ఛికంగా కలుస్తాడు. అది కాస్తా వాళ్ళను తన ఇంటికి తీసుకెళ్ళి తన స్వంత డబ్బులతో చదివించే వరకు వెళ్తుంది. డబ్బుల్లో పెరిగిన చిన్నా గర్వంతో ఆ పిల్లలు తనతో సమానంగా వుండడాన్ని సహించలేక తరచూ గొడవపడ్తూ వుంటాడు. అందరి పిల్లల్లా సాధారణ బస్సులో వెళ్ళడానికి అనహ్యాంగా భావిస్తాడు. సాంబయ్య చిన్నాకు నువ్ అసహ్యించుకోవల్సింది నీకు పరీక్షల్లో వచ్చిన తక్కువ మార్కులకు తప్ప ఇలాంటి విషయాలకు కాదు అని అతడికి వచ్చిన మార్కులను గుర్తుచేసి మందలిస్తాడు. సరిగ్గా ఇదే సమయంలో చిన్నా తండ్రి గోవిందు, చిన్నాకు సాంబయ్య పై ఉన్న అసంతృప్తిని అవకాశంగా చేసుకొని మచ్చిక చేసుకుంటాడు.


శారదను తన ఇంటికి తీసుకువచ్చిన సంఘటనను తప్పుగా అర్థం చేసుకుంటాడు భాస్కర్. ఆ విషయం తెలిసి భాస్కర్ ను నేరుగా ఇంటికి పిలిచి అతడికి కనువిప్పు కలిగేలా గుణపాఠం చెప్తాడు సాంబయ్య. అంతేకాక శారద– భాస్కర్ లకు తన వద్దే వారి చదువుకు సరిపడిన స్థాయిలో మంచి ఉద్యోగాలను ఇచ్చి వారి దాంపత్యానికి కావల్సిన వసతులను ఏర్పాటు చేస్తాడు. మరోవైపు బావ గోవిందు అతడి కొడుకు చిన్నాను సాంబయ్య వద్దనుంచి తన వద్దకు తీసుకెళ్ళేందుకు కోర్టులో కేసు వేస్తాడు. కోర్టు వాదన సమయంలో చిన్నా తాను సాంబయ్య వద్ద కాకుండా తన తండ్రి వద్దే వుంటాను అని చెప్పడంతో సాంబయ్య మనసు కకావికలం అవుతుంది. చిన్నా ను తనతో తీసుకువెళ్ళిన గోవిందు చిన్నాకు వయసుకు మించిన విషయాలను (తాగుడు, జూదం మొదలైనవి) అలవాటు చేస్తాడు. అదంతా వీడియో తీసి క్యాసెట్టు చేసి సాంబయ్య కు పంపి ఆస్తులు కావాలంటూ భయపెడతాడు. ఆ విషయం తెలిసి తన గతాన్ని గుర్తు చేసుకుని చిన్నా జీవితం కోసం ఆస్తులు, ఇల్లు వదులుకుని మళ్ళీ చెట్టు కింద చెప్పులు కుట్టుకునే సాంబయ్యలా బతకడానికి

వెళ్ళిపోతాడు. కాని తండ్రి గోవిందు చెడు వ్యసనాలను, సాంబయ్య మంచితనం, గొప్పతనాన్ని లోలోపల అర్థం చేసుకున్న చిన్నా అందరినీ ఆశ్చర్యపరుస్తూ తండ్రిని చీదరించుకుంటాడు. తండ్రితో వుండే చెడు సౌఖ్యాలను, ఆఖరకు తండ్రిని కూడా వదిలేస్తాడు చిన్నా. సాంబయ్య – గంగల చెప్పుల కొట్టుకు ఎదురుగా వారిలాగే "కృషితో నాస్తి దుర్భిక్షం" అని బోర్డు పెట్టుకుని చెప్పులు కుడుతూ వారికి కనిపిస్తాడు. సాంబయ్య– గంగలు అది చూసి ఆనందంతో ఉప్పొంగిపోయి దగ్గరకు తీసుకోవడంతో కథ సుఖాంతం అవుతుంది.

చిత్ర విశేషాలు:

కోదండ రామిరెడ్డి, కె. రాఘవేంద్ర రావు, విజయం బాపినీడు లాంటి దర్శకుల సారథ్యంలో సుప్రీం హీరోగా దూసుకపోతున్న చిరంజీవి ఈ చిత్రంలో అన్ని సమీకరణాలను పక్కన పెట్టి కె. విశ్వనాథ్ కథా ప్రపంచంలోకి ప్రవేశించడం అనేది తన విజృంభణకు విరామమో, విభిన్నతో అయి వుండక తప్పదు. "స్వయం కృషి" చిత్రంలోని ఈ పాత్ర ప్రేక్షకులను ఆశ్చర్యపరచడమే కాక నటుడిగా ఆయనపై మరింత గౌరవం పెరిగేలా చేసింది. ఈ చిత్రం సినిమాగా కంటే కొన్ని జీవితాలను చూస్తున్నట్టుగా వుంటుంది. కె. విశ్వనాథ్ మనుషులు చూడని కొత్త కోణాలను చూపడం కంటే మనుషుల్లో సాధారణంగా వుండే తెలిసీ, తెలియక మనం నిర్లక్ష్యం చేసే మనలోని, మన మధ్య వుండే కోణాలను చూపే ప్రయత్నం చేస్తారు. మనమెలాగైతే పుస్తకంలోని మంచి వాక్యాలను మార్క్ చేసి గుర్తుంచుకుంటామో ఆ మాదిరిగా మనం వదులుకోకూడని, వదిలేసిన విషయాలను తన సినిమాలతో గుర్తు చేస్తారు.

సాంబయ్య(చిరంజీవి) పాత్రలో నిజాయితీ, శ్రమించే తత్వం, సహనం, మానవత్వం, మంచితనం లాంటి అంశాలుంటాయి. చేసే పని ఏదైనా నిబద్ధతతో చేయడం ఆ పాత్ర ప్రత్యేకత. బ్యాంకు మేనేజర్ కు చెప్పు కుట్టి చిన్న సహాయం చేసినందుకు గానూ వ్యాపార నిమిత్తం ఋణం మంజూరు చేయడంలో ఆయన సహాయపడతాడు. కొన్ని సార్లు మనం చేసే సహాయాలు చిన్నవే కావొచ్చు, కాని వాటి తాలూకు ప్రభావం వల్ల మన చుట్టూ ఉన్న వారినుంచి మనం ఏ స్థాయి సహకారం ప్రతిగా పొందుతాం అనేది ఊహించలేం. సాంబయ్య పాత్ర చేసే పనేదైనా ఏ చెడు భావనలు లేకుండా ఆత్మశుద్ధితో చేస్తుంది. దానికి వచ్చే ఫలితం కూడా అలానే ఉంటుంది. సాంబయ్య పెట్టే క్రమశిక్షణ నియమాలను తప్పుగా అర్థం చేసుకున్న చిన్నా కోర్టులో సాంబయ్యను కాదని తండ్రి గోవిందు వద్ద ఉంటానని చెప్తాడు. బావ గోవిందు చిన్నా ను చెడు వ్యసనాలకు అలవాటు చేసి వాటిని రికార్డు చేసి పంపిన క్యాసెట్ ను సాంబయ్య చూసి కూడా ఏ మాత్రం చలించకుండా ఉంటాడు. చిన్ననాటి నుంచి శారదను వివాహం చేసుకోవాలని కలలు కంటూ, ఆమెను పెద్ద చదువులు చదివించాలని కష్టపడినప్పటికీ ఆమె తాను కాలేజీ లో




ప్రేమించిన భాస్కర్ ను వివాహం చేసుకుంటాను అని చెప్పినప్పుడు ఆమెకు నచ్చిన వివాహం చేస్తాడు సాంబయ్య. బావ గోవిందు సాంబయ్య సంపాదించిన ఆస్తులను చిన్నా పేరుపై రాసివ్వమని చెప్పినప్పుడు ఏ మాత్రం ఆలోచించకుండా అన్నీ వదిలి భార్య గంగను తీసుకొని వెళ్ళిపోతాడు. రోడ్డుపై చెప్పులు కుట్టుకునే ఒక తాగుబోతు పిల్లలను చిన్నా తోపాటు చదివిస్తాడు. ఇలా పలు సందర్భాలను పరిశీలించినప్పుడు సాంబయ్య పాత్రలో నిర్భరత, త్యాగం, ఉదాత్తత వంటి లక్షణాలు కన్పిస్తాయి. సాంబయ్య పాత్ర మన సమాజంలో అక్కడక్కడ కనబడే అత్యుత్తమమైన మనిషిని జ్ఞప్తికి తెస్తుంది. అన్నింటికీ మించి తాను ఎదిగొచ్చిన దారి మరవకుండా తన పనిముట్లను పూజగదిలో పెట్టి ఆరాధిస్తూ మూలాలను మరవని జీవన విధానాన్ని కొనసాగించడం ఆ పాత్ర యొక్క ఉన్నత వ్యక్తిత్వానికి నిదర్శనం.

సాంబయ్యతో పాటు మరొక గొప్ప పాత్ర గంగ(విజయశాంతి). ఈ పాత్రలో పడుచు పిల్లల్లోని తుంటరి తనం కన్పిస్తుంది. ప్రతి సందర్భంలో గంగ సాంబయ్య పై ప్రేమాభిమానాలు చూపేటప్పుడు సాంబయ్య మాత్రం తనకు శారదపై వున్న ప్రేమను వ్యక్తపరుస్తుంటాడు. అయినా గంగ ఎలాంటి అసూయ, ద్వేషాలు లేకుండా కడిగిన ముత్యంలా సాంబయ్యతో సంబంధాన్ని నెరుపుతుంది. ఇతరుల నుండి తాను ఆశించేది లభించకపోయినా తన హృదయంలో స్వచ్ఛతను చుట్టూ వుండే మనుషులకు పంచడం ఆమె ప్రత్యేకత. ఇక సాంబయ్య ఆలోచనకు గౌరవమిస్తూ అతడిపై వున్న ప్రేమతో ఏ సమాచారం ఇవ్వకుండా ట్యూబెక్టమీ





చేయించుకోవడం అనేది ఆమె త్యాగశీలతకు సంకేతం, అంతేకాక నమ్మిన విషయం కోసం ఎలాంటి క్లిష్ట నిర్ణయమైనా తీసుకుని అమలు చేయడానికి ఉదాహరణగా వుంటుంది. భర్త సాంబయ్య తన ఆస్తులన్నీ వదిలేసి వట్టి చేతులతో బయటకు వెళ్తున్నప్పుడు ఏ మాత్రం ప్రశ్నించకుండా అతడితో వెళ్ళడం అనేది భర్త ఆలోచన, నిర్ణయానికి కట్టుబడి జీవించే భార్యని,స్త్రీని తెలియపరుస్తుంది. వీరిద్దరి మధ్య వచ్చే కొన్ని సన్నివేశాలు చాలా ఉద్వేగభరితంగా వుంటాయి. ఆ సన్నివేశాల్లో గంగ పాత్ర ఆ యా పరిస్థితులకు తగ్గట్టుగా "అట్ట సూడమాకయ్యా" అంటూ చెప్పే మాట ప్రేక్షకుల హృదయాలను కదిలిస్తుంది.

మరో రెండు పాత్రలు శారద(సుమలత), భాస్కర్ (బెనర్జీ). శారద పాత్ర సాంబయ్య కు బదులు భాస్కర్ ను వివాహం చేసుకోవడం ప్రేక్షకుడికి రుచించని విషయం. శారద భర్త ఆమెను డబ్బుకోసం ఒత్తిడి చేసినప్పుడు ఆమె పడే సంఘర్షణ, వేదన తనకు తప్ప మరో వ్యక్తికి తెలీకుండా మోస్తూ మన చుట్టూ వుండే ఒక సాధారణ ఇల్లాలిని గుర్తు చేస్తుంది. ప్రేమ పేరుతో ఆ సమయంలో వుండే ఊహలతో వివాహం చేసుకునే జంటలు నిజ జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను అర్థం చేసుకుని నిలవకపోతే ఎంత గొప్ప ప్రేమలైనా సంకటంలో పడాల్సిందే అనే దానికి ఉదాహరణ ఈ పాత్రలు.

ఈ చిత్రంలో మరొక విశేషమైన పాత్ర హాస్యబ్రహ్మ గా పేరుగాంచిన బ్రహ్మానందంది. ఇలాంటి పాత్ర ఆయన కెరీర్ మొత్తంలో ఎక్కడా కనపడదు. కారణం ఈ పాత్ర హస్యపాత్ర కాకపోవడమే. ఈయన ఒక తాగుబోతుగా, బాధ్యతలేని తండ్రిగా, ఆయన ఇద్దరు పిల్లలు రోడ్డుపై చెప్పులు కుట్టగా వచ్చే డబ్బును లాక్కుపోయి తాగే పాత్రలో నటించారు. ఆ పిల్లలనే సాంబయ్య తీసుకెళ్ళి చిన్నా తో పాటు చదివిస్తుంటాడు. సాంబయ్య చేసిన సహాయాన్ని అర్థం చేసుకుని తన చెడు అలవాట్లను మానుకుని బాధ్యత గల తండ్రిగా మారతాడు. స్కూళ్ళో చిన్నా తో ఈయన కుమారుడు గొడవపడినప్పుడు కారణం అడుగుతాడు. దానికి ఆ బాబు 'ఒకే స్కూళ్ళో చదువుతున్నప్పుడు అందరం సమానమేగా' అంటాడు. దానికి ప్రతిగా బ్రహ్మానందం 'అలా ఎలా అవుతుంది! శివుడు, నంది ఒకే గుళ్ళో ఉన్నంత మాత్రాన, ఇద్దరూ సమానమైపోతారా' అంటాడు. ఈ సన్నివేశాన్ని ఇద్దరి కోణంలో చూసినప్పుడు విభిన్న వాదనలు, విశ్లేషణలు బయల్దేరతాయి. చిత్రంలోని గొప్ప సన్నివేశాల్లో మచ్చుకు ఇది ఒక్కటి మాత్రమే.

ఈ చిత్రానికి సంగీతం రమేష్ నాయుడు అందించారు. సాహిత్యం సిరివెన్నెల, సినారె అందించారు. 'సిన్నీ సిన్నీ కోరికలడగా' ఈ పాటలోని విశేషమేమంటే తను పెళ్ళి చేసుకోబోయే వరుడైన సాంబయ్యను తానే పెళ్ళికొడుకుగా ముస్తాబు చేస్తూ పాడుతుంది గంగ. దీనితో పాటు 'సిగ్గూ పూబంతి విరిసే సీతామాలచ్చి', 'పారాహుషార్' పాటలు ప్రధానమైనవి. వీటితో పాటు గిరిజనుల్లోని ఒక తెగ యొక్క వివాహ ఆచారాన్ని చెప్తూ సాగే పాట 'కాముడు కాముడు'. ఇవే కాక మరోచోట సన్నివేశానికి తగినట్లుగా అరుంధతీ–వశిష్ఠుల వివాహ వృత్తాంతాన్ని చెప్పడం. ఇంకొక చోట నండూరి 'ఎంకి పాటలు' లోని పంక్తులను శారదకు వివాహం చేసి పంపాక భాదలో సాంబయ్య ఆమెను గుర్తుచేసుకుంటూ ఉపయోగిస్తాడు.

"స్వయం కృషి" చలన చిత్రం కాదు వ్యక్తిత్వ వికాస పుస్తకం – మెగాస్టార్ చిరంజీవి (ఒక ఇంటర్వ్యూలో)

పై మాటలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. చెట్టు ఎంత ఎదిగినా మూలం వేర్లలోనే వుంటుంది. అలాగే మనిషి ఎంత ఎదిగినా తన మూలాలను మరవకుండా జీవించడంలోనే ఆదర్శప్రాయమైన జీవితం వుంటుందనే విషయాన్ని విరచితం చేసిన విశ్వనాథుని సృష్టి ఈ "స్వయం కృషి".

**చిత్రం : స్వయం కృషి**

తారాగణం : చిరంజీవి, విజయశాంతి, సుమలత, సర్వదమన్ బెనర్జీ, చరణ్ రాజ్, జె.వి.సోమయాజులు, మాస్టర్ అర్జున్, బ్రహ్మానందం తదితరులు.

నిర్మాణ సంస్థ : ఏడిద నాగేశ్వరరావు

మాటలు : సాయినాథ్ తోటపల్లి

సాహిత్యం : సిరివెన్నెల, సినారె

సంగీతం : రమేష్ నాయుడు

కథ, దర్శకత్వం : కె.విశ్వనాథ్

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 10 (59) హైదరాబాద్ ఆగస్టు : 2022

# సాగి కమలాకర శర్మ 'మూడు గ్రంథాల ఆవిష్కరణోత్సవం'

**డా. అట్టెం దత్తయ్య,** ఫోన్: 949471 5445

**"జన్మోత్సవ సంరంభం చేస్తున్నారు**
**బంధువులూ మిత్రులు నవ్వేస్తున్నారు**
**జీవితము ఒక వర్షం గడచినవేళ**
**దుఃఖించాలన్నది మరిచేస్తున్నారు" (దాశరథి, రుబాయీ)**

పుట్టినరోజు ఉత్సవాన్ని ఎందుకు చేయాలి? ఎందుకు చేయకూడదు? అనే విషయాల తారతమ్యం తెలియకుండానే అందరు చేస్తున్నారు. జీవితంలో ఏ చిన్న వస్తువు కోల్పోయిన బాధపడే మనిషి అమూల్యమైన వయసును కోల్పోతే మాత్రం పండగెందుకు చేసుకుంటున్నారు? ఈ కోణంలో చూసినపుడు దాశరథిగారు అన్నది నిజమే. ఇది ఎక్కువ మందికి వర్తించే విషయం కాబట్టే వారట్ల అన్నారు. కాని కొందరి విషయాలకు అది వర్తించదు. తరిగిపోయిన ఆ సంవత్సరంలో సమాజోపయోగ పనులు చేసినవారు కొందరుంటారు. ఆ దృష్ట్యా ఆ సంవత్సరానికి కృతజ్ఞతాపూర్వకంగా ఒకరోజు ఉత్సవంగా జరుపుకోచ్చు. "గతకాలము మేలు వచ్చు కాలముకంటెన్''కదా. అందుకే కొందరు వారి పుట్టిన ప్రజోపయోగంగా మార్చుకొని ఆనాథాశ్రమాలకు, వృద్ధాశ్రమాలకు వారి వంతు చేయూతనిస్తున్నారు. సాహితీ ప్రియులు, రచయితలు, కవులు ఆ రోజుకు ఒక మంచి పుస్తకాన్ని ప్రచురించి, ఆవిష్కరించుకోవడం కనిపిస్తుంది.

ఇలాంటి సాహిత్య, సాంస్కృతిక సంబంధ పండగే జులై 28, 2022న 'వేద సంస్కృతి పరిషత్, మూసీ సాహిత్య ధార' సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. అది డా. సాగి కమలాకర శర్మగారి 50వ పుట్టినరోజు. వారు రాసిన మూడు **'శ్రీకరం, పరాత్పరం, కమలాకరం'** అనే పుస్తకాలను ఆవిష్కరణ, అంకితోత్సవం.

ఈ సమావేశానికి అధ్యక్షులుగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నిఘంటు నిర్మాణ శాఖ ఆచార్య వై.రెడ్డి శ్యామల గారు బాధ్యత నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డా. శ్రీరంగాచార్య, శ్రీ అష్టకాల రాంమోహన్, ఆచార్య వి. కిషన్‌రావులు వేదికను అలంకరించారు. ఈ ముగ్గురి ఆశీర్వచనీయమైన, ప్రశంసనీయమైన ప్రసంగాలు అందరిని అలరించడంతో పాటు రచయిత సామర్థ్యాన్ని తెలియజేసాయి. ఈ అతిథిత్రయం మూసీ పరివారానికి ఆత్మీయులు. కొన్నాళ్ళుగా పత్రిక వ్యవస్థాపకుల, సంపాదకుల, పత్రికనిర్వహణల కష్టసుఖాలను దగ్గరుండి గమనించినారు. వారి వృత్తితో పాటు పత్రికను నడుపుతూ సాహిత్యాన్ని శాస్త్రీయ కోణంలో విశ్లేషిస్తూ ఈ మూడు గ్రంథాలు తీసుకురావడం హర్షణీయం అని కొనియాడారు.





శ్రీసూక్తాన్ని వైజ్ఞానిక కోణంలో విశ్లేషణ చేసిన ప్రసంగవ్యాసాల గ్రంథమే 'శ్రీకరం'. ఈ గ్రంథాన్ని గురించి సమీక్షించిన వారు డా. కాకునూరి సూర్యనారాయణమూర్తి. సామాన్యుల నుండి పండితుల వరకు తెలుసుకోవల్సిన కొన్ని అమూల్య అంశాలతో కూడిన ఉపన్యాసాల సమాహారం 'పరాత్పరం'. ఈ గ్రంథ భావావిష్కర్త శ్రీ ఆకెళ్ల రాఘవేంద్ర. మూసీ పునఃప్రారంభం అయిన 2005 ఏప్రిల్ నుండి 2015 వరకు వారు రాసిన సంపాదకీయాల సంపుటి 'కమలాకరం'. ఈ గ్రంథాన్ని పరిచయం చేసింది డా. భాస్కరయోగి. గ్రంథాల లోతుల్లోకి వెళ్ళగలిగిన ఈ వక్తలు వారి చక్కని ప్రసంగాలతో వాటికి మరింత వన్నె తెచ్చారు. ఈ మూడింటిలో 'శ్రీకరం'ను త్రిశక్తి అమ్మవారికి, 'కమలాకరం'ను తల్లిదండ్రులకు, 'పరాత్పరం'ని ఆత్మీయ మిత్రుడు డా. శ్రీనివాస గుప్తగార్లకు కమలాకర శర్మ గారు అంకితమిచ్చారు.

చివరగ రచయిత స్పందన అనంతరం ముఖ్య అతిథులను, వక్తలను సన్మానించారు. వీరితో పాటు పుస్తకాలు రావాడానికి ప్రత్యక్షంగా పరోక్షంగా సహకారాన్ని అందించిన, జె.ఎల్. అనూరాధ, పరవస్తు అనూరాధ, విజయ, గాయత్రి, మనోహరి, ఎం. అశోకచారి, దత్తయ్య, వడ్లాపురం క్రిష్ణ, శ్రీనాథ్, తేజశ్రీ, వేణులను సన్మానించారు.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 10

UGC Care List Approved Journal
హైదరాబాద్ ఆగస్టు : 2022










## శిలాక్షరం


**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**

**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**

**వెల : 300/-**





**సంప్రదించండి.**

**మూసీ మాసపత్రిక**

**ఫోన్ : 934 7971177**


ఈ సమావేశంలో ఎందరో ఆచార్యులు, ఆధ్యాత్మిక వేత్తలు, జ్యోతిషశాస్త్ర పండితుల, తెలుగు పరిశోధకులు, విద్యార్థులు రెండువందలకు మంది పైగా పాల్గొని విజయవంతం చేసారు. అందరూ డా. కమలాకర శర్మ గారిని అభినందించినారు. డా. అట్టెం దత్తయ్య ఆహ్వానంతో ప్రారంభమైన ఈ వేదిక డా. మంత్రి శ్రీనివాస్ వందన సమర్పణతో ముగింసింది.



**శ్రీకరం**

వైజ్ఞానిక కోణంలో శ్రీసూక్తం

వెల : 200 /-

**ప్రతులకు** : 2-2-1109/బికె-ఎల్ఐజి 10, బతుకమ్మ కుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013.

ఫోన్ : 934 797 1177





**పరాత్పరం**

అమృతభావనలు, సంపుటం - 1

వెల : 200 /-

**ప్రతులకు** : 2-2-1109/బికె-ఎల్ఐజి 10, బతుకమ్మ కుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013.

ఫోన్ : 934 797 1177





**కమలాకరం**

మూసీ సంపాదకీయాలు, సంపుటం-1

వెల : 200 /-


**ప్రతులకు** : 2-2-1109/బికె-ఎల్ఐజి 10, బతుకమ్మ కుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013.

ఫోన్ : 934 797 1177





**సారాంశం (పరిశోధక గ్రంథాలు-పరిచయ వ్యాసాలు) సంపుటి - 2**
సంపాదకుడు - డా. అట్టెం దత్తయ్య
వెల : 350 /-
**ప్రతులకు :** 2-2-1109/బికె- ఎల్ఐజి 10, బతుకమ్మ కుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013.
ఫోన్ : 9494715445








**మన తెలుగు**
- జన్ను లక్ష్మి
వెల : 100/-
**ప్రతులకు :** వాత్సల్య పబ్లిషర్స్ మియాపూర్, హైదరాబాద్.
ఫోన్ : 915 430 8921




**కావ్య తరంగాలు (చతుష్షష్టి పద్య వ్యాఖ్యలు)**
డా. వజ్జల రంగాచార్య
వెల : 200 /-
**ప్రతులకు :** డా. వజ్జల వసుమతి, 2-6-1217, కె.ఎల్.ఎన్.రెడ్డి కాలనీ, సుబేదారి, హన్మకొండ - 506 001. ఫోన్ : 98491 69182




**విరాళి (వచన కవితలు)**
- జన్ను లక్ష్మి
వెల : 150/-
**ప్రతులకు :** వాత్సల్య పబ్లిషర్స్ మియాపూర్, హైదరాబాద్.
ఫోన్ : 915 430 8921




**తెలుగుల వైభవం (పద్యకావ్యం)**
- పులికొండ సుబ్బాచారి
వెల : 250/-
**ప్రతులకు :** రచయిత, ఫ్లాట్ 302, జెఆర్ అపార్ట్‌మెంట్స్, 6-77, చందా నగర్, హైదరాబాద్ - 500 050
ఫోన్ : 94404 93604

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 - 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 - 00
3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు రూ. 350 - 00
4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు రూ. 100 - 00
5. శాసన సంపుటి రూ. 150 - 00
6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతిరూ. 100 - 00
7. షబ్నవీస్ శతజయంతి సంచిక రూ. 100 - 00
8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 - 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 - 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 - 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 - 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 - 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 - 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 - 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 - 00

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/
బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,
బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.


చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట,
హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
**editormusi@gmail.com**

# జగద్గురోర్భారతి



నను గన్న తల్లీ ప్రియభారతీ
విశ్వైక పావనీ జగద్గురోర్భారతీ

నిగమాలకెల్ల ఆలవాలమై
శాస్త్రాలకెల్ల పురిటి గడ్డవై
జ్ఞానకాంతికెల్ల దీపశిఖరమై
సంస్కృతీ కళలకు ఆయువుపట్టౌ
॥ నను గన్న ॥



ధ్రువ భగీరథాది ఘనులకు నెలవువై
హరిశ్చంద్ర సగరాది ప్రభువుల కొలువువై
వాల్మీకి భాసాది కవన దీప్త కన్యవై
చాణక్యాదుల ధీయుక్తి కీర్తి కాంతవౌ
॥ నను గన్న ॥

ఆర్యభట్ట సుశ్రుతుల విజ్ఞాన మోమువే
శీతాద్రి వింధ్యాద్రుల పాదసత్పీఠమువే
జీవవాహినులన్నింటి కాస్యకుహరమై
వేవేల ఋషులకెపుడావాస కేంద్రమౌ
॥ నను గన్న ॥

ఘన వీర్య చంద్రికలకు నిలువుటద్దము
శాస్త్ర సాంకేతికతలకు శిఖరాయమానము
ప్రజాస్వామ్య ప్రభలకు మార్గదర్శనం
సమైక్య భావనల పుణ్యసార క్షేత్రము
॥ నను గన్న ॥



వజ్రోత్సవ వైభవ జయము నీకు మాత
వజ్రోత్సవ వైభవ జయము నీకు మాత ॥
జయ జయహో జయ జయహో విజయమె నీకు
జయ జయహో జయ జయహో విజయమె నీకు

**డా. వొజ్జల శరత్ బాబు**
ఫోన్ : 94941 83937

Regd No. R.N.37723/80
P.R.No.HSE-824/2020-2022
Date of Publication 1st of Every Month
Date of Posting 5th / 6th of Every Month


# హరిహర త్రిశక్తి క్షేత్రం

నవాలయ ఆవరణం, శ్రీ విద్యాపురం, వలిగొండ, యాదాద్రి జిల్లా.



## ఆలయ నిర్మాణ, నిర్వహణకు సహకరించండి.....

దాతలు తమ సహకారం ఆన్‌లైన్ ద్వారా కూడ అందించవచ్చు.
**State Bank of India, Nallakunta Branch,**
**A/c. No. 62011461764, IFSC Code : SBIN0020083**

**రండి ... ఈ ధర్మయజ్ఞంలో అందరం పాలుపంచుకుందాం.**

## వేద సంస్కృతి పరిషత్

వైదిక సాంస్కృతిక ఉద్దీపన పరిశోధనా సంస్థ
సెల్ : 9704227744, 9347971177
Website : www.vsparishath.com, E-mail : vsp613@gmail.com


From :
**The Manager, MUSI Telugu Monthly Magazie**
# 2-2-1109/BK - LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad- 500 013.
Cell : 9347971177, Email : editormusi@gmail.com

Printed, Published and Owned by : B.Anantha Laxmi, Printed at Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
Published at H.No.3-4-245/1, Lingampally, Hyderabad - 500 027. Telangana
Editor : Dr.Sagi Kamalakara Sharma